జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జిలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు 9440231967, 7989694528



రంగారెడ్డి | శనివారం12 ఏప్రిల్ 2025 | సంపుటి : 15 | సంచిక : 217 | వెల : రూ.5 | పేజీలు : 8 | RNI NO. APTEL/2010/36516

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పూర్ణిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail.prajajyothidaily@gmail.com




## పద్మ అవార్డుల ఎంపిక ప్రక్రియ

- నేరుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తుల ఆహ్వానం
- జూలై 31 వరకు సమర్పించాలని వెల్లడి

10



## ఏపీలో రూ.1,510 కోట్ల పన్ను ఎగవేత

సెంట్రల్ జీఎస్టీ ఆడిట్ కమిషనరేట్ కమిషనర్ వెల్లడి

02




## నేడు ఏపీలో ఇంటర్ ఫలితాల ప్రకటన

- అధికారిక వెబ్‌సైట్.. వాట్సాప్‌లో వెల్లడి
- ఫలితాలపై సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన లోకేశ్

02



## మాతృభాషకు విద్యార్థులను దూరం చేయొద్దు

ఎక్స్‌లో పోస్ట్ చేసిన వెంకయ్యనాయుడు

04



# బీసీల సంక్షేమానికి రూ.48 వేల కోట్లు

## ఫులే స్ఫూర్తితోనే సుపరిపాలన అందిస్తున్నాం

- పీ4లో లక్ష మంది మహిళా పారిశ్రామికవేత్తలను తయారుచేస్తాం
- ఆగిరిపల్లి 'ప్రజావేదిక'లో ముఖ్యమంత్రి చంద్రబాబు



'జ్యోతిరావ్ ఫులె ఆశయాలే స్ఫూర్తిగా కూటమి సర్కారు సుపరిపాలన సాగిస్తోంది. తెదేపాకు వెన్నెముకలా నిలిచిన బీసీల రక్షణకు, అభ్యున్నతికి కట్టుబడి ఉంటాం. బీసీల సంక్షేమానికి రూ.48 వేల కోట్లు ఖర్చు చేస్తాం' అని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. పేదలకు ఆర్థిక దన్ను అందించేందుకు రూపొందించిన పీ-4 కార్యక్రమం.. ఆర్థిక అసమానతలు రూపుమాపే బ్రహ్మాస్త్రంలా పని చేస్తుందన్న నమ్మకం ఉందని ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం ఏలూరు జిల్లా ఆగిరిపల్లిలో నిర్వహించిన జ్యోతిరావ్ ఫులె జయంతి వేడుకల్లో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. పీ4 కార్యక్రమంలో భాగంగా ఆగిరిపల్లిలో ప్రజావేదిక సభలో ఆయన మాట్లాడారు.

**ఏలూరు, ఏప్రిల్ 11 :** 'పీ4 ద్వారా లక్ష మంది మహిళా పారిశ్రామికవేత్తలను తయారు చేస్తాం. సంక్షేమ వసతిగృహాలకు రూ.405 కోట్లు ఇచ్చాను. సివిల్స్, గ్రూప్ పరీక్షలు రాసే విద్యార్థులకు శిక్షణ శిబిరాలు, బీసీ స్టడీ సర్కిళ్లు, శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేస్తాం. అమరావతిలో ఒక బ్యాచ్‌లో 500 మందికి ఉచితంగా సివిల్స్ శిక్షణకు కేంద్రాన్ని పెడుతున్నాం. డీఎస్సీ అభ్యర్థులకు సైతం ఉచిత శిక్షణకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఆదరణ పథకం కింద ఏటా రూ.వెయ్యి కోట్లు ఖర్చు చేస్తాం. అప్పులు చేసి సంక్షేమం అమలు చేస్తే రాష్ట్రం కష్టాల్లో కూరుకుపోతుంది. అందుకే సంపద సృష్టించి సంక్షేమానికి ఖర్చు పెడతాం' అని సీఎం వివరించారు.

మిగతా 2 లో



## మంగళగిరిలో తొలి ప్రభుత్వ లీప్ పాఠశాల

- అత్యున్నత ప్రమాణాలతో ఏర్పాటు
- ఇళ్ల పట్టాల పంపిణీలో నారా లోకేశ్ వెల్లడి

**అమరావతి, ఏప్రిల్ 11 :** లెర్నింగ్ ఎక్సలెన్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్ పేరిట నూతన విద్యా విధానానికి శ్రీకారం చుడుతున్నామని విద్యా, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. అత్యున్నత ప్రమాణాలతో తొలి ప్రభుత్వ లీప్ పాఠశాలను మంగళగిరిలో ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు. ఎన్డీఏ కూటమి ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని ఓ క్రమపద్ధతిలో నెరవేరుస్తోందని అన్నారు. ఇచ్చిన ప్రతీ హామీ నిలబెట్టుకుంటామని మంత్రి నారా లోకేష్ వ్యాఖ్యానించారు. మంగళగిరికి మంజూరైన ఆంధప్రదేశ్‌లో తొలి వందపడకల ప్రభుత్వ ఆస్పత్రికి 13వ తేదీన శంకుస్థాపన చేస్తున్నామని మంత్రి నారా లోకేష్ వెల్లడించారు. ప్రతిపక్షంలో ఉండగానే మంగళగిరి కోసం సొంత ఖర్చులతో 26 సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తే... అధికారంలో ఉండగా ఇంకెంత చేయగలనో ఆలోచించాలని అన్నారు. మంగళగిరిలో పోటీ చేయాలని 2019లో తీసుకున్న నిర్ణయం తన జీవితాన్నే మార్చేసిందని చెప్పారు. మంగళగిరిలో నాల్గో రోజు 'మన ఇల్లు-మన లోకేష్' కార్యక్రమం చేపట్టారు. పేదలకు మంత్రి నారా లోకేష్ శాశ్వత ఇంటి పట్టాలు అందజేస్తున్నారు. రత్నాల చెరువుకు చెందిన 600 మందికి, తాడేపల్లిలోని మహానాడు ప్రాంతానికి చెందిన 430 మంది పేదలకు శాశ్వత పట్టాలు పంపిణీ చేశారు. మొత్తం 1030 పేద కుటుంబాలకు శాశ్వత ఇంటి పట్టాలను మంత్రి నారా లోకేష్ పంపిణీ చేశారు.



## ఒంటిమిట్ట సీతారామలక్ష్మణులకు స్వర్ణ కిరీటాలు

## పెళ్లికొడుకైన కోదండరాముడు

- ఒంటిమిట్టలో వైభవంగా కల్యాణం
- భారీగా తరలివచ్చిన భక్త జనం
- పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం చంద్రబాబు దంపతులు





## అభివృద్ధి.. వారసత్వం లక్ష్యంగా పయనం

- 2036 ఒలింపిక్స్ కోసం భారత్ ప్రయత్నం
- విపక్షాలది కుటుంబ రాజకీయం
- వారికి అభివృద్ధి కన్నా స్వప్రయోజనాలే ముఖ్యం
- వారణాసిలో పలు అభివృద్ధి పనులకు మోడీ శ్రీకారం
- ఇటీవలి అత్యాచార ఘటనపై అధికారులతో ఆరా



10

## భగ్గుమన్న బంగారం ధరలు

మేలిమి బంగారం రూ.96,450కు చేరిక



10

## ఏపీలో రూ.1,510 కోట్ల
# పన్ను ఎగవేత

### సెంట్రల్ జీఎస్టీ ఆడిట్ కమిషనరేట్ కమిషనర్ వెల్లడి

**విశాఖపట్నం:** ఆంధ్రప్రదేశ్‌లో 2024-25లో రూ.1,510 కోట్ల మేర సెంట్రల్ జీఎస్టీని ఎగవేసినట్లు గుర్తించామని గుంటూరు సెంట్రల్ జీఎస్టీ ఆడిట్ కమిషనరేట్ కమిషనర్ పి.ఆనంద్‌కుమార్ తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.2,682 కోట్ల పన్నును ఎగవేశారని తెలిపారు. ఏపీలో సీజీఎస్టీ కట్టేవారు 1.81 లక్షల మంది ఉండగా, రాష్ట్ర జీఎస్టీ చెల్లింపుదారులు 2 లక్షల మందికిపైగా ఉన్నారని వివరించారు. నకిలీ ఇన్వాయిస్‌లు సృష్టించి ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్న వారిపై ప్రత్యేక దృష్టి సారించినట్లుచెప్పారు. విశాఖ జీఎస్టీ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన పలు అంశాలు వివరించారు.

**రూ.150 కోట్ల రికవరీ**

కేంద్ర అంచనా ప్రకారం 30 శాతం మేర పన్ను ఎగవేతలు ఉన్నట్లు గుర్తించామన్నారు. వీటిని అరికట్టేందుకు ఇన్వాయిస్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ అమలులోకి తెచ్చామన్నారు. సెంట్రల్ జీఎస్టీ ఆడిట్ ద్వారా 2023-24 ఆర్థిక సంవత్సరంలో రికవరీ రూ.71 కోట్లు కాగా, 2024-25లో రూ.150 కోట్లకు పైగా వచ్చిందన్నారు. రెండు లక్షల యూనిట్లు ఉంటే, కేవలం 902 యూనిట్లలోనే ఆడిట్ జరిగిందని, ఇకపై ఏఐ ద్వారా యూనిట్లను గుర్తించి ఆడిట్ చేసేలా ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు.

**గుంటూరుకు కమిషనరేట్ కార్యాలయం**

'గుంటూరు సీజీఎస్టీ ఆడిట్ కమిషనరేట్.. మా కార్యాలయం పేరు. అయితే ఇది ప్రస్తుతం విశాఖ కేంద్రంగా పనిచేస్తోంది. గుంటూరు అయితే రాజధాని అమరావతికి దగ్గరగా ఉండటంతోపాటు ఆడిటర్లకు అందుబాటులో ఉంటుందన్న ఆలోచనతో గుంటూరులో స్థలం కొని కార్యాలయం ఏర్పాటు చేయనున్నాం' అని ఆనంద్‌కుమార్ తెలిపారు. 'ఏపీ సెంట్రల్ జీఎస్టీ ద్వారా గత ఆర్థిక సంవత్సరంలో రూ.25 వేల కోట్ల ఆదాయం వచ్చింది. అంతకు ముందు సంవత్సరంతో పోల్చితే ఇది ఒక శాతం పెరిగింది. అనంతపురం జిల్లాలో కియా సంస్థ ఉండటం వల్ల అక్కడ ట్యాక్స్ వసూలు ఎక్కువగా ఉంటుంది. విశాఖలో తగ్గడానికి స్టీలు ప్లాంటు ఇబ్బందుల్లో ఉండటం ఓ కారణం' అని వివరించారు.




## నేడు ఏపీలో ఇంటర్ ఫలితాల ప్రకటన

- అధికారిక వెబ్‌సైట్.. వాట్సాప్‌లో వెల్లడి
- ఫలితాలపై సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన లోకేశ్

**అమరావతి, ఏప్రిల్ 11 :** ఏపీలో శనివారం ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలు విడుదల కానున్నాయి. ఈ మేరకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. శనివారం ఉదయం 11 గంటలకు ఇంటర్మీడియట్ రెండు సంవత్సరాల పరీక్షల ఫలితాలు విడుదల చేస్తామన్నారు. విద్యార్థుల తమ ఫలితాలను ఆన్‌లైన్‌లో చూసుకోవచ్చునని తెలిపారు. మన మిత్ర వాట్స్ యాప్ నంబర్‌కు 9552300 009లో కూడా ఫలితాలు తెలుసుకోవచ్చునని చెప్పారు. అందరికి మంచి ఫలితాలు రావాలని కోరుకుంటూ మంత్రి నారా లోకేష్ శుభాకాంక్షలు చెప్పారు. కాగా ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు మార్చి1న ప్రారంభం అయ్యాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించారు.మార్చి 20వ తేదీ వరకు పరీక్షలు జరిగాయి. ఇప్పటికే ఇంటర్ పరీక్షల మూల్యాంకనం వేగంగా కొనసాంది. ఏప్రిల్ 6 నాటికి మూల్యాంకనం పూర్తి చేశారు. ఆ తర్వాత ఫలితాలను కంప్యూటరీకరణ చేసేందుకు 5-6 రోజుల సమయం పట్టింది. తొలిరోజు మొదటి సంవత్సరం విద్యార్థులకు ద్వితీయ భాషపై పరీక్ష నిర్వహించారు. ఇంటర్మీడియట్ రెండు సంవత్సరాల విద్యార్థులకు రోజు మార్చి రోజు పరీక్షలు జరిగాయి. ఈ క్రమంలో అధికారులు రాష్ట్ర వ్యాప్తంగా 1,535 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. 10.58 లక్షల మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమేరాలు ఏర్పాటు చేసి ఆన్‌లైన్‌లో ఉన్నతాధికారుల కార్యాలయాలకు అనుసంధానం చేశారు. పరీక్షా కేంద్రాలను 'నో మొబైల్ జోన్'గా ప్రకటించారు. ఈ సంవత్సరం - టెన్త్, ఇంటర్ హాల్‌టికెట్లు విడుదల చేసినట్టుగానే వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ఫలితాలు కూడా విడుదల చేసేందుకు సన్నాహాలు చేశారు. అధికారిక వెబ్‌సైట్ ద్వారా విద్యార్థులు తమ ఫలితాలను చూసుకోవచ్చు. ఇకపోతే తెలంగాణలో ఇంటర్ పరీక్షలు మార్చి 5న మొదలై 25వ తేదీతో ముగిసాయి. ప్రస్తుతం మూల్యాంకన పక్రియ వేగంగా కొనసాగుతోంది. ఏప్రిల్ చివరి వారంలో ఫలితాలు విడుదల చేయనున్నట్లు- తెలంగాణ రాష్ట్ర ఇంటర్మీడియట్ విద్యా మండలి అధికారిక వర్గాల సమాచారం.



## ఒంటిమిట్ట సీతారామలక్ష్మణులకు
# స్వర్ణ కిరీటాలు

**ఒంటిమిట్ట :** వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్ట కోదండ రామాలయం గర్భగుడిలో కొలువైన సీతారామలక్ష్మణులకు పారిశ్రామికవేత్త, పెన్నా ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ పుట్టంరెడ్డి ప్రతాప్‌రెడ్డి, కుటుంబ సభ్యులు రూ.6,66,99,084 విలువైన 7,172.464 గ్రాముల బరువుగల మూడు బంగారు కిరీటాలను కానుకగా సమర్పించారు. ప్రతాప్‌రెడ్డి, లక్ష్మీదేవి దంపతులు, కుమార్తె దీప్తి, ఆయన సోదరుడు రమేష్‌రెడ్డి-సుప్రియ దంపతులు, వదిన పద్మావతమ్మ, కుటుంబ సభ్యులు శుక్రవారం ఈ కిరీటాలను రామయ్య క్షేత్రానికి తీసుకొచ్చి తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో జె.శ్యామలరావుకు అందజేశారు. అనంతరం గర్భాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ప్రతాప్‌రెడ్డి, రమేష్‌రెడ్డి సోదరులను ఛైర్మన్ బీఆర్ నాయుడు శేషవస్త్రంతో సత్కరించారు. ఈ సందర్భంగా దాత ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ ఐదేళ్ల కిందట అనుకున్న మొక్కు మేరకు బంగారు కిరీటాలను ప్రత్యేకంగా తయారు చేయించినట్లు తెలిపారు. కిరీటాలతో పాటు రూ.3.52 లక్షల విలువైన మూడు వెండిపళ్లేలను కూడా అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో నటేష్‌బాబు, ప్రత్యేక అధికారి రామరాజు, విక్రమ్‌రెడ్డి, ఆకేపాటి వేణుగోపాల్‌రెడ్డి, లంకా రామిరెడ్డి, గజ్జల శ్రీనివాసులురెడ్డి, అరవ శ్రీనివాసులురెడ్డి, పాటూరు సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

# బీసీల సంక్షేమానికి రూ.48 వేల కోట్లు



'ఫులె బాటలోనే ఎన్టీఆర్ మహిళల విద్యకు పెద్దపీట వేసి మహిళా విశ్వవిద్యాలయాన్ని స్థాపించారు. తెదేపా అధికారంలోకి వచ్చే వరకు బీసీలకు న్యాయం జరగలేదు. ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీ చట్టం మాదిరిగానే త్వరలో బీసీలకు సైతం రక్షణ చట్టం తీసుకొస్తాం. దీనిపై ఇప్పటికే సబ్ కమిటీ వేశాం. ఆ నివేదిక ఆధారంగా చట్టాన్ని రూపొందిస్తాం. స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లను గత ప్రభుత్వం 24 శాతానికి తగ్గించింది. మళ్లీ 34 శాతానికి పెంచుతాం. నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు 33 శాతం రిజర్వేషన్ అమలు చేస్తాం. నాయీబ్రాహ్మణ, ఎంబీసీ ఫెడరేషన్, బీసీ కార్పొరేషన్లు ఏర్పాటు చేశాం. బీసీ భవనాలు ఏర్పాటు చేస్తున్నాం. బీసీ విద్యార్థులకు గురుకుల పాఠశాలల ఏర్పాటుతోపాటు విదేశాల్లో చదువుకునేందుకు ఒక్కో విద్యార్థికి రూ.15 లక్షలు ఇస్తాం' అంటూ సీఎం భరోసా నింపారు. 'బీసీల ఆదాయం పెంచేందుకు కల్లుగీత కార్మికులకు మద్యం దుకాణాలు కేటాయిస్తున్నాం. నేతన్నలకు ఉచిత విద్యుత్తు సదుపాయం కల్పిస్తున్నాం. బీసీలకు సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు కోసం 2 కిలోవాట్లకు రూ.80 వేలు, 3 కిలోవాట్లకు రూ.98 వేల రాయితీ ఇస్తున్నాం. దేవాలయాల్లో పని చేసే నాయీబ్రాహ్మణుల వేతనం రూ.15 వేల నుంచి రూ.25 వేలకు పెంచాం' అని సీఎం చెప్పారు.

**వ్యక్తిత్వ హననాన్ని సహించను**

'సామాజిక మాధ్యమాల్లో మహిళలపై అసభ్యకర పోస్టులు పెడుతున్నారు. వ్యక్తిత్వ హననం చేస్తే వాళ్లకు అదే చివరిరోజు అవుతుంది. తప్పు చేసిన వారి విషయంలో చండశాసనుడిలా మారతా' అని చంద్రబాబు హెచ్చరించారు. 'వివేకానందరెడ్డి గుండెపోటుతో చనిపోయారని ప్రచారం నమ్మి మోసపోయా. అది గొడ్డలి వేటు అని ఆ తర్వాత కానీ తెలియలేదు. తప్పుడు ప్రచారం చేసినా, తప్పుగా మాట్లాడినా చర్యలు తప్పవు. గత పాలనలో ఎవరూ స్వేచ్ఛగా తిరగలేదు. మా ప్రభుత్వం ఇస్తున్న స్వేచ్ఛను ఎవరూ దుర్వినియోగం చేసుకోవద్దు' అని హితవు పలికారు. కార్యక్రమాల్లో మంత్రులు సవిత, పార్థసారథి, జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# పెళ్లికొడుకైన కోదండరాముడు

- ఒంటిమిట్టలో వైభవంగా కల్యాణం
- భారీగా తరలివచ్చిన భక్త జనం
- పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం చంద్రబాబు దంపతులు



**ఒంటిమిట్ట:** వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్టలో శుక్రవారం పండు వెన్నెల్లో శ్రీకోదండరాముని కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. సీతారామచంద్రుల కల్యాణ మహోత్సవ సందర్భంగా కోదండ రామాలయాన్ని శోభాయమానంగా ముస్తాబు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దంపతులు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఏకశిలా నగరంగా పేరొందిన ఈ ప్రసిద్ధ పుణ్యక్షేత్రంలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగిన సీతారాముల కల్యాణోత్సవాన్ని వీక్షించేందుకు భక్తజనం అశేషంగా తరలివచ్చారు. హస్తా నక్షత్ర యుక్త శుభలగ్నంలో జరిగిన జానకిరాముల పరిణయ వేడుకలను తిలకించడానికి వచ్చిన భక్తులకు కల్యాణ తలంబ్రాలను పంపిణీ చేశారు. వాటితో పాటు తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం, పసుపు, కుంకుమలు అందజేశారు. సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. జగత్ కల్యాణ ఘట్టం పండు వెన్నెలలో కనులపండువగా సాగింది. సీతారాముల కల్యాణం జరిగిన ప్రాంగణం కొంగొత్త శోభతో దేదీప్యమానంగా ప్రకాశించింది. దేశవిదేశాల నుంచి తీసుకొచ్చిన అరుదైన పుష్పాలతో కల్యాణ మండపాన్ని అలంకరించారు. సీఎం చంద్రబాబు దంపతులు ఉత్సవం చివరి వరకు వీక్షించి స్వామివారి ఆశీస్సులు అందుకున్నారు. ఒంటిమిట్టలోనే రాత్రి బస చేశారు. శనివారంఉదయం హైదరాబాద్‌కు వెళ్లనున్నారు. శ్రీరామ రాజ్యాన్ని మళ్లీ స్థాపించాలనే తపన తనదని, ప్రజలందరూ శ్రీరాముడు చూపించిన నీతి, ధర్మాన్ని అనుసరించి జీవించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆకాంక్షించారు. వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్టలో శుక్రవారం జరిగిన శ్రీసీతారాముల కల్యాణోత్సవంలో సతీసమేతంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ శ్రీరాముడు ఒక వాగ్దానాన్ని ఎలా నిలబెట్టుకోవాలో.. తండ్రి ఆజ్ఞను ఎలా విధిగా పాటించాలో, కుటుంబ బంధాలను ఎలా పరిపూర్ణంగా పోషించాలో తెలియజేశారన్నారు. తిరుమల తరహాలో ఒంటిమిట్టలో పవిత్రతను కాపాడతామన్నారు. రాష్ట్ర విభజన తర్వాత ఒంటిమిట్ట ఆలయాన్ని ప్రధాన పుణ్యక్షేత్రంగా గుర్తించి అభివృద్ధి చేశామని వివరించారు. తిరుమల తరహాలో ఇక్కడా అన్నప్రసాద వితరణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడంతో పాటు తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు ద్వారా ప్రకటన చేయించారు. ఒంటిమిట్టను పుణ్యభూమిగా మార్చడానికి కొండలపై ఆయుర్వేద మొక్కలను పెంచనున్నట్లు వివరించారు. దేవాలయాల పర్యాటక హబ్‌గా ఒంటిమిట్టను తీర్చిదిద్దుతామని ప్రకటించారు. మంత్రులు సవిత, ఆనం రామనారాయణరెడ్డి, రాంప్రసాద్‌రెడ్డి, తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, జేఈవో వీరబ్రహ్మం, కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, తితిదే సభ్యురాలు ఎల్లా సుచిత్ర పాల్గొన్నారు.

# ముంబయి దాడుల మాస్టర్ మైండ్స్

**ముంబయి :** 2008 ముంబయి దాడుల వెనక ఉగ్రవాదులుగా మారిన ఇద్దరు స్కూల్ ఫ్రెండ్స్ మాస్టర్ మైండ్స్‌గా వ్యవహరించారు. 166 మంది ప్రాణాలు పొట్టన పెట్టుకొన్నారు. అమెరికా చట్టాల్లోని లొసుగుల్ని వాడుకొని భారత్‌కు దొరక్కుండా తప్పించుకోవాలని విశ్వప్రయత్నం చేశారు. చివరికి ఒకరిని జాతీయ దర్యాప్తు సంస్థ భారత్‌కు తీసుకొచ్చింది. మరొకరు అమెరికా జైల్లోనే ఇప్పటికీ ఉన్నాడు. వారిద్దరి పేర్లే.. తహవ్వుర్ రాణా, డేవిడ్ కోల్‌మన్ హెడ్లీ. వీరిద్దరి వయస్సు 64 ఏళ్లు. వీరిద్దరూ పాక్‌లోని హసన్‌అబ్దుల్‌లోని సైనిక అకాడమీ అయిన క్యాడెట్ కాలేజ్ (సీసీహెచ్)లో చదువుకున్నప్పటి నుంచి మిత్రులు. ఇక్కడ బోర్డింగ్ స్కూల్, కాలేజ్ నిర్వహిస్తున్నారు. 8వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ఉంటాయి. వివిధ రకాల పరీక్షలు నిర్వహించి వీటిలోకి ఎంపిక చేస్తారు. పాకిస్థానీ దౌత్యవేత్త, బ్రాడ్‌కాస్టర్ అయిన దావూద్ సయ్యద్ గిలానీ, ఓ అమెరికా జాతీయురాలికి డేవిడ్ హెడ్లీ జన్మించాడు. ఆ తర్వాత గిలానీ కుటుంబం పాక్‌కు వలస వెళ్లింది. అక్కడే హెడ్లీ సీసీహెచ్‌లో చేరాడు. ఇక తహవ్వుర్ రాణా 1961లో ఓ హైస్కూల్ ప్రిన్సిపల్ కుటుంబంలో జన్మించాడు. ఇతడూ సీసీహెచ్‌లోనే చేరాడు. అక్కడే తొలిసారి హెడ్లీ-రాణా మిత్రులుగా మారారు. ఆ తర్వాత కాలంలో హెడ్లీ తల్లితో కలిసి అమెరికాలోని ఫిలడెల్ఫియాకు వెళ్లిపోయాడు. అక్కడ అతడు మాదక ద్రవ్యాల వ్యాపారం, కీలక సమాచారాన్ని ఏజెన్సీలకు విక్రయించడం వంటివి చేశాడు. పాక్‌లో లష్కరే, సైన్యానికి, ఇటు అమెరికాలోని సీఐఏకు ఇన్ఫర్మేషన్ చేరవేసేవాడు. మరోవైపు రాణా పాక్ ఆర్మీ మెడికల్ కోర్‌లో కెప్టెన్ హోదాలో పని చేశాడు. 1997లో ఆర్మీని వదిలేసి.. భార్యతో కలిసి కెనడాకు వలసవెళ్లి 2001 నాటికి పౌరసత్వం సంపాదించాడు. టొరంటోలో 'ఫస్ట్ వరల్డ్ ఇమిగ్రేషన్ సర్వీస్' పేరిట ఓ సంస్థను స్థాపించాడు. ఆ తర్వాత దాని కార్యాలయాలను చికాగో, న్యూయార్క్‌ల్లోనూ తెరిచాడు.

**2006 నుంచే ధ్వంస రచన..**

ఈ కంపెనీ ముసుగులోనే అతడు ముంబయి దాడులకు కుట్రను అమలుచేశాడు. 2006 నుంచి ముంబయి దాడులకు ధ్వంస రచన మొదలైంది. అదే ఏడాది హెడ్లీ తొలిసారి ముంబయిని సందర్శించాడు. అప్పుడు మెస్సర్స్ ఇమిగ్రేషన్ లా సెంటర్ పేరిట ఓ కార్యాలయం ఏర్పాటు కోసం ఆర్‌బీఐకి పత్రాలు సమర్పించాడు. వీటిపై రేమాండ్ జోసఫ్ శాండర్స్ అనే వ్యక్తి సంతకాలున్నాయి. ఇది రాణాకు చెందిన ఫస్ట్ వరల్డ్ ఇమిగ్రేషన్‌కు అనుబంధంగా పనిచేసింది. ఇందుకోసం టార్డియో ఏసీ మార్కెట్‌లో ఆఫీస్ స్పేస్ తీసుకొన్నాడు. భారత్ వచ్చినప్పుడు దానిని స్థావరంగా వాడుకొన్నాడు. మొత్తం ముంబయిలో ఎనిమిది సార్లు పర్యటించి రెక్కీలు నిర్వహించాడు. 26/11 దాడులకు రెండు వారాల ముందు రాణా స్వయంగా భారత్‌కు వచ్చాడు. అతడు ఫైవ్‌స్టార్ హోటల్ పొవాయ్‌లో దాదాపు 10 రోజుల పాటు తిష్ఠ వేసి కుట్రలు పన్నాడు.



**హెడ్లీకి వీసా రాణానే ఇప్పించాడు..**

డేవిడ్ హెడ్లీకి అవసరమైన వీసాను రాణానే ఇప్పించినట్లు జాతీయ దర్యాప్తు సంస్థ వెల్లడించింది. ఇందుకోసం అతడి పేరు, తండ్రి వివరాలను తప్పుగా చూపించారు. ముంబయిలో తన ఎనిమిది రెక్కీల సందర్భంగా హెడ్లీ నిరంతరం రాణాతో టచ్‌లో ఉన్నాడు. ఇందుకోసం 231 ఫోన్‌కాల్స్ చేశాడు. అతడు చేసిన సాయానికి ప్రతిగా.. పాక్ ఐఎస్ఐ అధికారులతో మాట్లాడి ఓ డీల్ కుదిర్చాడు. రాణా పాకిస్థాన్‌ను సందర్శించడానికి వీలుగా అతడికి మేజర్ ఇక్బాల్‌ను పరిచయం చేశాడు. దీంతో ఆ మేజర్ రాణాతో మాట్లాడినట్లు తేలింది. భారత్‌లో ఉన్నప్పుడు నేరుగా పాక్‌కు కాల్స్ చేయొద్దని హెడ్లీకి స్పష్టమైన ఆదేశాలున్నాయి.

**హెడ్లీ అరెస్టుతో విడిపోయిన ఉగ్ర మిత్రులు..**

ముంబయి దాడుల తర్వాత కూడా హెడ్లీ-రాణా టచ్‌లో ఉన్నారు. ఇక విజయవంతంగా ముంబయిలో మారణహోమం సృష్టించినందుకు ఉగ్రవాది లష్కరే సాజిద్‌ను రాణా అభినందించాడు. ఈ దాడిలో మరణించిన ఉగ్రవాదులకు పాక్ అత్యున్నత పురస్కారం నిషాన్ ఈ హైదర్ ఇవ్వాలని హెడ్లీ వద్ద రాణా వ్యాఖ్యానించాడు. భారతీయులకు అలా జరగాల్సిందేనని అన్నాడు. 2009 అక్టోబర్ 3న చికాగో అంతర్జాతీయ విమానాశ్రయంలో హెడ్లీని ఎఫ్‌బీఐ అరెస్టు చేయడంతో ఇద్దరి స్నేహం ముగిసింది. అతడు సీఐఏకు పని చేస్తున్నా.. తరచూ పాక్‌కు వెళ్లి రావడంపై అమెరికా నిఘా సంస్థ కన్నేసింది. డెన్మార్క్‌లోని కోపన్‌హెగన్‌లో ఉగ్రదాడికి కుట్ర పన్నుతున్నట్లు అతడిపై అనుమానాలు ఉన్నాయి. అప్పటికే హెడ్లీని తమకు అప్పగించాలని భారత్ అమెరికాను కోరుతోంది. ఆ తర్వాత కొన్ని నెలలకే రాణాను కూడా డెన్మార్క్ కుట్ర కేసులో అరెస్టు చేశారు. ఈ నేరం నిరూపితమైనా.. భారత్‌లో 26/11 దాడుల కుట్ర అభియోగాలు మాత్రం వీగిపోయాయి. ఈ విచారణ సందర్భంగా తనను హెడ్లీ ఇందులోకి లాగాడని రాణా చెప్పాడు. డెన్మార్క్ కుట్ర కేసులో రాణాకు వ్యతిరేకంగా హెడ్లీ కూడా సాక్ష్యం చెప్పడంతో ఈ కేసులో అతడికి 14 ఏళ్ల జైలు శిక్ష పడింది. అతడు 2020 కొవిడ్ సమయంలో విడుదలయ్యాడు. ఆ మర్నాడే అతడిని అరెస్టు చేయడానికి నేరగాళ్ల అప్పగింత ఒప్పందం మేరకు అమెరికా వారెంటు కోరింది. దాదాపు ఐదేళ్లు వివిధ దశల్లో జరిపిన న్యాయపోరాటం తర్వాత అతడు విచారణను ఎదుర్కోవడానికి భారత్‌కు తీసుకొచ్చారు.

## వారణాసి అత్యాచార ఘటనపై మోదీ ఆరా



**న్యూఢిల్లీ :** ఉత్తర్‌ప్రదేశ్‌లోని వారణాసి లో చోటుచేసుకున్న దారుణ సా మూహిక అత్యాచార ఘటన దిగ్భ్రాంతికి గురిచేసింది. 6 రోజుల్లో 23 మంది వ్యక్తులు.. 19 ఏళ్ల యువతిపై అత్యాచారానికి పాల్పడిన అమానవీయ ఘటన ఇటీవల వెలుగుచూసిన సంగతి తెలిసిందే. ఇది ప్రధాని మోదీ దృష్టికి చేరడంతో ఆయన ఆరా తీశారు. శుక్రవారం వారణాసి కలెక్టర్, పోలీసు ఉన్నతాధికారుల తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. మోదీ ఈ రోజు వారణాసిలో పర్యటించారు. ఉదయం అక్కడ ల్యాండ్ కాగానే ఇటీవల జరిగిన అత్యాచార ఘటన గురించి జిల్లా మేజిస్ట్రేట్, పోలీస్ కమిషనర్, డివిజినల్ కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. మార్చి 29వ తేదీన బాధిత యువతి కొంతమంది స్నేహితులతో కలిసి బయటకు వెళ్లింది. ఆమె తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో సామూహిక అత్యాచారం గురించి వెలుగులోకి వచ్చింది. పోలీసులకు ఆ యువతి వెల్లడించిన వివరాల ప్రకారం.. కొందరు యువకులు తనను పలు హోటళ్లకు, హుక్కా బార్లకు తిప్పుతూ అత్యాచారానికి పాల్పడ్డారని చెప్పింది. దర్యాప్తు జరిపిన పోలీసులు తొమ్మిది మందిని అరెస్టు చేశారు. కోర్టు వారిని జ్యుడీషియల్ కస్టడీకి పంపింది. కాగా వారణాసి పర్యటనలో భాగంగా జరిగిన బహిరంగ సభలో మోదీ పాల్గొన్నారు. 70 ఏ ళ్లు దాటిన ముగ్గురు లబ్ధిదారులకు ఆయుష్మాన్ కార్డులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.."కాశీ నాది..నేను కాశీకి చెందినవాడిని" అని కార్యకర్తలను ఉద్దేశించి అన్నారు. వారణాసి మోదీ సొంత నియోజకవర్గం. 2014 నుంచి ఇప్పటివరకు మూడుసార్లు అక్కడి నుంచి విజయం సాధించారు.

## మహిళలపై తమిళనాడు మంత్రి అవమానకర వ్యాఖ్యలు : ప్రముఖుల ఆగ్రహం




**చెన్నై:** తమిళనాడు అటవీశాఖ మంత్రి కె.పొన్ముడి మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచాడు. మహిళలపై అవమానకరరీతిలో అతడు చేసిన వ్యాఖ్యలకు గానూ తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. గాయని చిన్మయి, నటి ఖుష్బూతో పాటు పలువురు ప్రముఖులు ఆయన తీరును ఖండించారు. అటు సొంత పార్టీ నుంచి కూడా విమర్శలు రావడంతో డీఎంకే చర్యలు చేపట్టింది. అసలేం జరిగిందంటే.. ఓ కార్యక్రమంలో పొన్ముడి మాట్లాడిన వీడియో ఒకటి నెట్టింట వైరల్‌గా మారింది. అందులో ఆయన సెక్స్ వర్కర్లు, కస్టమర్ల మధ్య సంభాషణ ఇలా ఉంటుందంటూ అసభ్యకర పదజాలాన్ని (రాయడానికి వీల్లేని) ఉపయోగించారు. ఇదంతా జోక్ అంటూ అతడు మాట్లాడిన తీరు మహిళలను కించపర్చేలా ఉంది. దీంతో అతడిపై సామాజిక మాధ్యమాల్లో తీవ్ర స్థాయిలో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పలువురు ప్రముఖులు కూడా అతడి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. భాజపా నాయకురాలు, నటి ఖుష్బూ సుందర్ స్పందిస్తూ.. తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌పై ప్రశ్నల వర్షం కురిపించారు. "మీ మంత్రి చేసిన వ్యాఖ్యలకు అర్థమేంటో నాకంటే బాగా మీకే తెలుసు. ఇలాంటి అవమానకర వ్యాఖ్యలను మీ ఇంట్లోని మహిళలు అంగీకరిస్తారా?" అని ఆమె ఆగ్రహించారు. ఆయనను వెంటనే మంత్రి పదవి నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి వారిని ఆ భగవంతుడే శిక్షిస్తాడని గాయని చిన్మయి ఆగ్రహం వ్యక్తం చేశారు. అటు డీఎంకే ఎంపీ కనిమొళి కూడా మంత్రి వ్యాఖ్యలను ఖండించారు. "మంత్రి పొన్ముడి వ్యాఖ్యలు ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదు. కారణం ఏదైనా సరే.. మహిళలపై అతడు చేసిన అవమానకర వ్యాఖ్యలను ఖండించాల్సిందే" అని ఆమె 'ఎక్స్'లో రాసుకొచ్చారు. ఇది కాస్తా వివాదాస్పదమవడంతో పొన్ముడిని డీఎంకే పార్టీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ పదవి నుంచి తప్పించింది. కాగా.. పొన్ముడి ఇలా వివాదాల్లో చిక్కుకోవడం ఇదే తొలిసారి కాదు. గతంలో ఉచిత బస్సు సౌకర్యం గురించి మాట్లాడుతూ మహిళలను వలసదారులతో పోల్చడం విమర్శలకు దారితీసింది. ఇక, ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టారన్న అభియోగాలపై ఆయనకు మద్రాసు హైకోర్టు జైలుశిక్ష కూడా విధించింది. దీంతో ఆయన శాసనసభ్యత్వంపై అనర్హత వేటు కూడా పడింది. అనంతరం శిక్షపై సుప్రీంకోర్టు స్టే ఇవ్వడంతో తిరిగి మంత్రిమండలిలో చోటు దక్కించుకున్నారు.

## ఇప్పుడు ఆ రెండు 'టి'లదే హవా..

### జైశంకర్ వేటి గురించి చెప్పారంటే..?



**న్యూఢిల్లీ :** ప్రపంచ భౌగోళిక రాజకీయాల్లో రెండు 'టి'లు కీలక భూమిక పోషిస్తున్నాయని విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ అన్నారు. టెక్నాలజీ, టారిఫ్‌లను ఉద్దేశించి చమత్కారంగా మాట్లాడారు. ఈమేరకు శుక్రవారం దిల్లీలో జరిగిన కార్నెగీ గ్లోబల్ టెక్ సమ్మిట్‌లో మాట్లాడారు. "కొద్దికాలంగా మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో ఈరోజు ఇక్కడ పదం గురించి చర్చించడానికి మనం సమావేశమయ్యాం. ఈ భౌగోళిక, సాంకేతిక నేపథ్యంలో మనం ప్రపంచాన్ని ఎలా చూడాలి..? నేనైతే దీనినొక అవకాశంగా చూస్తాను. ఈ మార్పు, టి అక్షరం గురించి మాట్లాడేటప్పుడు అమెరికా నుంచే ప్రారంభిస్తాం. ప్రపంచంతో అనుసంధానమయ్యే విధానాన్ని యూఎస్ ప్రాథమికంగా మార్చేసింది. దాంతో ప్రపంచంపై దాని పరిణామాలు ఉంటాయి. ముఖ్యంగా టెక్నాలజీ రంగంలో అవి మరింత తీవ్రంగా ఉంటాయి. అమెరికా అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉండటం ఒకటే అందుకు కారణం కాదు. దాంతోపాటు ఆ దేశ సాంకేతిక పురోగతి అత్యంత కీలకం. అమెరికాను మళ్లీ గొప్పగా మార్చడంలో టెక్నాలజీ కీలక పాత్ర పోషిస్తుంది అన్నది స్పష్టం. అందుకే మేక్ అమెరికా గ్రేట్ అగైన్‌కు, టెక్‌కు మధ్య సంబంధం ఉంది. 2016 నుంచి 2020 (అప్పుడు ట్రంప్ మొదటిసారి అధికారంలో ఉన్నారు) మధ్య అది ఇంత స్పష్టంగా కనిపించలేదు" అని మంత్రి మాట్లాడారు. అలాగే చైనా స్థిరమైన ఎదుగుదలను ప్రస్తావించారు. ఐరోపాలో నెలకొన్న ఆర్థిక అనిశ్చిత పరిస్థితులను పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చిన దగ్గరి నుంచి అనూహ్య నిర్ణయాలు తీసుకుంటున్నారు. టారిఫ్ విషయంలో ఆయన కఠినవైఖరి ప్రపంచ మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపింది. దాంతో ఎక్కడ చూసినా టారిఫ్ అనే పదమే వినిపిస్తోంది. అలాగే ప్రస్తుతం సాంకేతిక రంగంలో కృత్రిమ మేధ పదాన్ని ఎక్కువగా వింటున్నాం. ఈ విషయంలో అమెరికా, చైనా పోటీపోటీగా ముందుకు దూసుకెళ్తున్నాయి. దేశ ఎదుగుదలలో టెక్నాలజీ పాత్ర అత్యంత కీలకమనే ఉద్దేశంలో తాజాగా మంత్రి మాట్లాడారు.

# వెనక్కి తగ్గని చైనా

## అమెరికాపై సుంకాలు 125 శాతానికి పెంపు



**చైనా :** అమెరికా, చైనాల మధ్య వాణిజ్యపరమైన ఉద్రిక్తతలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బెదిరింపులను డ్రాగన్ ఏమాత్రం ఖాతరు చేయడం లేదు. చైనా ఉత్పత్తులపై టారిఫ్‌లను యూఎస్ 145 శాతానికి పెంచితే.. డ్రాగన్ నుంచి అదే రియాక్షన్ వచ్చింది. అమెరికా ఉత్పత్తులపై సుంకాలను చైనా 125 శాతానికి పెంచింది. చైనాపై విధించిన సుంకాలను మొత్తంగా లెక్కిస్తే 145శాతంగా ఉంటాయని గురువారం శ్వేతసౌధం కార్యనిర్వాహక ఉత్తర్వు వెల్లడించింది. ఈ నేపథ్యంలో తాము విధించిన 84 శాతం సుంకాలను 125 శాతానికి పెంచుతూ తాజాగా చైనా ప్రకటించింది. శనివారం నుంచి ఇవి అమల్లోకి వస్తాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది. దీనిని ఒక నంబర్ గేమ్‌గా అభివర్ణించిన మంత్రిత్వ శాఖ.. ఆర్థికంగా ఎలాంటి ప్రభావం ఉండదని వ్యాఖ్యానించింది. ఈ తతంగమంతా ఆచరణాత్మక ప్రాముఖ్యత లేనిదని, దీర్ఘకాలంలో రెండు దేశాలపైనా ప్రతికూల ప్రభావాన్ని చూపుతుందని చెప్పింది. చైనా వస్తువులపై విధించిన పరస్పర సుంకాలను తొలగించే దిశగా అమెరికా నిర్ణయం తీసుకోవాలని కోరింది. ఇకనుంచి యూఎస్ వేసే టారిఫ్‌లను తాము పట్టించుకోబోమని స్పష్టం చేసింది. వాషింగ్టన్ సుంకాలపై బీజింగ్ ప్రపంచ వాణిజ్య సంస్థలో దావా వేయనున్నట్లు స్థానిక మీడియా వెల్లడించింది. అమెరికా విధించిన సుంకాలపై చైనా ప్రజల్లో ఆందోళనలు నెలకొన్నాయి. అమెరికాకు తమ ఉత్పత్తులను ఎగుమతి చేసే కంపెనీలు ఉద్యోగులకు లేఆఫ్‌లు ప్రకటిస్తున్నాయని సోషల్ మీడియాలో పోస్టులు వెల్లువెత్తుతున్నాయి. సుంకాలపై అమెరికాతో తీవ్రంగా తలపడుతున్న చైనా కాస్త వెనక్కి తగ్గిన సంగతి తెలిసిందే. బెదిరింపులకు తలొగ్గబోమంటూనే చర్చలకు సిద్ధమని ప్రకటించింది. అమెరికా సుంకాల యుద్ధమే చేయాలనుకుంటే.. తుదివరకూ తామూ పోరాడతామని చైనా వాణిజ్యశాఖ అధికార ప్రతినిధి యాంగ్‌కియాన్ పేర్కొన్నారు. 'చైనాతో డీల్ చేయాలంటే.. ఒత్తిళ్లు, బెదిరింపులు, బ్లాక్‌మెయిళ్లు సరైన మార్గం కాదు. రెండు దేశాలు కలిసి కూర్చుని విభేదాల పరిష్కారానికి కృషి చేస్తాయని ఆశిస్తున్నాం. పరస్పర గౌరవం అనే సిద్ధాంతాల ఆధారంగా చర్చలు జరగాలి' అని యాంగ్‌కియాన్ అన్నారు.

### ట్రంప్ టారిఫ్‌ల వేళ.. జిన్‌పింగ్ ఫస్ట్ రియాక్షన్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చైనాపై టారిఫ్‌ల మోత మోగిస్తున్నారు. ఈనేపథ్యంలో చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ తొలిసారి స్పందించినట్లు డ్రాగన్ ప్రభుత్వ మీడియా సంస్థ జిన్హువా పేర్కొంది. అమెరికా విధించిన 145 శాతం సుంకాలను ఏకపక్ష బెదిరింపుగా జిన్‌పింగ్ అభివర్ణించారు. బెదిరింపులను ప్రతిఘటించడానికి ఐరోపా యూనియన్ తమతో కలిసిరావాలని పిలుపునిచ్చారు. చైనా, యూరప్ తమ అంతర్జాతీయ బాధ్యతలను నెరవేర్చాల్సి ఉందన్నారు. అప్పుడే తమ సొంత చట్టబద్ధ హక్కులు, ప్రయోజనాలను కాపాడుకోవడానికి వీలవుతుందన్నారు. అంతేగాకుండా అంతర్జాతీయ పారదర్శకత, న్యాయాన్ని కాపాడొచ్చని చెప్పారు. బీజింగ్‌లో స్పెయిన్ ప్రధాని పెడ్రో సాంచెజ్‌తో భేటీ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేశారు.

### ట్రంప్ ఎఫెక్ట్.. పొరుగు దేశాలతో మిత్రత్వం కోసం చైనా వెంపర్లాట..

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏకంగా 145 శాతం సుంకాలు విధించడంతో.. చైనా ఉక్కిరి బిక్కిరి అవుతోంది. దీంతో పొరుగు దేశాలతో జట్టు కట్టేందుకు సిద్ధమవుతోంది. ఈ క్రమంలోనే ఆ దేశాధినేత జిన్‌పింగ్ ప్రాంతీయ సహకారాన్ని పెంపొందించుకునేందుకు పర్యటనలు జరపాలని నిర్ణయించుకున్నారు. ఏప్రిల్ 14 నుంచి 18 వరకు వియత్నాం, మలేసియా, కంబోడియా దేశాల్లో పర్యటించాల ని నిర్ణయించినట్లు చైనా విదేశాంగ శాఖ వెల్లడించింది. ఈ మూడు దేశాలకు ఆసియాన్ గ్రూప్‌లో సభ్యత్వం ఉంది. ఈ గ్రూప్‌నకు చైనాకు మధ్య ఏటా 962 బిలియన్ డాలర్ల వ్యాపారం జరుగుతుంది. దీనిలో 575 బిలియన్ డాలర్లు చైనా ఎగుమతులే ఉంటున్నాయి. వాస్తవానికి ట్రంప్ టారిఫ్‌లు ప్రకటించిన తర్వాత చాలా దేశాలు ఆచితూచి స్పందించాయి. కానీ, చైనా మాత్రం వాషింగ్టన్‌పై ఏకంగా 84 శాతం పన్నులు విధించింది. దీంతో అమెరికా టారిఫ్‌లను మొత్తం కలిపి బీజింగ్‌పై 145 శాతానికి పెంచింది. ప్రతిఘటించని దేశాలకు 90 రోజుల సమయం ఇస్తూ ట్రంప్ చకచక నిర్ణయాలు తీసుకున్నారు. దీంతో అమెరికాలో ఇతర దేశాల వస్తువులతో పోలిస్తే.. చైనా దిగుమతి వస్తువుల రేట్లు చాలా ఎక్కువగా ఉండనున్నాయి. దీంతో సుంకాలపై అమెరికాతో తీవ్రంగా తలపడుతున్న చైనా కాస్త వెనక్కి తగ్గింది. బెదిరింపులకు తలొగ్గబోమంటూనే చర్చలకు సిద్ధమని ప్రకటించింది. అమెరికా విధించిన 145 శాతం సుంకాలకు నిరసనగా ఫిల్మ్‌ల దిగుమతులను తగ్గించింది. అమెరికా సుంకాల యుద్ధమే చేయాలనుకుంటే.. తుదివరకూ తాము పోరాడతామని చైనా వాణిజ్యశాఖ అధికార ప్రతినిధి యాంగ్‌కియాన్ పేర్కొన్నారు. 'చైనాతో డీల్ చేయాలంటే.. ఒత్తిళ్లు, బెదిరింపులు, బ్లాక్‌మెయిళ్లు సరైన మార్గం కాదన్నారు.

## మన రహదారులను అమెరికా రోడ్ల కంటే సుందరంగా తీర్చిదిద్దుతా : నితిన్ గడ్కరీ



**న్యూఢిల్లీ :** మన దేశంలో రహదారులను అమెరికా రోడ్ల కంటే సుందరంగా తీర్చిదిద్దుతానని కేంద్ర రోడ్డు రవాణా రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. "అమెరికా ధనిక దేశం కాబట్టి అక్కడి రోడ్లు బాగా ఉండటం కాదు... అమెరికా రోడ్లు బాగున్నందున అది ధనిక దేశం అయ్యింది" అని ఓ సందర్భంలో జాన్ ఎఫ్ కెన్నడీ వ్యాఖ్యానించినట్లు ఆయన పేర్కొన్నారు. రాబోయే రెండేళ్లలో దేశంలోని అన్ని జాతీయ రహదారులు అమెరికా కంటే అద్భుతంగా ఉంటాయని హామీ ఇచ్చారు. కేవలం హామీలు ఇవ్వడమే కాదు వాటిని నెరవేర్చి తీరుతానని పేర్కొన్నారు. కేంద్రంలో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత జాతీయ రహదారుల బాధ్యతను తనకు అప్పగించారని ఆయన అన్నారు. గత 11 ఏళ్లలో దేశవ్యాప్తంగా అనేక రోడ్లు, ఫ్లైఓవర్లు వంతెనలు నిర్మించామని అన్నారు. గత ప్రభుత్వ పాలనలో భారతదేశ రోడ్లపై గుంతలే ఎక్కువగా ఉంటాయని విదేశీయులు ఎగతాళి చేసేవారని మంత్రి అన్నారు. తాము అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రహదారులను సుందరంగా తీర్చిదిద్దడానికి పలు చర్యలు చేపడుతున్నామన్నారు. రాబోయే రోజుల్లో.. రోడ్డు కనెక్టివిటీ పరంగా భారత్ ప్రపంచంలోనే అత్యుత్తమ దేశంగా మారుతుందని పేర్కొన్నారు. నీరు, విద్యుత్, రవాణా, కమ్యూనికేషన్ ఉన్నచోట పరిశ్రమలు, వ్యాపారాలు పెరుగుతాయని.. దీనివల్ల ప్రజల జీవితాలు కూడా మారుతాయని అన్నారు.

### మధ్యప్రదేశ్ వేగంగా అభివృద్ధి చెందుతోంది

మధ్యప్రదేశ్ వేగంగా అభివృద్ధి చెందుతోందని నితిన్ గడ్కరీ అన్నారు. పరిశ్రమలు, వ్యాపారాలు ఎక్కడ అభివృద్ధి చెందుతాయో, అక్కడ ఉపాధి అవకాశాలు పెరుగుతాయని.. ఉపాధి ఉన్న చోట పేదరికం, ఆకలి, నిరుద్యోగం మనుగడ సాగించవని పేర్కొన్నారు. రాష్ట్రంలోని జాతీయ రహదారి నెట్‌వర్క్‌ను రెండేళ్లలో విదేశాలలోని రోడ్ల కంటే మెరుగ్గా మారుస్తామని అక్కడి ప్రజలకు హామీ ఇచ్చారు. ఇందులోభాగంగా చేపట్టిన రూ.3 లక్షల కోట్ల మౌలిక సదుపాయాల అభివృద్ధి ప్రాజెక్టులు ఏడాదిలోపు పూర్తవుతాయని తెలిపారు. రాష్ట్రంలోని థార్ ప్రాంతంలో రూ.5,800 కోట్ల విలువైన.. 10 జాతీయ రహదారి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసిన మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు.

## అప్పటి ఉగ్రదాడుల నుంచి త్రుటిలో తప్పించుకున్నా : అస్సాం సీఎం



**దిల్లీ:** ముంబయి ఉగ్రదాడి ప్రధాన కుట్రదారుల్లో ఒకడైన తహవ్వుర్ హుస్సేన్ రాణాను జాతీయ దర్యాప్తు సంస్థ గురువారం దిల్లీకి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ ఆనాటి భయానక ఘటనను గుర్తుచేసుకున్నారు. ఉగ్రదాడులు జరిగిన రోజు తాను ముంబయి తాజ్ హోటల్లో బస చేయాల్సిఉండగా.. షెడ్యూల్ మారడంతో మరో హోటల్లో దిగానని తెలిపారు. దాంతో ఆ దాడుల నుంచి త్రుటిలో తప్పించుకోగలిగానని అన్నారు. ఆ రోజు జరిగిన ఎన్ఎస్‌జీ ఆపరేషన్ ఇంకా తన కళ్ల ముందు మెదులుతోందని, కర్మ సిద్ధాంతం ప్రకారం ఉగ్రదాడుల వెనక ఉన్న సూత్రధారులకు ఏదొకరోజు శిక్ష పడుతుందని తాను భావించానని తెలిపారు. "పదహారేళ్ల తర్వాత తహవ్వుర్ రాణాను దేశంలో చూస్తుంటే న్యాయవ్యవస్థ పై మరింత విశ్వాసం పెరుగుతోంది. కేంద్రంలో ఉన్న బలమైన నాయకత్వం ఇటువంటి చర్యలు తీసుకోవడం ద్వారా భారత్‌పై దాడులు చేయాలంటే ముష్కరులు రెండోసారి ఆలోచిస్తారు" అని హిమంత బిశ్వశర్మ సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. ప్రపంచాన్ని వణికించిన ముంబయి ఉగ్రదాడి (26/11) ప్రధాన కుట్రదారుల్లో ఒకడైన తహవ్వుర్ రాణా పాకిస్థాన్ మూలాలున్న కెనడా జాతీయుడు. ముంబయి దాడుల కుట్రదారుగా భారత్ ఆధారాలు ఇవ్వడంతో రాణాను 2009 అక్టోబరులో ఎఫ్‌బీఐ అరెస్టు చేసింది. షికాగోలో అతడి ని పట్టుకుంది. అయితే తనకు ఇందులో భాగస్వామ్యం లేదని కేసు నుంచి తప్పించుకున్నాడు. 2011లో మరో కేసులో అతడు అరెస్టు కావడంతో 14 ఏళ్ల జైలు శిక్ష పడింది. అప్పటి నుంచి భారత్ అతడి కోసం ప్రయత్నిస్తోంది. రాణాను భారత్ కు అప్పగించడానికి ట్రంప్ ఇటీవల అంగీకారం తెలిపారు. దీంతో అక్కడి అధికారులు గురువారం అతడిని ఎన్ఐఏ అధికారులకు అప్పగించారు. అత్యంత కట్టుదిట్టమైన భద్రత మధ్య అతడిని ప్రత్యేక విమానంలో తీసుకువచ్చిన ఎన్ఐఏ విమానాశ్రయంలోనే అతడిని లాంఛనంగా అరెస్టు చేసింది.



## ఇరాన్ చమురు రవాణా ఆరోపణలు

### అమెరికా ఆంక్షలు

**వాషింగ్టన్:** సుంకాల విషయంలో భారత్, అమెరికాల మధ్య వాణిజ్య ఒప్పందానికి చర్చలు జరుగుతున్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇరాన్ చమురు సరఫరాకు సాయం చేస్తున్నారన్న ఆరోపణలపై భారత్‌కు చెందిన ఓ వ్యక్తి, రెండు సంస్థలపై అగ్రరాజ్యం ఆంక్షలు విధించింది. ఈ విషయాన్ని యూఎస్ ట్రెజరరీ విభాగం ఓ ప్రకటనలో వెల్లడించింది. భారత్‌కు చెందిన జగ్విందర్ సింగ్ బ్రార్‌కు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో పలు వ్యాపారాలు ఉన్నాయి. ఈ కంపెనీలు దాదాపు 30 నౌకలను నిర్వహిస్తున్నాయి. దీంతోపాటు భారత్‌లోని గ్లోబల్ ట్యాంకర్స్ ప్రైవేట్ లిమిటెడ్, బి అండ్ పీ సొల్యూషన్స్ ప్రైవేటు లిమిటెడ్‌లో జగ్విందర్ బ్రార్‌కు యాజమాన్య నియంత్రణ ఉంది. అయితే, ఈయనకు చెందిన నౌకలు.. ఇరాన్ 'షాడో ఫ్లీట్'లో భాగంగా పనిచేస్తున్నాయని అమెరికా ఆరోపించింది. ఈ నౌకలు ఇరాన్ చమురును మారుపేరుతో అక్రమంగా అంతర్జాతీయ మార్కెట్లకు సరఫరా చేస్తున్నాయని పేర్కొంది. దీంతో జగ్విందర్‌తో పాటు, భారత్‌కు చెందిన ఆయన కంపెనీలపై అగ్రరాజ్యం ఆంక్షలు విధించింది. "బ్రార్‌కు చెందిన నౌకలు అత్యంత ముప్పు కలిగిన చమురు సరఫరాలో పాల్గొంటున్నాయి. ఇరాన్ పెట్రోలియంను ఇరాక్, యూఏఈ, గల్ఫ్ ఆఫ్ ఒమన్ జలాల్లో తరలిస్తున్నాయి. ఈ కార్గోలను అందుకున్న ఇతర సంస్థలు.. వేరే దేశాల నుంచి తీసుకొచ్చిన చమురు ఉత్పత్తులతో వీటిని కలుపుతున్నాయి. ఇరాన్ పేరును దాచిపెట్టి నకిలీ పత్రాలతో అంతర్జాతీయ మార్కెట్లలో విక్రయిస్తున్నాయి" అని అమెరికా అధికారులు ఆరోపించారు. అంతేగాక, బ్రార్‌కు హూతీలతోనూ ఆర్థిక సంబంధాలున్నాయని పేర్కొంది. కాగా.. ఇలాంటి ఆరోపణలతో గతంలోనూ కొన్ని సంస్థలపై అగ్రరాజ్యం ఆంక్షలు విధించింది.



## మయన్మార్ భూకంప సహాయక చర్యల్లో భారత రోబోటిక్స్ మ్యూల్స్

**మయన్మార్ :** ఇటీవల భారీ భూకంపంతో మయన్మార్ అతలాకుతలమైంది. ముఖ్యంగా మాండలే, నేపిడాలో పరిస్థితి తీవ్రంగా ఉంది. ఈ క్రమంలోనే సహాయక చర్యల విషయంలో ఇప్పటికే 'ఆపరేషన్ బ్రహ్మ'ను ప్రారంభించిన భారత్ మరింత సహాయాన్ని అందిస్తోంది. సహాయక చర్యల్లో భాగంగా భారత రోబోటిక్స్ మ్యూల్స్‌తో శిథిలాల కింద వెతుకులాట చేపడుతున్నారు. సిబ్బంది వెళ్లలేని చోటుకి వీటిని పంపి శిథిలాల కింద చిక్కుకున్న వారిని వెతుకుతున్నారు. మార్చి 28న సంభవించిన భూకంపం కారణంగా మయన్మార్‌లో 3 వేలకు పైగా మరణించగా.. శిథిలాల్లో చిక్కుకున్న వారిని భద్రతా బృందాలు వెలికితీయడానికి తీవ్రంగా కృషి చేస్తున్నాయి. 'ఆపరేషన్ బ్రహ్మ'లో భాగంగా భారత్ ఇప్పటికే 31 టన్నుల సామగ్రితో కూడిన సీ-17 గ్లోబ్‌మాస్టర్ విమానాన్ని మయన్మార్‌కు పంపింది. మాండలేలో తాత్కాలికంగా ఏర్పాటుచేసిన భారత ఆర్మీ ఆసుపత్రికి అవసరమైన సామగ్రిని కూడా సరఫరా చేసింది. భారత సైన్యం ఆధ్వర్యంలోని ఫీల్డ్ ఆస్పత్రి భూకంప క్షతగాత్రులకు తన సేవలను కొనసాగిస్తోంది. భారత నౌకాదళానికి చెందిన 'ఐఎన్ఎస్ ఘరియాల్' వందల టన్నుల ఆహారాన్ని శనివారం తిలావా ఓడరేవుకు చేర్చింది. మరోవైపు క్వాడ్ దేశాలైన భారత్, ఆస్ట్రేలియా, అమెరికా, జపాన్‌లు మయన్మార్‌ను ఆదుకునేందుకు ఇటీవల 20 మిలియన్ డాలర్ల మానవతా సాయాన్ని ప్రకటించిన సంగతి తెలిసిందే. మొత్తం 118 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. మరోవైపు.. ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సైతం సహాయక చర్యల్లో నిమగ్నమయ్యాయి. గతనెల 28 నాటి భూకంపం దెబ్బకు మయన్మార్ పూర్తిగా అతలాకుతలమైంది. ఈ ప్రకృతి విపత్తు కారణంగా ఇక్కడ మృతి చెందినవారి సంఖ్య 3 వేలు దాటేసింది. ఈక్రమంలో ఆ దేశానికి సాయం చేసేందుకు ప్రపంచ దేశాలు ముందుకువచ్చాయి. ఇటీవల బిమ్‌స్టెక్ సదస్సు సందర్భంగా థాయ్‌లాండ్‌కు వెళ్లిన ప్రధాని మోదీ మయన్మార్‌లోని ప్రజలను ఆదుకునేందుకు భారత్ తరఫున అన్నివిధాలా సాయం చేస్తామని బర్మా సైనిక ప్రభుత్వ అధినేత జనరల్ మిన్ అంగ్‌కు హామీ ఇచ్చారు.





## భారత్‌లో తహవ్వుర్ రాణా..

### అప్పగింత తొలి ఫొటో విడుదల

**ముంబయి :** ముంబయి ఉగ్రదాడి (26/11) ప్రధాన కుట్రదారుల్లో ఒకడైన తహవ్వుర్ హుస్సేన్ రాణాను భారత్‌కు తీసుకువచ్చిన సంగతి తెలిసిందే. అమెరికాలో యూఎస్ మార్షల్స్ రాణాను భారత్‌కు అప్పగిస్తున్న ఫొటో ఒకటి బయటకు వచ్చింది. దానిని అమెరికా న్యాయశాఖ విడుదల చేసింది. న్యాయశాఖ విడుదల చేసిన ఫొటోల్లో రాణా జైలు దుస్తులు, చేతులకు సంకెళ్లు, కాళ్లకు గొలుసులతో కనిపించాడు. చుట్టూ అమెరికా పోలీసులు ఉన్నారు. తమ కస్టడీ నుంచి అతడిని భారత విదేశాంగ శాఖ ప్రతినిధులకు అప్పగించారు. భద్రతపరంగా కట్టుదిట్టమైన ప్రాంతంలో ఏప్రిల్ 9న ఈ అప్పగింత ప్రక్రియను పూర్తిచేశారు. ఆ తర్వాత అతడిని ప్రత్యేక విమానంలో ఏప్రిల్ 11న భారత్‌కు తీసుకువచ్చారు. గురువారం అర్ధరాత్రి రాణాను ఎన్ఐఏ అధికారులు దిల్లీలోని పటియాలా హౌస్ కోర్టు ప్రత్యేక జడ్జి ఎదుట హాజరుపర్చారు. సీనియర్ న్యాయవాది దయాన్ కృష్ణన్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ నరేందర్ మాన్ ఎన్ఐఏ తరఫున కోర్టులో వాదనలను వినిపించారు. రాణా తరఫున దిల్లీ లీగల్ సర్వీసెస్ అథారిటీ న్యాయవాది పీయూష్ సచ్‌దేవా వాదించారు. ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు జడ్జి చందర్‌జిత్ సింగ్ వాదనలు విన్నారు. రాణాను 20 రోజుల పాటు తమ కస్టడీకి అనుమతించాలని ఎన్ఐఏ కోరగా.. 18 రోజుల కస్టడీకి న్యాయమూర్తి అనుమతించారు.

# కుట్రదారులను పట్టుకోవాల్సిందే!



2008 ముంబయి దాడుల కుట్రల వెనక ఎవరెవరు ఉన్నారన్నది బయటకు రావాల్సి ఉంది. ఈ కేసులో పాకిస్థాన్ ప్రమేం ఉన్నట్లు భారత్ గట్టి ఆధారాలు సేకరించినా పాక్ తోసిపుచ్చింది. అయితే ప్రపంచం ముందు పాక్‌ను దోషిగా నిలబెట్టడంలో భారత్ విజయం సాధించింది. కసబ్ తదితరులను ఉరితీసాక కూడా పాక్ ఉగ్రవాదాన్ని ఎప్పటికప్పుడు ప్రపంచ వేదికలపై భారత్ ఎండగడుతూనే ఉంది. ఇదే క్రమంలో పాక్‌కు కూడా గట్టిగా బుద్ధి చెప్పేలా చర్యలు తీసుకునేందుకు వెనకాడడం లేదు. గతంలో పాలకులు పాక్ పట్ల నిర్లిప్తంగా వ్యవహరించారు. ఎన్నిమార్లు అవకాశాలు వచ్చినా వదిలేశారు. అవే ఇప్పుడు మనకు శాపంగా మారాయి. పాక్‌తో యుద్ధం, బంగ్లాదేశ్ విముక్తి తదితర సందర్భాల్లో పాక్‌ను తుదముట్టించివుంటే ఇవాళ ఈ దుర్గతి పట్టేది కాదు. తాజాగా ఇప్పుడు తహవ్వుర్ రాణాను రప్పించడంలో భారత్ కృషి మరువలేనిది. ఇదే సందర్భంలో రాణా నుంచి వివరాలు సేకరిస్తే..ముంబై దాడుల వెనక ఉన్న పెద్ద తలకాయల పేర్లు బయటపడగలవు. అయితే రాణా అంత సులువుగా బయటపడతాడని అనుకోవడానికి లేదు. ఇకపోతే భారత్ పట్ల నరనరాన వ్యతిరేకతను నింపుకున్న రాణా ముంబై దాడుల కోసం ఎంతగా తెగించాడన్నది ప్రపంచ దేశాలతో పాటు పాక్‌కు కూడా అర్థం అయివుంటుంది. ముంబై దాడుల వెనక ఉగ్రవాదులుగా మారిన ఇద్దరు స్కూల్ ఫ్రెండ్స్ మాస్టర్ మైండ్స్‌గా వ్యవహరించారు. 166 మంది ప్రాణాలు పొట్టన పెట్టుకొన్నారు. అమెరికా చట్టాల్లోని లొసుగుల్ని వాడుకొని భారత్‌కు దొరక్కుండా తప్పించుకోవాలని విశ్వప్రయత్నం చేశారు. చివరికి ఒకరిని జాతీయ దర్యాప్తు సంస్థ భారత్‌కు తీసుకొచ్చింది. మరొకరు అమెరికా జైల్లోనే ఇప్పటికీ ఉన్నాడు. వారిద్దరే తహవ్వుర్ రాణా, డేవిడ్ కోల్‌మన్ హెడ్లీ. వీరిద్దరి వయస్సు 64 ఏళ్లు. వీరిని గుర్తించి ఇరికించడం లో ఎన్ఐఎ తీవ్రంగా కృషి చేసింది. వీరిద్దరూ పాక్‌లోని హసన్‌అబ్దల్‌లోని సైనిక అకాడమీ అయిన క్యాడెట్ కాలేజ్ (సీసీహెచ్)లో చదువుకున్నప్పటి నుంచి మిత్రులు కావడం, తరవాత ఉగ్రవాదులు గా మారడం గమనించాలి. ఇక్కడ బోర్డింగ్ స్కూల్, కాలేజ్ నిర్వహిస్తున్నం దున వీరిద్దరూ ఇక్కడ చేరారు. తరవాత మిత్రులుగా మారారు. 8వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ఉంటాయి. వివిధ రకాల పరీక్షలు నిర్వహించి వీటిలోకి ఎంపిక చేస్తారు. డేవిడ్ హెడ్లీ పాకిస్థానీ దౌత్యవేత్త, బ్రాడ్‌కాస్టర్ అయిన దావూద్ సయ్యద్ గిలానీ, ఓ అమెరికా జాతీయురాలికి పుట్టాడు. ఆ తర్వాత గిలానీ కుటుంబం పాక్‌కు వలస వెళ్లింది. అక్కడే హెడ్లీ సీసీహెచ్‌లో చేరాడు. ఇక తహవ్వుర్ రాణా 1961లో ఓ హై స్కూల్ ప్రిన్సిపల్ కుటుంబంలో జన్మించాడు. ఇతడూ సీసీహె చ్‌లోనే చేరాడు. అక్కడే తొలిసారి హెడ్లీ-రాణా మిత్రులుగా మారారు. అక్కడి నుంచే వారి ఉగ్రరచనలకు బీజం పడిందని చెప్పాలి. ఆ తర్వాత కాలంలో హెడ్లీ తల్లితో కలిసి అమెరికా లోని ఫిలడెల్ఫియాకు వెళ్లిపోయాడు. అక్కడ అతడు మాదక ద్రవ్యాల వ్యాపారం, కీలక సమాచారాన్ని ఏజెన్సీలకు విక్రయిం చేవాడు. పాక్‌లో లష్కరే, సైన్యానికి, ఇటు- అమెరికాలోని సీఐఏకు ఇన్ఫర్మేషన్ చేరవేసేవాడు. మరోవైపు రాణా పాక్ ఆర్మీ మెడికల్ కోర్‌లో కెప్టెన్ హోదాలో పని చేశాడు. 1997లో ఆర్మీని వదిలేసి.. భార్యతో కలిసి కెనడాకు వలసవెళ్లి 2001 నాటికి పౌరసత్వం సంపాదించాడు. టొరెంటోలో 'ఫస్ట్ వరల్డ్ ఇమిగ్రేషన్ సర్వీస్' పేరిట ఓ సంస్థను స్థాపించాడు. ఆ తర్వాత దాని కార్యాలయాలను చికాగో, న్యూయార్క్‌ల్లోను తెరిచాడు. ఈ కంపెనీ ముసుగులోనే అతడు ముంబయి దాడులకు కుట్రను అమలు చేశాడని బహిర్గతం అయ్యింది. 2006 నుంచి ముంబయి దాడులకు కుట్ర రచన మొదలైంది. ఇవన్నీ కూడా ఎన్ఐఎ సేకరించగలిగింది. అదే ఏడాది హెడ్లీ తొలిసారి ముంబయిని సందర్శించాడు. అప్పుడు మెస్సర్స్ ఇమిగ్రేషన్ లా సెంటర్ పేరిట ఓ కార్యాలయం ఏర్పాటుకు ఆర్‌బీఐకు పత్రాలు సమర్పించాడు. వీటిపై రేమాండ్ జోసఫ్ శాండర్స్ అనే వ్యక్తి సంతకాలున్నాయి. ఇది రాణాకు చెందిన ఫస్ట్ వరల్డ్ ఇమిగ్రేషన్‌కు అనుబంధంగా పనిచేసింది. ఇందుకోసం టార్డియో ఏసీ మార్కెట్‌లో ఆఫీస్ స్పేస్ తీసుకొన్నాడు. భారత్ వచ్చినప్పుడు దానిని స్థావరంగా వాడుకొన్నాడు. మొత్తం ముంబయిలో ఎనిమిది సార్లు పర్యటించి రెక్కీలు నిర్వహించాడని ఎన్ఐఎ పసిగట్టింది. దాడులకు రెండు వారాల ముందు రాణా స్వయంగా భారత్‌కు వచ్చాడు. అతడు ఫైవ్‌స్టార్ హోటల్ పొవాయ్‌లో దాదాపు 10 రోజుల పాటు తిష్ఠ వేసి కుట్రలు పన్నాడు. డేవిడ్ హెడ్లీకి అవసరమైన వీసాను రాణానే ఇప్పించినట్లు జాతీయ దర్యాప్తు సంస్థ వెల్లడించింది. ఇందుకోసం అతడి పేరు, తండ్రి వివరాలను తప్పుగా చూపించారు. ముంబయిలో తన ఎనిమిది రెక్కీల సందర్భంగా హెడ్లీ నిరంతరం రాణాతో టచ్‌లో ఉన్నాడు. ఇందుకోసం 231 ఫోన్‌కాల్స్ చేశాడని ఎన్ఐఎ గుర్తించింది. అతడు చేసిన సాయానికి ప్రతిగా..పాక్ ఐఎస్ఐ అధికారులతో మాట్లాడి ఓ డీల్ కుదిర్చా డు. రాణా పాకిస్థాన్‌ను సందర్శించడానికి వీలుగా అతడికి మేజర్ ఇక్బాల్‌ను పరిచయం చేశాడు. దీంతో ఆ మేజర్ రాణాతో మాట్లాడినట్లు తేలింది. భారత్‌లో ఉన్నప్పుడు నేరుగా పాక్‌కు కాల్స్ చేయొద్దని హెడ్లీకి స్పష్టమైన ఆదేశాలున్నాయి. ముంబయి దాడుల తర్వాత కూడా హెడ్లీ-రాణా టచ్‌లో ఉన్నారు. ఇక విజయ వంతంగా ముంబయిలో మారణహోమం సృష్టించినందుకు ఉగ్రవాది లష్కరే సాజిద్‌ను రాణా అభినందిం చాడు. ఈ దాడిలో మరణించిన ఉగ్రవాదులకు పాక్ అత్యున్నత పురస్కారం నిషాన్ ఈ హైదర్ ఇవ్వాలని హెడ్లీ వద్ద రాణా వ్యాఖ్యానించాడు. భారతీయులకు అలా జరగాల్సిందేనని కూడా వ్యాఖ్యానించాడు. 2009 అక్టోబర్ 3న చికాగో అంతర్జాతీయ విమానాశ్రయంలో హెడ్లీని ఎఫ్‌బీఐ అరెస్టు చేయడంతో ఇద్దరి స్నేహం ముగిసింది. అతడు సీఐఏకు పని చేస్తున్నా.. తరచూ పాక్‌కు వెళ్లి రావడంపై అమెరికా నిఘా సంస్థ కన్నేసింది. డెన్మార్క్‌లోని కోపన్‌హెగన్‌లో ఉగ్రదాడికి కుట్ర పన్నుతున్నట్లు అతడిపై అనుమానాలు ఉన్నాయి. అప్పటికే హెడ్లీని తమకు అప్పగించాలని భారత్ అమెరికాను కోరుతోంది. ఆ తర్వాత కొన్ని నెలలకే రాణాను కూడా డెన్మార్క్ కుట్ర కేసులో అరెస్టు చేశారు. ఈ నేరం నిరూపితమైనా.. భారత్‌లో ముంబై దాడుల కుట్ర అభియోగాలు మాత్రం వీగిపోయాయి. ఈ విచారణ సందర్భంగా తనను హెడ్లీ ఇందులోకి లాగాడని రాణా చెప్పాడు. డెన్మార్క్ కుట్ర కేసులో రాణాకు వ్యతిరేకంగా హెడ్లీ కూడా సాక్ష్యం చెప్పడంతో ఈ కేసులో రాణాకు 14 ఏళ్ల జైలు శిక్ష పడింది. అతడు 2020 కొవిడ్ సమయంలో విడుదలయ్యాడు. ఆ మర్నాడే అతడిని అరెస్టు చేయడానికి నేరగాళ్ల అప్పగింత ఒప్పందం మేరకు అమెరికా వారెంటు కోరింది. దాదాపు ఐదేళ్లు వివిధ దశల్లో జరిపిన న్యాయపోరాటం తర్వాత అతడు విచారణను ఎదుర్కోవడానికి భారత్‌కు తీసుకొచ్చారు.మొత్తంగా ఎన్ఐఎ చేసిన కృషి సాహససోపేత మైనదని చెప్పాలి. ఇది ఓ అరకంగా అంతర్జాతీయంగా భారత్ ప్రతిష్టను పెంచేదే. రాణ నోరు మెదిపితేనే విషయాలు, వివరాలు బయటకు వస్తాయి. అప్పుడే మనకు విజయం దక్కుతుంది.

# తహవ్వుర్ హుస్సేన్ రాణాను అప్పగించడం

- మోడీ దౌత్య విజయానికి ప్రతీక
- ప్రశంసలు కురిపిస్తున్న నెటిజన్లు



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 11 :** ప్రపంచాన్ని వణికించిన ముంబయి ఉగ్రదాడి ప్రధాన కుట్రదారుల్లో ఒకడైన తహవ్వుర్ హుస్సేన్ రాణాను ఎట్టకేలకు భారత్‌కు తీసుకుని రావడం ఓ రకంగా భారత్ దౌత్య విజయంగా చెప్పుకోవాలి. వివిధ దేశాలతో దౌత్యపరంగా అనుసరిస్తున్న వ్యవహారాలను గమనించినప్పుడు రాణాను అమెరికా అప్పగించడం అన్నది ఓ రకంగా మోడీ దౌత్య విజయంగానే చూడాలి. అలాగే ఎన్ఐఎ చేసిన కృషి కూడా తక్కువేం కాదు. ఈ కారణంగానే రాణను అమెరికా అప్పగించడంతో భారత్‌కు తీసుకొచ్చారు. ప్రస్తుతం అతడు ఎన్ఐఏ కస్టడీలో ఉన్నాడు. ఈ పరిణామాల నేపథ్యంలో తహవ్వుర్ రాణా కేసుకు సంబంధించి గతంలో ప్రధాని మోదీ చేసిన ఓ ట్వీట్ ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. 14 ఏళ్ల క్రితం చేసిన ఆ పోస్ట్‌లో రాణా కేసును ఉద్దేశిస్తూ అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ దౌత్య విధానాలను మోదీ తీవ్రంగా విమర్శించారు. 2011లో ఈ కేసుపై అమెరికా కోర్టు కీలక తీర్పు వెలువరించింది. ముంబయి దాడుల్లో రాణా ప్రత్యక్ష పాత్ర లేదని తేల్చింది. అయితే, ఆ ఘటనకు కారణమైన ఉగ్ర సంస్థకు అండగా నిలిచాడన్న అభియోగాలపై అతడిని దోషిగా తేల్చింది. ఈ తీర్పుపై 2011 జూన్ 10న ప్రధాని మోదీ ట్విటర్ వేదికగా స్పందించారు. ముంబయి దాడుల ఘటనలో తహవ్వుర్ రాణాను అమాయకుడని యూఎస్ ప్రకటించడం.. భారత సార్వభౌమత్వాన్ని అవమానించడమే. మన దేశ విదేశాంగ విధానానికి ఇది భారీ ఎదురుదెబ్బ అని మోదీ ఆనాటి పోస్ట్‌లో రాసుకొచ్చారు. అప్పుడాయన గుజరాత్ సిఎంగా ఉన్నారు. ప్రస్తుతం రాణా అప్పగింత నేపథ్యంలో ఈ పోస్ట్‌ను నెటిజన్లు షేర్ చేస్తూ.. ప్రధాని దౌత్య విధానాలను కొనియాడుతున్నారు. తహవ్వుర్ రాణాను తీసుకురావడంలో కేంద్ర ప్రభుత్వం భారీ విజయాన్ని సాధించిందని ప్రశంసిస్తున్నారు. ఇకపోతే రాణా అప్పగింతపై అమెరికా స్పందించింది. ఉగ్రదాడుల బాధ్యులకు తగిన శిక్ష పడేలా భారత్ చేస్తున్న ప్రతి పనికి సుదీర్ఘకాలంగా అమెరికా మద్దతు అందిస్తూ వస్తోంది. ప్రపంచవ్యాప్తంగా పెను సమస్యగా మారిన ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో ఈ రెండు దేశాలు కలిసి పని చేస్తున్నాయి. ఆ నిబద్ధతను చాటిచెబుతూ తహవ్వుర్ రాణాను అప్పగించాం అని అమెరికా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి టమ్మీ బ్రూస్ వెల్లడించారు. అమెరికాలోని లాస్ ఏంజెలెస్ నుంచి తహవ్వుర్ రాణాను అత్యంత కట్టుదిట్టమైన భద్రత నడుమ ప్రత్యేక విమానంలో గురువారం దిల్లీకి తీసుకొచ్చారు. అనంతరం పటియాల హౌస్ కోర్టులో హాజరుపర్చారు. దీనిపై కోర్టు విచారణ జరిపి రాణాను 18 రోజుల ఎన్ఐఏ కస్టడీకి అప్పగించింది. ఇప్పుడు కస్టడీలో రాణాను ప్రశ్నించడం ద్వారా వివరాలు రాబట్టనున్నారు. ప్రధాని మోదీ ఫిబ్రవరిలో అమెరికా వెళ్లినప్పుడే రాణా అప్పగింతకు మార్గం సుగమమైంది. 14న మోదీతో జరిగిన సమావేశానంతరం సంయుక్త మీడియా సమావేశంలో ట్రంప్ ఈ విషయాన్ని ప్రకటించారు. భారత్, అమెరికాల మధ్య నేరస్థుల అప్పగింత ఒప్పందం ఉండటంతో రాణాను అగ్రరాజ్యం కస్టడీలో ఉంచింది. అతడి అప్పగింతపై అన్ని కోర్టుల్లో ఎన్ఐఏ విజయం సాధించడంతో తరలింపు సాకారమైంది. రాణాను భారత్‌కు అప్పగించాలని 2023 మే 16వ తేదీన సెంట్రల్ డిస్ట్రిక్ట్ ఆఫ్ కాలిఫోర్నియా జిల్లా కోర్టు ఆదేశాలిచ్చింది. దానిని నైన్త్ సర్క్యూట్ కోర్టులో పలు లిటిగేషన్లద్వారా అతడు సవాలు చేశాడు. వాటన్నింటినీ కోర్టు తిరస్కరించింది. అనంతరం రిట్ ఆఫ్ సర్టియోరరితోపాటు హెబియస్ పిటిషన్లను, అత్యవసర అప్పీళ్లను యూఎస్ సుప్రీంకోర్టులో రాణా దాఖలు చేశాడు. వాటిని సుప్రీంకోర్టు ఇటీవల తిరస్కరించడంతో అతడి అప్పగింతకు మార్గం సుగమమైంది. రెండు దేశాల మధ్య ఒప్పందం కారణంగా భారత్ సరెండర్ వారెంట్‌ను పొందడంతో రాణాను తరలించడం ప్రారంభమైంది. చివరకు అతడిని భారత్‌కు తీసుకొచ్చి భారత్ భారీ విజయం సాధించింది. తహవ్వుర్ రాణాను దేశానికి తీసుకు రావడాన్ని అతి పెద్ద దౌత్య విజయంగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. ఇది మోదీ ప్రభుత్వ దౌత్య నైపుణ్యాన్ని, న్యాయంపై నిబద్ధతను తెలియజేస్తుందని షా పేర్కొన్నారు. అయితే రాణా అప్పగింత ప్రక్రియను యూపీఏ హయాంలో ప్రారంభించామని కాంగ్రెస్ స్పష్టం చేసింది. కానీ మోడీ విదేశాంగ విధానంపై విమర్శలు చేస్తున్న కాంగ్రెస్ ఇప్పుడు సమాధానం చెప్పాలి.

# అసెంబ్లీలో ఫూలే విగ్రహం ఏర్పాటు

## సిపిఎం మద్దతు కోరిన ఎమ్మెల్సీ కవిత



**హైదరాబాద్, ఏప్రిల్ 11 :** బహుజనుల సాధికారతకు ప్రతీకగా ఫూలే విగ్రహాన్ని అసెంబ్లీ ఆవరణలో ప్రతిష్టించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, జాగృతి అధ్యక్షురాలు కవిత డిమాండ్ చేశారు. అసెంబ్లీలో ఫూలే విగ్రహ ఏర్పాటు సాధనకై అనేక కార్యక్రమాలు చేపట్టి ప్రజల మద్దతు కూడగట్టామన్నారు. రిజర్వేషన్లకు 50 శాతం పరిమితి అడ్డంకి తొలగిపోయిందని చెప్పారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ అమలుతో తొమ్మిది రాష్ట్రాల్లో 50 శాతానికి పైగా రిజర్వేషన్లు అమలవుతున్నాయని, అందువల్ల బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లును కేంద్రం ఆమోదించాలన్నారు. దీనికోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి చేయాలన్నారు. మహాత్మ జ్యోతిరావు ఫూలే జయంతి సందర్భంగా హైదరాబాద్ మింట్ కాంపౌండ్ వద్ద ఆయన విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. అనంతరం అసెంబ్లీ ఆవరణలో ఫూలే విగ్రహ ఏర్పాటు-కు సీపీఎం కార్యదర్శి జాన్ వెస్లీ మద్దతు కోరారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. తక్షణమే ప్రధానమంత్రి అపాయింట్‌మెంట్ తీసుకొని రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్షాన్ని ఢిల్లీ తీసుకెళ్లాలన్నారు. కుల గణన వివరాలను గ్రామ పంచాయతీల వారీగా బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ఫూలే విగ్రహాన్ని అసెంబ్లీ ఆవరణలో ఏర్పాటు- చేయాలన్న ఎమ్మెల్సీ కవిత ప్రతిపాదన అభినందనీయమని సీపీఎం కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. కవిత పోరాటానికి పూర్తి మద్దతు ప్రకటిస్తున్నామని చెప్పారు. కుల అసమానతలను నిర్మూలించకుండా దేశం అభివృద్ధిలో ముందుకు వెళ్లదని తమ నమ్మకమని తెలిపారు. కుల అసమానతలకు వ్యతిరేకంగా పోరాటం చేసిన ఫూలే విగ్రహం అసెంబ్లీలో ఏర్పాటు చేయాల్సిందేనని అన్నారు. ఎమ్మెల్సీ కవిత డిమాండ్ మేరకు రాష్ట్ర ప్రభుత్వం కులగణన వివరాలను బహిర్గతం చేయాలన్నారు. దేశవ్యాప్తంగా కులగణన చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# యూపిలో భారీ వర్షాలతో అతలాకుతలం

- 22మంది మృతి చెందినట్లు వెల్లడి
- సాయం ప్రకటించిన సిఎం యోగి

**లక్నో, ఏప్రిల్ 11 :** ఉత్తరప్రదేశ్‌లో గురువారం ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. రాష్ట్రవ్యాప్తంగా కురిసిన భారీ వర్షాల వల్ల కనీసం 22 మంది అయినా మృతి చెందారు. ఇక ఈ వర్షాల దెబ్బకు 15 ఇళ్లు ధ్వంసమయ్యాయి. 45 జంతువులు చనిపోయినట్లు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ప్రకటన పేర్కొంది. ఈ సందర్భంగా మృతులకు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సంతాపం తెలిపారు. బాధిత కుటుంబాలకు నాలుగు లక్షల రూపాయలు పరిహారాన్ని ప్రకటించారు. ఈ మేరకు యోగి ఆదిత్యనాథ్ ఎక్స్ పోస్టులో వెల్లడించారు. కాగా, శుక్రవారం కూడా ఉత్తరప్రదేశ్‌లో వర్షాలు కురిసే అవకాశం ఉంది. దీంతో ప్రాంతీయ వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్‌ను జారీ చేసింది. లక్నో, వారణాసి, అయోధ్య, చందౌలీ, బారాబంకి, శ్రావస్తి, బలరామ్‌పూర్, మహారాజ్‌గంజ్, సిద్ధార్థ నగర్, ఖుషీనగర్, గోండా, బస్తీ, గోరఖ్‌పూర్, డియోరియా, ఉన్నావ్, ప్రతాప్‌గఢ్, అమేథి, సుల్తాన్‌పూర్, జౌన్‌పూర్, అంబేద్కర్ నగర్, సన్బీర్ నగర్, సుల్తాన్‌పూర్, ఎస్.ఝూజీపూర్ వంటి జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశం ఉందని ప్రాంతీయ వాతావరణ కేంద్రం అంచనావేసింది. బీహార్‌లో ఉరుములు, మెరుపుల వర్షం వల్ల 21 మంది మృతి చెందారు. ఒకరు పిడుగుపాటుకు గురై మృతి చెందారు. ఈ వర్షాల వల్ల ఇళ్లు కూలిపోయాయి. పశువులు మృతి చెందాయి. భారీగా పంట నష్టం జరిగింది. ఈ ఘటనలో మృతులకు బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ సంతాపం తెలిపారు. మృతుల కుటు-ంబాలకు నాలుగు లక్షల రూపాయలు పరిహారాన్ని ప్రకటించారు.



# విద్యాహక్కు చట్టం అమలుపై విచారణ

**హైదరాబాద్, ఏప్రిల్ 11 :** విద్యాహక్కు చట్టం అమలుపై దాఖలైన పిల్‌పై తెలంగాణ హైకోర్టు విచారణ చేపట్టింది. రాష్ట్రంలోని ప్రైవేటు- పాఠశాలల్లో విద్యాహక్కు చట్టం అమలు చేయాలని సామాజిక కార్యకర్త తాండవ యోగేశ్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఆర్‌టీఈ వచ్చి 16 ఏళ్లు గడుస్తున్నా విద్యార్థులకు అందుబాటులోకి రాలేదని తెలిపారు. దేశంలోని చాలా రాష్ట్రాల్లో ఇప్పటికే విద్యాహక్కు చట్టం అమలులో ఉందని గుర్తుచేశారు. దీని ప్రకారం పేద విద్యార్థులకు ప్రైవేటు- పాఠశాలల్లో 25 శాతం సీట్లు ఉచితంగా ఇవ్వాలని పిటిషనర్ కోరారు. మరోవైపు గతేడాది అక్టోబర్‌లో విద్యాహక్కు చట్టంపై హైకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం నివేదిక ఇచ్చింది. 2025-26 విద్యా సంవత్సరం నుంచి దీన్ని అమల్లోకి తెస్తామని అందులో పేర్కొంది. దీని అమలుకు సంబంధించిన పురోగతిపై అఫిడవిట్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సీజే ధర్మాసనం ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 21కి వాయిదా వేసింది.

# మాతృభాషకు విద్యార్థులను దూరం చేయొద్దు

## ఎక్స్‌లో పోస్ట్ చేసిన వెంకయ్యనాయుడు



**హైదరాబాద్, ఏప్రిల్ 11 :** తెలంగాణలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ద్వితీయ భాషగా సంస్కృతం అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు వచ్చిన వార్తలు విని విచారించానని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. మార్కుల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకుంటే మాత్రం పునరాలోచన చేయాలని కోరారు. ఈ మేరకు 'ఎక్స్'లో ఆయన పోస్ట్ చేశారు. విద్యార్థులను మన మాతృభాషకు దూరం చేయడం మంచిది కాదు. సంస్కృతాన్ని బోధించడంలో తప్పు లేదు.. అదే సమయంలో మనదైన సంస్కృతిని అందిపుచ్చుకునే దిశగా అమ్మ భాష ఆలంబనగా నిలుస్తుంది. అందుకే జాతీయ విద్యావిధానం - 2020 సైతం దానికి ప్రాధాన్యత ఇచ్చింది. ఈ స్ఫూర్తిని అందిపుచ్చుకుని, విద్యార్థులను మాతృభాషకు మరింత చేరువ చేసే దిశగా తెలంగాణ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆకాంక్షిస్తున్నానని వెంకయ్యనాయుడు పేర్కొన్నారు.



# నేడు హనుమత్ జయంతి

## కొండగట్టులో ప్రత్యేక పూజలు

**జగిత్యాల, ఏప్రిల్ 11 :** శ్రీ రాముని భక్తుడైన హనుమంతుడిని పూజిస్తూ హనుమాన్ జయంతి వేడుకలను జరుపుకుంటారు. హిందువులు జరుపుకునే ముఖ్యమైన పండగలలో ఒకటి ఇది.ఏప్రిల్ 12వ తేదీ శనివారం హనుమాన్ జయంతిని ఎంతో ఉత్సాహంగా జరుపుకోవడానికి భక్తులు సిద్ధం అవుతున్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రం కొండట్టులో హనుమత్జయంతిని ఘనంగా నిర్వహిస్తారు. దీక్షాపరులు ఇప్పటికే కొండట్టుకు చేరుకున్నారు. ఈ రోజు తన అసమానమైన శారీరక బలం, అచంచలమైన భక్తి , నిస్వార్థ సేవకు ప్రసిద్ధి చెందిన హనుమంతుడి జన్మదినోత్సవం. కేసరి అంజన దేవిల తనయుడు ఆంజనేయుడు. హనుమంతుడు కేసరి అని కూడా పిలుస్తారు. ఆంజనేయస్వామి ధైర్యం, నిస్వార్థ సేవ అంకితభావానికి ప్రతీక. మన దేశంలోని హిందువులు మాత్రమే కాదు ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందువులు ఈ రోజును హనుమతుండిని అత్యంత భక్తిశ్రద్ధలతో పూజిస్తారు. ఈ రోజున భక్తులు బజరంగ బలి ఆశీర్వాదం కోసం రామలయలను, హనుమంతుడి ఆలయాలను సందర్శిస్తారు. ఉపవాసం ఉంటారు. హనుమాన్ చాలీసాను జపిస్తారు. అయితే ఈ ఆధ్యాత్మిక వేడుకను జరుపుకోవడానికి అనుసరించాల్సిన నిర్దిష్ట సంప్రదాయాలు, నిబంధనలు ఉన్నాయి. అలాగే నివారించాల్సిన పద్ధతులు కూడా ఉన్నాయి. దృక్ పంచాంగం ప్రకారం చైత్ర మాసం పౌర్ణమి తిథి శనివారం, ఏప్రిల్ 12వ తేదీ హనుమంతుడి జయంతిని పౌర్ణమి రోజు జరుపుకోనున్నారు. హిందూ మతంలో ముఖ్యమైన పంగడ కనుక చాలా మంది ఈ రోజు ఉపవాసం ఉంటారు. హనుమంతుడిని అత్యంత భక్తిశ్రద్ధలతో పుజిస్తారు.

# నదిలో కుప్పకూలిన హెలికాప్టర్

## టెక్ కంపెనీ సిఇవో కుటుంబ మృత్యువాత

**న్యూయార్క్, ఏప్రిల్ 11 :** అమెరికాలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. న్యూయార్క్‌లో ఓ పర్యటక హెలికాప్టర్ ప్రమాదవశాత్తూ నదిలో కుప్పకూలిన ఘటనలో ఓ టెక్ కంపెనీ సీఈఓ, ఆయన కుటుంబం దుర్మరణం పాలయ్యింది. అమెరికా కాలమానం ప్రకారం గురువారం మధ్యాహ్నం ఈ ఘటన చోటు-చేసుకుంది. ఈ ప్రమాదానికి సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఈ ఘటనపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. జర్మనీకి చెందిన దిగ్గజ సీమెన్స్ కంపెనీ స్పెయిన్ విభాగ అధిపతి, సీఈఓ అగస్టన్ ఎస్కోబార్ తన కుటుంబంతో కలిసి న్యూయార్క్ పర్యటనకు వచ్చారు. వీరు ప్రయాణిస్తున్న హెలికాప్టర్ హడ్సన్ నది మీదుగా వెళ్తున్న సమయంలో ప్రమాదానికి గురైంది. గింగిరాలు తిరుగుతూ నదిలో తలకిందులుగా పడిపోయింది. అనంతరం మంటలు చెలరేగడంతో హెలికాప్టర్‌లో ఉన్న ఆరుగురు మృతి చెందారు. వీరిలో ఎస్కోబార్, ఆయన భార్య, ముగ్గురు పిల్లలతో పాటు పైలట్ కూడా ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు వెల్లడించారు. ప్రమాదానికి గురైన బెల్ 206 చాపర్‌ను న్యూయార్క్ హెలికాప్టర్ టూర్స్ విభాగం సైట్ సీయింగ్ కోసం వినియోగిస్తోంది. సమాచారం అందుకున్న రెస్క్యూ సిబ్బంది ఘటనా స్థలంలో బోట్ల సాయంతో సహాయక చర్యలు చేపట్టారు. హెలికాప్టర్ తలకిందులుగా పూర్తిగా నీళ్లలో కూరుకుపోయిందని వెల్లడించారు. గాల్లో ఉండగానే హెలికాప్టర్‌లోని ఒక భాగం విరిగిపోయిందని అధికారులు పేర్కొన్నారు.



## మహాత్మా జ్యోతిరావు పూలే 198వ జయంతి

**పాతపట్నం ఏప్రిల్11 ప్రజా జ్యోతి న్యూస్ :** భారతీయ సామాజిక తత్వవేత్త, సామాజిక కార్యకర్త, మేధావి, రచయిత, ఉద్యమకారుడు, సంఘ్ సేవకుడు అయిన మహాత్మ జ్యోతిరావు పూలే 198వ జయంతి కార్యక్రమం, పాతపట్నం లో అంబేద్కర్ కూడలి వద్ద ,రామరాజు ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పారశెల్లి రామరాజు అంబేద్కర్ య-ువజన సంఘం అధ్యక్షులు తొగిరి లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి నవగాన రత్న కుమా ర్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ముఖ్య అతిథులుగా శ్రీకాకుళం జిల్లా ఎస్సీ. ఎస్టీ .విజిలెన్స్ కమిటీ మెంబర్ సిర్ల ప్రభాకర రావు, పాతపట్నం మేజర్ పంచాయితీ సర్పంచ్ ప్రతినిధి సిర్ల జోగారావు, రిటైర్డ్ స్కూల్ అసిస్టెంట్ యజ్జల భాస్కర రావు పాల్గొన్నారు. వీరు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఆత్మస్థైర్యం కల్పించి, వారి హక్కుల కోసం పోరాడి సాధికారిక కల్పనకు కృషి చేసిన మహనీయులు జ్యోతిరావు పూలే అని అన్నారు.రామరాజు మాస్టారు మాట్లాడుతూమంచిపని చేయడానికి తప్పుడు మార్గాన్ని ఎంచుకోకూడదు. అన్యాయం తన పట్ల జరిగిన, పక్కవాడి పట్ల జరిగిన ఎవరురూ సహించకూడదు. స్త్రీ, పురుషులు అన్ని హక్కులు సమానంగా అనుభవించడానికి జ్యోతిరావు పూలే కృషి చేశారని అన్నారు. లక్ష్మీనారాయణ, రత్నకుమార్ మాట్లాడుతూ అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనతో పాటు, మహిలోద్ధరణకు కృషి చేసిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని అన్నారు. కార్యక్రమంలో సింహాద్రి, జి.అప్పారావు, డి.ధనుంజయ, ఎస్. సుజాత పాతపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.



## పి.సి రాయులు ఆధ్వర్యంలో ఘనంగా కస్తూర్బా గాంధీ జయంతి

**ప్రజాజ్యోతి, తిరుపతి జిల్లా ప్రతినిధి :** స్థానిక గాంధీ రోడ్డు లోని కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్ గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ హోల్డర్ డాక్టర్ పి.సి. రాయలు ఆధ్వర్యంలో కస్తూర్బా గాంధీ గారి 156వ జయంతి వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తిరుపతి నగర డిప్యూటీ మేయర్ ఆర్సి మునికృష్ణ , టిడిపి రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి మబ్బు దేవ నారాయణ రెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాసులు , బిజెపి నాయకులు హాజరైనారు ఈ సందర్భంగా మొదట అతిథులసే కస్తూర్బా గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు అనంతరం అతిథులచే కేక్ కట్ చేసి అనంతరం వేయి మందికి అన్నదానము వస్త్ర దానము చేయడం జరిగినది ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ పి.సి.రాయులు మాట్లాడుతూ ప్రతి ఏటా క్రమం తప్పకుండా కస్తూర్బా గాంధీ జయంతి వేడుకలు ఘనంగా జరుపుతున్నామని కస్తూర్బా గాంధీ దక్షిణాఫ్రికాలో గాంధీతో కలిసి భారతీయుల హక్కుల కోసం పోరాడిన గొప్ప మహిళ అని 1942లో బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నా రని అనేక సామాజిక ఉద్యమాలలో పాల్గొన్నారు. నగర మేయర్ ఆర్ .సి. మునికృష్ణ మాట్లాడుతూ డాక్టర్ పి .సి .రాయులు నిరంతర సేవా కార్యక్రమాలను కొనియాడుతూ ఈ సందర్భంగా ఈరోజు కస్తూర్బా గాంధీ జయంతి పురస్కరించుకొని పేద మహిళలకు అన్నదానము వస్త్రధానము చేయడము ఆయన గొప్ప మనసుకు తార్కానమని తెలియజేశారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి మబ్బు దేవనారాయణ రెడ్డి మాట్లాడుతూ కస్తూర్బా గాంధీ యొక్క సేవలను కొనియాడుతూ అలాగే ట్రస్ట్ చైర్మన్ పి. సి. రాయులు సేవా కార్యక్రమాలను కొనియాడారు.బిజెపి జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాసులు మాట్లాడుతూ డాక్టర్ పి .సి .రాయులు మన ప్రాంత వ్యక్తి అయినందుకు చాలా గర్వంగా ఉందని గత 20 సంవత్సరములుగా ట్రస్టు ద్వారా పేద బడుగు బలహీన వర్గాలకు ముఖ్యంగా మహిళలకు నిరంతర సేవా కార్యక్రమాలు చేస్తూ ఈరోజు కస్తూర్బా గాంధీ జయంతి సందర్భంగా వెయ్యి మందికి పేదలకు అన్నదానము వస్త్ర దానము చేయడము చాలా గొప్ప విషయమని ఈ కార్యక్రమంలో పాల్గొన్నందుకు నాకు చాలా ఆనందంగా ఉందని తెలియజేశారు. యొక్క కార్యక్రమమునకు తెలుగుదేశం, బిజెపి స్థానిక నాయకులు మరియు బండి మధుసూదన్ రెడ్డి, ఉదయగిరి కృష్ణమూర్తి, ఉమాపతి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## శివధనుర్భంగాలంకారంలో శ్రీరామచంద్రమూర్తి రాజసం

**ఏప్రిల్ 11,(ప్రజాజ్యోతి),తిరుపతి జిల్లా ప్రతినిధి :** ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం శివధనుర్భంగాలంకారంలో శ్రీ కోదండ రాములవారి రాజసం భక్తులకు కనువిందు చేసింది. కేరళ డ్రమ్స్, భక్తజన బృందాల చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. స్వయంవరం సమయంలో శ్రీరాముడు శివుని విల్లును విరిచి సీతమ్మవారిని వివాహమాడే ఘట్టాన్ని గుర్తుచేసేది శివధను-ర్భంగాలంకారం. సీతారాముల కల్యాణం రోజున ఉదయం ఈ అలంకారంలో స్వామివారు భక్తులను కటాక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈఓ నటేష్ బాబు, సూపరింటెండెంట్ హనుమంతయ్య, టెంపుల్ ఇన్స్పెక్టర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## దక్షిణ భారత బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో షణ్ముఖశర్మకు ఆత్మీయ సత్కారం

### పర్లాకిమిడితో తమకున్న అనుబంధం మరువలేనిది! సామవేదం షణ్ముఖ శర్మ





**పాతపట్నం ఏప్రిల్ 11, ప్రజా జ్యోతి న్యూస్ :** దక్షిణ భారత బ్రాహ్మణ సేవా సంఘం వారి ఆధ్వర్యంలో సమన్వయ సరస్వతి, వాగ్దేవి వరపుత్ర, ప్రవచన విరించి, బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ కు వేద పండితుల మంత్రం పూర్ణ కంభంతో సంఘ సభ్యులు ఘనస్వాగతం పలికారు,అనంతరం సంఘ గౌరవ అధ్యక్షులు,అధ్యక్షులు ఉపాధ్యక్షుల తో కలసి షణ్ముఖ శర్మ చేతుల మీదుగా ద్వీప ప్రజ్వలన చేసి ఆయనకు అధ్యకులవారు పుష్పగుచ్ఛం అందించి వేదికపై కి ఆహ్వానించారు, సంఘ సభ్యులు దుస్సాలవాలతో సత్కరించారు, ఉదయం వరకు ఎండ తీవ్రంగా ఉన్నా ఆయన రాకతో ఒక్కసారి ప్రకృతి పులకరించి వాతావరణంలో చల్లని మార్పు చోటుచేసుకోవటం గమనార్హం దక్షిణ భారత బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు బ్రహ్మశ్రీ డాక్టర్ రేగులగడ్డ రామచంద్ర రవి మాట్లాడుతూ సామవేదం షణ్ముఖ శర్మ పర్లాకిమిడి పట్టణంలో పెరిగి విద్యాభ్యాసం పూర్తి చేసి యావత్ భారతావనికి, విశ్వ మానవాళికి ఒక ఆధ్యాత్మిక దిక్సూచిగా నిలిచి ఆధ్యాత్మిక భక్తి భావ కిరణాలను నలు దిశలు ప్రసరింప చేయడం లో మీరు చేసిన చేస్తున్న కృషి బహుదా ప్రశంసనీయమన్నారు. అనంతరం తెలుగు,సాంస్కృత ఉభయ భాషా ప్రవీణులు బ్రహ్మశ్రీ చట్టి వెంకటేశ్వరరావు మాస్టారు వెల్లంకి కూర్మనాదం బాబు,మరువాడ శివరామ కృష్ణ,మరువాడ గోపాలకృష్ణ శర్మ తదితరులు ఆయనను ఆత్మీయంగా సత్కరించి సన్మాన పత్రాన్ని చదివి వినిపించి ఆయనకు అందించారు బ్రాహ్మణ సంఘ సభ్యుల ఆత్మీయ సత్కారం తో పర్లాకిమిడితో తమకున్న అనుబంధం మరువలేనిదని, ఈరోజు నాకు కలుగుతున్న ఆనందాన్ని వర్ణించడానికి నాకే సాధ్యంకావడం లేదని అన్నారుఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయనకు ఉన్న అనుబంధాన్ని వివరించారు.తాను పుట్టింది ఒడిశా రాష్ట్రం అస్కాలో అయినా నా బాల్యం విద్యాభ్యాసం అంతా పర్లాకిమిడి లోనే జరిగిందని మూలల్లో ఉన్న మాధుర్యం చాలా గొప్పదని వర్ణించారు. ఈ ఊరికి వచ్చినప్పుడు ఒక మధురమైన అనుభూతిని కలిగిస్తుందన్నారు. తన పుట్టిన ఊరు పర్లాకిమిడి రావడానికి ఊరు విడిచి వెళ్లి 27ఏళ్ల తర్వాత గాని సాధ్యపడలేదన్నారు. 27ఏళ్ల తర్వాత రాణిపేట గ్రామ వాస్తవ్యులైన తమ తండ్రి శిష్యులు తనని పిలిపించి ప్రవచనా కార్యక్రమాలను ఏర్పాటు చేశారని అందుకు అనందంగా ఉందన్నారు. ఈ విధంగా ఇటీవల 3 పర్యాయాలు పిలిపించి ప్రవచన కార్యక్రమం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ విధంగా తనను పిలిపించి తన పుట్టిన ఊరు దర్శన భాగ్యాన్ని కల్పించడం ఆనందంగా ఉందని సంతోషాన్ని వ్యక్తపరు-స్తూ శ్రీ నీలకంఠేశ్వర స్వామి పై ఆయన రచించిన శ్లోకాలను ఐదింటిని చదివి వినిపించారు. అనంతరం సంఘ సభ్యులు ఆయనతో కలసి ఫోటోలు తీసుకున్నారు.ఈ కార్యక్రమంలో దక్షిణ భారతబ్రాహ్మణ సంఘం సభ్యులు వేదంభట్ల రమణమూర్తి, వెల్లంకి కూర్మనాథం, కార్యదర్శి గుడిమెట్ల శ్రీను, భాస్కరభట్ల రవి, చట్టి వెంకటేశ్వరరావు, డాక్టర్ రామలక్ష్మి. మరువాడ శివరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## ముందు తరాలకు ఆదర్శం జ్యోతిభా ఫులే జీవితం : కిరణ్

**ఏప్రిల్ 11,(ప్రజాజ్యోతి),తిరుపతి జిల్లా ప్రతినిధి :** భారతీయ సామాజిక కార్యకర్త, మేధావి, బడుగు, బలహీనవర్గాల ప్రజలకు ఆత్మస్థైర్యం కల్పించి, వారి హక్కుల కోసం పోరాడి, సాధికారత కల్పనకు కృషి చేసిన మహనీయులు, విద్య ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమని నమ్మి, అందరికీ విద్య అందుబాటులోకి తీసుకురావడానికి కృషిచేసిన గొప్ప సామాజిక సంస్కర్త, మహాత్మ జ్యోతిభా ఫులే గారి 198 వ జయంతి సందర్భంగా తితిదే ఉద్యోగుల తరపున తితిదే ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ తరపున ఘన నివాళులు తెలిపిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎంప్లాయిస్ అసోసియేషన్ అసోసియేట్ ప్రెసిడెంట్ తితిదే తితిదే ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు



చీర్ల కిరణ్, బీసీ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వంకీపురం పవన్, సభ్యులు ముని వెంకటేశులు, ఉమా, ఈశ్వర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## గోవుల మృతిపై విచారణ జరిపించాలి : సిపిఎం

**ఏప్రిల్ 11,(ప్రజాజ్యోతి), తిరుపతి జిల్లా ప్రతినిధి :** టీటీడీ యాజమాన్యంలో నిర్వహిస్తున్న శ్రీ వెంకటేశ్వర గోశాలలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఎక్కువ సంఖ్యలో గోవులు మ-రణించాయని వస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరా జు ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. తిరుపతి నగరంలోని ఎస్వీ 'గో' సంరక్షణశాలలో అధికారుల నిర్లక్ష్యం కారణం గా గోవులు మృతి చెందాయని, తీవ్రమైన అనారోగ్యానికి గురయ్యాయని వస్తున్న ఆరోపణలపై,



సత్యదూరమని టిటిడి ప్రకటన చేసిందని, టీటీడీ యాజమాన్యం ప్రకటనతో సరిపెట్టుకో కుండా ఈ సంఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని మూగజీవాలు ఇంత పెద్ద సంఖ్యలో మరణించడం, అనారోగ్యానికి గురయ్యాయన్న వార్త జంతు ప్రేమికులను టీటీడీ భక్తులను కలతకు గురిచేసిందని, నిజానిజాలు ప్రజలకు తెలియపరచడానికి విచారణ జరపటం, అఖిలపక్షం ఆధ్వర్యంలో పరిశీలన జరటం ప్రయోజనకరంగా ఉంటుందని, నిర్లక్ష్యం కనిపించినట్టయితే ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఆ ప్రకటనలో నాగరాజు విజ్ఞప్తి చేశారు.



## స్వర్ణరథంపై శ్రీ భూసమేత శ్రీ మలయప్పస్వామి కటాక్షం

**ఏప్రిల్ 11,(ప్రజాజ్యోతి),తిరుపతి జిల్లా ప్రతినిధి :** తిరుమల శ్రీవారి సాలకట్ల వసంతోత్సవాల్లో భాగంగా రెండవరోజైన శుక్రవారం ఉదయం శ్రీ మలయప్పస్వామి శ్రీదేవి, భూదేవి సమేతంగా తిరుమాడ వీధుల్లో స్వర్ణరథంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఇందులో భాగంగా ఉదయం 8 నుండి 10 గంటల నడుమ అత్యంత వైభవంగా సాగిన స్వర్ణరథోత్సవంలో వేలాది మంది భక్తులు పాల్గొని గోవిందనామాలు జపిస్తూ రథాన్ని లాగారు. స్వర్ణరథోత్సవాన్ని దర్శించడంవల్ల- లక్ష్మీదేవి కరుణతో సంపదలు, భోగభాగ్యాలూ, భూదేవి కరుణతో, సమస్తధాన్యాలూ, శ్రీవారికరుణతో సర్వశుభాలూ, సుఖాలూ చేకూరుతాయని భక్తుల విశ్వాసం. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ, డిప్యూటీ ఈవో లోకనాథం, వీజీవో సురేంద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే విగ్రహానికి ఘన నివాళులు

**బద్వేల్ ఏప్రిల్ 11 (ప్రజా జ్యోతి న్యూస్) :** శుక్రవారం నాడు బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మ జ్యోతిరావు పూలే గారి 198వ జయంతి సందర్భంగా ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సిద్దవటం రోడ్డు లోని మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల ఐక్యవేదిక పట్టణ నాయకులు కె.నాగేంద్రబాబు మాట్లాడుతూ మహాత్మ జ్యోతిరావు గారు వివక్షపై బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం అనేక పోరాటాలు చేశారని, ప్రతి మహిళకు ఉన్నతమైన చదువులు చదవాలనే లక్ష్యంతో ఆ మహోన్నత వ్యక్తి అనేక పోరాటాలు చేయడం జరిగిన మూలంగానే భారత దేశ సామాజిక విప్లవ ప్రధాత మార్గదర్శి శుద్రాతి శూద్రులు మేదో జ్యోతి, కల్మషం లేని నిత్య సంఘర్షణ శైలి భావితరాల బడుగుల ఆశాజ్యోతని, జీవితమంతా సమానత్వం కోసం పోరాడిన వ్యక్తి అని, కుతంత్రాలు తెలియని సామాజిక విప్లవ నేతని, బాలిక విద్య, వితంతు వివాహం, అంత్యాజుల హక్కుల కోసం పోరాడిన విప్లవ నేతని, తన సతీమణి సావిత్రిబాయి పూలే తో కలసి తొలి బాలిక పాఠశాలను స్థాపించి మహిళలకు విద్యార్హత ఉన్నదని ధైర్యవంతమైన సందేశాన్ని ఇచ్చిన స్ఫూర్తి ప్రధాతని, వితంతు పునర్వివాహాన్ని ప్రోత్సహించారని, అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలన కోసం పాటుపడిన మహనీయులని, బ్రాహ్మణాధిపత్యాన్ని వ్యతిరేకించవలసిందిగా సామాన్యుల్ని ప్రోత్సహించిన మహోన్నత వ్యక్తి జ్యోతిరావు పూలే గారని కొనియాడారు. నేటి యువత ,విద్యార్థులు ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని ముందుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు, పట్టణ నాయకులు నాగార్జున,బాబయ్య, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని, పట్టణ అధ్యక్ష -కార్యదర్శులు షేక్ మస్తాన్ షరీఫ్, షేక్ ఆదిల్. రజక వృత్తిదారుల సంఘం పట్టణ నాయకులు చెప్పలి సుబ్బరాయుడు,వికలాంగుల హక్కుల సంఘం నాయకులు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ లేకుండా విద్యుత్ మీటర్లు మంజూరు చేయాలి





**బద్వేల్ ఏప్రిల్ 11 (ప్రజా జ్యోతి న్యూస్) :** స్థానిక పట్టణంలో శుక్రవారం నాడు నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ అవసరం లేకుండా పేదల కాలనీలకు విద్యుత్ మీటర్లను మంజూరు చేయాలని కోరుతూ భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) సిపిఐ(యం) బద్వేలు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో విద్యుత్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వారి కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి అనంతరం ఏఈ మేరీ షర్మిల గారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి కె.శ్రీను మాట్లాడుతూ పట్టణ శివారు ప్రాంతాలైన సుందరయ్య కాలనీ, ఐలమ్మ కాలనీ, జ్యోతి బస్ కాలనీ మరియు తదితర కాలనీలు ఏర్పడక మునుపు ఆ ప్రాంతాలన్నీ నివాసానికి యోగ్యం కాకుండా ఉండి రాళ్లురప్పలు, కొండ తిప్పలు,విష సర్పాలు సంచరిస్తున్న అడవిని తలపిస్తున్న ప్రాంతం లో బడుగు బలహీన వర్గాలకు చెందిన పేదలందరూ గుడిసెలు వేసుకొని అక్కడే స్థిరనివాసాలు ఉంటూ కూలీనాలీ చేసుకుని జీవించసాగి దాదాపు 20 సంవత్సరాల పైబడి అవుతున్నదని, సదరు కాలనీలలో నివాసము ఉన్నవారికి పట్టాలు మంజూరు చేయకపోయినప్పటికీ అక్కడే స్థిరంగా నివాసముంటూ అసౌకర్యాల నడుమ మౌలిక వసతులు లేకున్నప్పటికీ అనేక ఇబ్బందులను ఎదుర్కొంటూ జీవనం సాగిస్తున్నారని, ప్రస్తుతం బద్వేలు పట్టణంలో విద్యుత్ మీటర్ల మంజూరు కొరకు నూతన పద్ధతి ప్రవేశపెట్టి రెవెన్యూ డిపార్ట్మెంట్ ద్వారా నివాసమున్న ఇంటికి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ సమర్పిస్తేనే విద్యుత్ మీటర్లు మంజూరు చేస్తున్నడంతో గడిచిన 20 సంవత్సరాలుగా పేదల కాలనీలలో నివాసమున్న వారికి మీటర్లు అందడం లేదని,విద్యుత్ మీటర్లు లేని వారు చుట్టుపక్కల ఇండ్ల నుండి కరెంటు సౌకర్యం తీసుకొని మరియు గత్యంతరం లేక లైన్ పై తీగలు తగిలించారనే నెపంతో విద్యుత్ అధికారులు రైడింగ్ పేరుతో పేదల కాలనీలలో రైడింగ్ చేసి నివాసమున్న ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి వారిపై కేసులు విధిస్తామని బెదిరించి, వేలాది రూపాయలు అపరాధ రుసుములు విధించడం తగదన్నారు. ఇప్పటికైనా శివారు ప్రాంతాలైన పేదల కాలనీలలో నివాసం ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ,మైనార్టీ వర్గాలకు చెందిన నిరుపేదల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని మానవీయ కోణంలో ఆలోచించి స్థిరంగా నివాసాలు ఉన్న వారందరికీ ఎటువంటి షరతులు లేకుండా విద్యుత్తు మీటర్లు మంజూరు చేయాలని లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు ముడియం చిన్ని, షేక్ మస్తాన్ షరీఫ్, చెప్పలి సుబ్బరాయుడు, షేక్ కైరున్ బీ, పసుపుల మోక్షమ్మ, శాఖా కార్యదర్శులు పి.సి కొండయ్య, మూర ప్రసాద్, షేక్ మస్తాన్ బీ,షేక్ ఆదిల్ పార్టీ కార్యకర్తలు నాగార్జున,గంప సుబ్బరాయుడు, వెంకటసుబ్బయ్య, బాలస్వామి, చంద్రకళ, అరుణ, సిద్ధమ్మ,పీరయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



## ఒంటిమిట్టలో శ్రీ సీతారామ లక్ష్మణులకు స్వర్ణ కిరీటాలు

**ఏప్రిల్ 11,(ప్రజాజ్యోతి),తిరుపతి జిల్లా ప్రతినిధి :** ఒంటిమిట్టలో శ్రీ సీతారామ లక్ష్మణులకు రూ.6.60 కోట్ల విలువైన వజ్రాలు పొదిగిన స్వర్ణ కిరీటాలు పెన్నా సిమెంట్స్ అధినేత పి.ప్రతాప్ రెడ్డి వారి కుటుంబ సభ్యులతో కలిసి విరాళంగా అందించారు. నూతనంగా 7 కేజీల బంగారంతో తయారు చేసిన 3 స్వర్ణ కిరీటాలను ఆలయంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో జె. శ్యామలరావులకు దాత అందించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల దగ్గర ప్రత్యేక పూజలు నిర్వహించి, కిరీటాలను సీతారామ లక్ష్మణులకు అలంకరించారు.



## టిటిడి గోశాలలో గోవులు మృతి చెందాయంటూ వస్తున్న వార్తలు అవాస్తవం

**ఏప్రిల్ 11,(ప్రజాజ్యోతి),తిరుపతి జిల్లా ప్రతినిధి :** టిటిడి గోశాలలో ఇటీవల గోవులు మృతి చెందాయంటూ కొద్దిమంది సోషల్ మీడియాలో చేస్తున్న ప్రచారం వాస్తవం కాదు. మృతి చెందిన గోవులు పోటోలు టిటిడి గోశాలకు సంబంధించినవి కావు, దురుద్దేశంతో కొద్ది మంది మృతి చెందిన గోవులు పోటోలను టిటిడి గోశాలలో మృతి చెందినవిగా చూపించి భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా చేస్తున్న ప్రచారాన్ని టిటిడి ఖండిస్తోంది. ఇలాంటి అవాస్తవ ప్రచారాన్ని నమ్మవద్దని టిటిడి కోరుతోంది.

## గంగాభవానికి డాక్టరేట్ ప్రధానం



**ఏప్రిల్ 11,(ప్రజా జ్యోతి)తిరుపతి జిల్లా ప్రతినిధి :** శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఇంగ్లీష్ విభాగానికి చెందిన పరిశోధక విద్యార్థిని శ్రీమతి ఎస్ గంగాభవానికి డాక్టరేట్ ప్రధానం చేస్తున్నట్టు ఎగ్జామినేషన్ డీన్ ప్రొఫెసర్ జీవనజ్యోతి ఒక ప్రకటనలో తెలియజేశారు. గంగ భవాని గారు గ్రామర్ ఇన్ సి.బి.ఎస్.ఈ ఇంగ్లీష్ కారిక్యులం అట్ సెకండరీ లెవెల్ యాన్ అనలిటికల్ స్టడీ అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని ప్రొఫెసర్ హరి పద్మ రాణి గారి పర్యవేక్షణలో సమర్పించారు.



## శ్రీ పద్మగిరి బాలజ్ఞాన దండాయుధపాణి స్వామి ఆలయంలో నూతన ప్రారంభోత్సవాలు



**ఏప్రిల్ 11,(ప్రజాజ్యోతి),తిరుపతి జిల్లా ప్రతినిధి :** శ్రీ పద్మగిరి బాలజ్ఞాన దండాయుధపాణి స్వామి వారి కృపతోనే ఆలయ అభివృద్ధి కార్యక్రమాలు చేయగలుగుతున్నామని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని హర్షం వ్యక్తం చేశారు. తిరుపతి రూరల్ మండలం తనపల్లి గ్రామంలో వెలసిన శ్రీ పద్మగిరి బాలజ్ఞాన దండాయుధపాణి స్వామి ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన కల్యాణ మండపం, కల్యాణ కట్ట, చైర్మన్ కార్యాలయంను చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని దంపతులు శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ముందుగా ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే పులివర్తి నాని దంపతులకు పూర్ణకుంభంతో ఆలయ అర్చకులు కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం శ్రీ పద్మగిరి బాలజ్ఞాన దండాయుధపాణి స్వామి ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజలో పాల్గొన్నారు.స్వామివారిని దర్శించుకున్న అనంతరం స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించి... వేద పండితుల వేద ఆశీర్వచనం అందుకున్నారు.ఈ సందర్భంగా పులివర్తి నాని మాట్లాడుతూ శ్రీ పద్మగిరి బాలజ్ఞాన దండాయు ధపాణి స్వామి ఆశీస్సులు ప్రజలు అందరిపై ఉండాలని కోరుకున్నట్లు స్వామివారి కృపతోనే ఆలయ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టగలిగామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, అర్చుకులు, కూటమి ప్రభుత్వం నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## మహాత్మా జ్యోతిబా పూలే జయంతి

### నివాళులుఅర్పించిన ఎస్పీ హర్షవర్ధన్ రాజు



**ఏప్రిల్ 11,(ప్రజాజ్యోతి), తిరుపతి జిల్లా ప్రతినిధి :** మహాత్మా జ్యోతిబా పూలే జయంతి సందర్భంగా జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో మహాత్మా జ్యోతిబా పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ మహాత్మా పూలే ఏప్రిల్ 11, 1827న మహారాష్ట్రలోని సతారా జిల్లాలో జన్మించారు అని అన్నారు .మహాత్మా జ్యోతిబా పూలే సంఘసంస్కర్త, కుల వ్యతిరేక కార్యకర్త, ఆలోచనాపరుడు రచయిత అని చెప్పారు. జ్యోతిబా పూలే విద్య , వెనుకబడిన వర్గాల అభ్యున్నతి, అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలనకు కృషి చేశారు అని వివరించారు. 1848లో తన భార్య సావిత్రీబాయి పూలే తో కలిసి పూణేలో బాలికల కోసం పాఠశాల ను ప్రారంభించిన మొదటి వ్యక్తి అని అన్నారు .ఇది భారత దేశంలో మహిళా విద్యకు విప్లవాత్మక అడుగు అని, ఆడ శిశువుల హత్యలకు వ్యతిరేకంగా తన గళాన్ని వినిపించారని, సామాజిక న్యాయం కోసం పోరాడిన విజేతగా, అసంఖ్యాక ప్రజలకు ఆశాజనకంగా సామాజిక సమానత్వం, మహిళా సాధికారత విద్యను పెంపొందించడం కోసం అవిశ్రాంతంగా కృషి చేశారని కొనియాడారు. అప్పట్లో నీటి ఎద్దడిని అధిగమించేందుకు, నీటి సంక్షోభం పరిష్కారానికి ఉద్యమాలు చేసిన గొప్ప ఆలోచనాపరుడు జ్యోతిబా పూలే అని అన్నారు.అన్నారు. జ్యోతిబా పూలే తన అనుచరులతో కలిసి 'సత్యశోధకుల సంఘం' లేదా 'సత్యశోధక్ సమాజ్' ని స్థాపించి నవ భారతావని నిర్మాణానికి విశేష కృషి చేశారని జిల్లా ఎస్పీ స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ శ్రీ శ్రీనివాసరావు , డిఎస్పీ చంద్రశేఖర్ , ఆర్ ఐ లు, రమణారెడ్డి , రమణ , శివారెడ్డి, ఆర్ ఎస్ ఐ లు, పుల్లన్న గారు, నభియా తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు



**ఏప్రిల్ 11, (ప్రజాజ్యోతి) ,తిరుపతి జిల్లా ప్రతినిధి :** అణగారిన వర్గాల ఆశాజ్యోతి, అభ్యుదయ వాది, సంఘసంస్కర్త మహాత్మ జ్యోతిరావు పూలే చిరస్మరణీయులని బిజెపి సీనియర్ నాయకులు గుండాల గోపీనాథ్ రెడ్డి అన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి ని పురస్కరించుకుని స్థానిక బాలాజీ కాలనీలోని ఆయన విగ్రహానికి బిజెపి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గుండాల గోపినాథ్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ కులమత బేధాలతో అట్టుడుపుతున్న భారతదేశంలో మనుషులంతా ఒక్కటేనని, సమానత్వానికి కృషి చేసిన మొదటి నాయకుడు మహాత్మ జ్యోతిరావు పూలే అని గుర్తు చేశారు. సంఘసంస్కర్తగా అభ్యుదయ వాదిగా సమాజ శ్రేయస్సు కోసం అహర్నిశలు శ్రమించారని కొనియాడారు. తన సతీమణి సావిత్రిబాయి పూలేను చదివించి ఆమెను ఉపాధ్యాయురాలుగా తీర్చిదిద్ది ఆమె ద్వారా ఎందరో మహిళలకు విద్య నేర్పించాలని పేర్కొన్నారు. జ్యోతిరావు పూలే ను స్మరించుకోవడం ప్రతి భారతీయుడి కర్తవ్యం అని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ జిల్లా సాంస్కృతిక విభాగం కన్వీనర్ గుండాల గోపీనాథ్, బిజెపి రాష్ట్ర ఓబిసి మోర్చా మాజీ ఉపాధ్యక్షులు కట్టమంచి చంద్రబాబు యాదవ్, సుబ్రహ్మణ్యం యాదవ్, బిజెపి ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి మల్లారపు రవి ప్రసాద్, బిజెపి నార్త్ మండల అధ్యక్షుడు లోక ప్రభాకర్ నాయుడు, బిజెపి సీనియర్ నాయకులు తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, రాయలసీమ రంగస్థలం సభ్యులు కొట్టే సుబ్రహ్మణ్యం రెడ్డి జనార్దన్ రెడ్డి విద్వాన్ కస్పా పద్మనాభం, పురోహితుడు సురేష్ స్వామి, చెన్నూరు సుబ్రహ్మణ్యం, విజయ్ భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఏడు అంతర్జాతీయ విద్యా పరిశోధన ప్రతిపాదనలకు ఆమోదం



**ఏప్రిల్ 11,(ప్రజాజ్యోతి),తిరుపతి జిల్లా ప్రతినిధి :** అంతర్జాతీయ విద్యా పరిశోధన నిధి (ఐ. ఏ. ఆర్.ఎఫ్) ద్వారా పి.ఎం యు .ఎస్.హెచ్. ఏ (ప్రధాన మంత్రి ఉచ్చతర్ శిక్షా అభియాన్) చొరవ కింద ఏడు అంతర్జాతీయ విద్యా పరిశోధన ప్రతిపాదనలకు ఆమోదం తెలిపినట్లు శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం (ఎస్ పి యం వి వి) వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ వి. ఉమ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆమోదించబడిన పరిశోధన ప్రాజెక్టులు జెనోమిక్స్ బయోటెక్ ఇంక్., యూ.ఎస్.ఏబీ యూనివర్సిటీ మలేషియా టెరెంగాను (యుఎంటి), మలేషియాబీ ఫోర్ట్ వర్త్, టి.ఎక్, యూఎస్ఏబీ యూనివర్సిటీ టున్ హుస్సేన్ ఓన్ మలేషియా (యు టి హెచ్ ఎం), మలేషియాబీ యార్క్ విశ్వవిద్యాలయం, కెనడాబీ ఖాట్మండు విశ్వవిద్యాలయం, నేపాల్ భాగస్వామ్యంతో బయోటెక్నాలజీ, అప్లైడ్ మైక్రోబయాలజీ, హెూమ్ సైన్స్, ఫార్మసీ, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, బిజినెస్ మేనేజ్‌మెంట్ మరియు లా వంటి విభిన్న రంగాలలో విస్తరించి ఉన్నాయి. ఈ నిధులను మ్యాచింగ్ గ్రాంట్ కింద అధ్యాపకులకు అందిస్తారు, ఇక్కడ అంతర్జాతీయ భాగస్వామ్య విశ్వవిద్యాలయాల సహ పరిశోధకులు కూడా ఎస్ పి యం వి వి ద్వారా మంజూరు చేయబడిన గ్రాంట్‌లో 30% నుండి 60% వరకు ఈ ప్రాజెక్టుకు సహకరిస్తారు. వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ ఉమా, ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్లను అభినందించారు. ఈ చొరవ అంతర్జాతీయ విద్యా సహకారాన్ని మరింతగా పెంచడం, ఉమ్మడి పరిశోధనలను ప్రోత్సహించడం, ప్రపంచ అభ్యాస వాతావరణాన్ని పెంపొందించడం లక్ష్యంగా పెట్టుకుందని హైలైట్ చేశారు, అంతర్జాతీయ పరిశోధన భాగస్వామ్యాలను సులభతరం చేయడంలో అర్థవంతమైన విద్యా సహకారానికి మార్గాలను సృష్టించడంలో సిఐఆర్ బృందం చేసిన కృషిని కూడా అభినందించారు. ప్రభావవంతమైన విదేశీ సహకారాలను నిర్మించడంలో ప్రధాన పరిశోధకులందరూ చేసిన కృషికి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్. రజని నీ అభినందించారు. ఈ చొరవ అంతర్జాతీయ ప్రచురణలు, పేటెంట్లను సులభతరం చేస్తుందని డీన్ ప్రొఫెసర్ పి. విజయ లక్ష్మి వ్యక్తం చేశారు. సెంటర్ ఫర్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ ఆర్. ఉషా, ప్రధాన పరిశోధకులందరూ సాధించిన విజయాన్ని అభినందించారు.

## అంటరానితనం అస్పృశ్యతకు వ్యతిరేకంగా నిరంతరం పోరాటం చేసిన జ్యోతిబాపూలే



**ఏప్రిల్ 11,(ప్రజాజ్యోతి),తిరుపతి జిల్లా ప్రతినిధి :** జ్యోతిరావు పూలే 198వ జయంతిని పురస్కరించుకుని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాచి నాగరాజు వర్గ సభ్యులు కందారపు మురళి పూలమాలవేసి నివాళులర్పించి అనంతరం ఆయన ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ప్రజలను మోసగిస్తూ దోపిడీని కొనసాగించడానికి సృష్టించిందే సంస్కృతికరణ, సనాతన ధర్మం అని ఆయన ఆనాడే చాటి చెప్పారు. దాని నుంచి బయట పడాలంటే దేశంలోని మహిళలు చదువుకున్నప్పుడే మూఢాచారాల నుంచి బయటపడతారని వారి భార్యకి చదువు చెప్పించి ఉపాధ్యాయులగా తయారు చేసి మహిళలకు చదువు చెప్పిన గొప్ప మేధావి అన్నారు. ఆయన వేసిన అడుగు జాడల్లో భార్య సావిత్రిబాయి పూలే దేశంలోనే మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు గా ఎదిగి మహిళలకు చదువు చెప్పించడంతో నేడు దేశంలో ఉన్న ప్రతి మహిళ చదువుకుని అన్ని రంగాల్లో ఉన్నతంగా అభివృద్ధి చెందడానికి కారకులయ్యారు. అలాంటి మేధావులను నేడు రాజకీయ నాయకులు విస్మరించడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో సిపిఎం టి సుబ్రహ్మణ్యం కే వేణుగోపాల్ ఎం మాధవ్ పి బుజ్జి కేఆర్ఎస్ ఎండి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



## ఆయుర్వేద వైద్య విధానాలు భవిష్యత్తు తరాలకు అందించాలి

- రిజిస్ట్రార్ భూపతి నాయుడు
- ఎస్వీయూలో నేటితో ముగిసిన అంతర్జాతీయ సదస్సు

**ఏప్రిల్ 11,(ప్రజాజ్యోతి),తిరుపతి జిల్లా ప్రతినిధి :** శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ వృక్ష శాస్త్ర విభాగము మరియు పారంపర్య వైద్య మహా సంఘం సంయుక్తంగా "సాంప్రదాయ ఔషధం : ఆధునిక మరియు సహజ చికిత్సల ఏకీకృత విధానం" అనే అంశంపై మూడు రోజులు పాటు నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు నూ ధన్వంతరి కి పూజ చేసి ముగింపు పలికారు. ముగింపు సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య మాదాల భూపతి నాయుడు మాట్లాడుతూ పారంపర్య వైద్య విధానాలు, వాటిలో ఉపయోగించే ఔషధలు ప్రపంచానికి అందించాలన్నారు. స్పిరిచువల్ హీలింగ్ కి అనుసంధానం కేవలం ఆయుర్వేదం, పారంపర్య వైద్య విధానాలు కీలకం అన్నారు. ఇండియన్ హెరిటేజ్ కు ఆయుర్వేదం, పారంపర్య వైద్యం అత్యవసరం. కార్యక్రమా నిర్వాహకురాలు ఆచార్య కామాక్షి మాట్లాడుతూ మూడు రోజులపాటు జరిగిన ఈ సదస్సులో వెలువరించిన వైద్య విధానాలు మూలికల వివరాలు గ్రంథస్థం చేసి భవిష్యత్ తరాలకు అందిస్తామన్నారు. ఇలాంటి సదస్సును భవిష్యత్తులో కూడా కొనసాగిస్తామని ఆమె తెలిపారు. అమెరికా ఎన్నారై, ఎస్వియు బయో కెమిస్ట్రీ పూర్వ విద్యార్థి డా. కామేశ్వరరావు బద్రి మాట్లాడుతూ సాంప్రదాయ వైద్యంలో ఉపయోగించే మూలికల మూలాలను బయో కెమిస్ట్రీ ద్వార అనాలసిస్ చేసి గ్రంథస్థం చేస్తామని తెలిపారు. అనంతరం సదస్సులో అత్యుత్తమంగా నిలిచిన పరిశోధన పత్రాలకు ఎక్సలెన్సీ అవార్డులను, యువ పరిశోధకులకు యంగ్ సైంటిస్ట్ అవార్డులను ప్రధానం చేశారు. అదేవిధంగా సదస్సు సందర్భంగా ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ స్టాల్స్ లో నగరవాసులు, అధ్యాపకులు, విద్యార్థులు, ఇతరులు సందడి చేశారు. ఈ కార్యక్రమంలో ఆచార్యులు నాగలక్ష్మి దేవమ్మ, విజయ, వేణు, అంకన్న తదితరులు పాల్గొన్నారు.



## మాజీ ఎమ్మెల్యేలు ఎస్వి మోహన్ రెడ్డి, శ్రీదేవమ్మలను కలిసిన వైసిపి నేత తుగ్గలి శ్రీనివాస్ రెడ్డి

**ప్రజా జ్యోతి తుగ్గలి :** మండల కేంద్రమైన తుగ్గలికి చెందిన మాజీ ఎమ్మెల్యే తమ్మారెడ్డి తనయుడు, వై ఎస్ ఆర్ సి పి రైతు విభాగపు రాష్ట్ర కార్యదర్శి తుగ్గలి శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం వైసీపీ జిల్లా అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి ను, మాజీ ఎమ్మెల్యే శ్రీదేవమ్మ లను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి వారిని శాలువా పూలమాలతో సత్కరించారు. గత వారం రోజుల క్రితం తుగ్గలి శ్రీనివాస్ రెడ్డిని వైసిపి రైతు విభాగపు రాష్ట్ర కార్యదర్శిగా నియమించడంతో ఆయన వారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ తనకు వైసిపి రైతు విభాగపు రాష్ట్ర కార్యదర్శి పదవి ఇచ్చిన మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి, పదివి రావడానికి సహకరించిన ఎస్వీ మోహన్ రెడ్డి ,శ్రీదేవమ్మ లకు ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. పత్తికొండ నియోజకవర్గం లో పార్టీ అభివృద్ధి కోసం తన వంతు సాయి శక్తుల కృషిచేసి 2029 ఎన్నికలలో వైయస్ జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా చేయడమే లక్ష్యంగా పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కో ఆప్షన్ సభ్యులు చాంద్ బాషా, వైసిపి నాయకులు పెండేకల్ భాస్కర్ రెడ్డి, టిఎండి హుసేని, రామచంద్రారెడ్డి, రాతన మోహన్ రెడ్డి, ఉప్పర్లపల్లి సురేంద్రనాథ్ రెడ్డి, జొన్నగిరి రఘు తదితరులు పాల్గొన్నారు.



## ప్రమాదభరితంగా మారిన డ్రైనేజీ కల్వర్టు

**తూర్పుగోదావరి జిల్లా, తాళ్లపూడి మండలం, ఏప్రిల్11, ప్రజాజ్యోతి న్యూస్ :** తాళ్లపూడి మండలం మలకపల్లి గ్రామంలో ఐదో వార్డు ఆర్ అండ్ బి మెయిన్ రోడ్డు ప్రక్కన ఉన్న సిసి రోడ్ డ్రైనేజ్ మీద వేసిన కల్వర్టు సీసీ ప్లేట్లు పగిలి ప్రజలు గ్రామస్తులు అనేక ఇబ్బందులు పడుతున్నారు అటుగా ప్రయాణించే వాహనదారులు చాలా ఇబ్బందులకు గురై పలుమార్లు పడిపోతున్నారు రాత్రివేళ ఆ రోడ్డులో వెళ్లాలంటే భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు, పంచాయతీ కార్యదర్శి, నాయకులు వెంటనే స్పందించి ఈ సమస్యను గట్టెక్కించాలని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



## బోధకాలు వ్యాధిగ్రస్తులకు ఉచిత కిట్ల పంపిణీ

**తూర్పుగోదావరి జిల్లా, తాళ్లపూడి మండలం, ఏప్రిల్11, ప్రజాజ్యోతి న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖ ద్వారా బోధకాలు వ్యాధిగ్రస్తులకు తాళ్లపూడి ప్రభుత్వ ఆసుపత్రి నందు డాక్టర్ హారిక గుప్తా ఆధ్వర్యంలో కిట్లు పంపిణీ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, సూపర్వైజర్ కె.ఎల్.రాయ్ వైద్య సిబ్బంది ఉన్నారు.



## తాటియకులగూడెంలో అన్న సంతర్పణ

**ప్రజాజ్యోతి న్యూస్ /జీలుగుమిల్లి :** జీలుగుమిల్లి మండల కేంద్రంలో తాటియాకుల గూడెం గ్రామంలో శ్రీరామనవమి సందర్భంగా అన్నదాన కార్యక్రమానికి స్థానిక శాసనసభ్యులు ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు .తాటియకుల గూడెం యాదవ్ సంఘం గ్రామ పెద్దలు, కమిటీ మెంబర్స్ ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు తదుపరి ఎమ్మెల్యే తో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామస్తులందరూ పాల్గొని ఎంతో ఆనందకరంగా పండుగని జరుపుకుంటున్నారు వచ్చే శ్రీరామనవమికి మూడు రోజులు అంగరంగ వైభవంగా చేయాలని ఎమ్మెల్యే బాలరాజు కోరారు. జిల్లా కార్యదర్శి గడ్డ మనుగు రవికుమార్ మాట్లాడుతూ వచ్చే సంవత్సరం ఘనంగా చేద్దామని గ్రామస్తులు అందరము కలిసి ఈ పండుగను చేద్దామని తెలియపరిచారు మరొకసారి గ్రామస్తులకు వీర మహిళకు కూటమి నాయకులకు శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు గుడ్ల రాంబాబు, జనసేన పార్టీ ప్రెసిడెంట్ రాయి సుబ్బారావు, మామిళ్ళ అప్పారావు, మేకల శ్రీను, నేరసు సుబ్బారావు, జనసేన పార్టీ మండల అధ్యక్షులు పసుపులేటి రాము, యాదవ సంఘం పెద్దలు కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ఒంటిమిట్ట శ్రీ కోదండరామునికి పట్టువస్త్రాలు సమర్పించిన ముఖ్యమంత్రి



**ఏప్రిల్ 11,(ప్రజాజ్యోతి),తిరుపతి జిల్లా ప్రతినిధి/ఒంటిమిట్ట :** ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామాలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీ సీతారాముల కల్యాణం సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీ సమేతంగా ఆలయంలో స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ముందుగా ఆలయం వద్దకు చేరుకున్న ముఖ్యమంత్రి దంపతులకు టిటిడి చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో జే. శ్యామలరావు, టిటిడి బోర్డు సభ్యులు, అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఆలయంలో దర్శన ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా సీఎంకి శేషవస్త్రం అందించి వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు, ఒంటిమిట్ట రాములవారి చిత్రపటం అందజేశారు.



## జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో ఘనంగా జ్యోతిరావ్ పూలే జయంతి

**ఏప్రిల్ 11,(ప్రజాజ్యోతి),తిరుపతి జిల్లా ప్రతినిధి :** జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలోని కౌన్సిల్ హాల్ నందు ఈరోజు సంఘసంస్కర్త, స్త్రీ విద్యా ఉద్ధారకులు, సామాజిక సంఘసంస్కర్త జ్యోతిరావు పూలే 198వ జయంతి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విశ్వవిద్యాలయంలోని వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జి ఎస్ ఆర్ కృష్ణమూర్తి విచ్చేసి జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలు అర్పించి నివాళులర్పించారు. అనంతరం ఆయన చేసిన సంఘ సేవను వర్ణించారు. ప్రత్యేకించి స్త్రీ విద్య కోసం చేసినటువంటి కృషిని, అదేవిధంగా సత్యశోధ సంస్థ ద్వారా సమాజంలో ఉన్నటువంటి వివక్షలను, సమస్యలను రూపుమాపడానికి విశేష కృషి చేశారని తెలియజేశారు. ఎవరైతే వితంతువులు ఉన్నారో వారికి పునర్వివాహం, ప్రత్యేకించి సరైనటువంటి వసతి సదుపాయాలు మొదలైన అంశాల పైన ఆయన ఉద్యమించడం జరిగిందని తెలియజేశారు. గులాంగిరి అనే పుస్తకంలో కుల వివక్ష, సామాజిక సమస్యలు ఏవైతే ఉన్నాయో ఆ సమస్యలను ఆయన చక్కగా వివరించాలని తెలియజేశారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ .కె. వెంకటనారాయణ రావు, డీన్ ఆఫ్ స్టూడెంట్స్ వెల్ఫేర్ ప్రొ.ఎస్. దక్షిణామూర్తి శర్మ, ఫినాన్స్ ఆఫీసర్ ప్రొ.రాధా గోవింద త్రిపాఠి, ప్రొ.పి.వెంకటరావు, రిజర్వేషన్ సెల్ చైర్ పర్సన్ డా.జె.బి.చక్రవర్తి, ఓబీసీ సెల్ లైసెన్ ఆఫీసర్ ప్రొ.ఎ. సచ్చిదానందమూర్తి, ఎన్.ఎస్.ఎస్ కోఆర్డినేటర్ డా.ఎ.చందూలాల్ విశ్వవిద్యాలయంలోని విభిన్న విభాగాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయడం జరిగింది.

## మహిళా విద్యాభివృద్ధికి మార్గదర్శి జ్యోతిరావు పూలే

- ఆయన జీవితం ప్రతీ ఒక్కరికీ ఆదర్శం
- వైసిపి రాష్ట్ర కళింగ కార్పొరేషన్ మాజీ చైర్మన్,కళింగ సామాజిక రాష్ట్ర అధ్యక్షులు దుంపల రామారావు







**శ్రీకాకుళం, ప్రజా జ్యోతి న్యూస్ :** మహిళా అభ్యుదయవాది , నిరంతరం మహిళ విద్యా అభివృద్ధికు పాటుపడిన ఆదర్శప్రాయుడని వైసిపి రాష్ట్ర కళింగ కార్పొరేషన్ మాజీ చైర్మన్,కళింగ సామాజిక రాష్ట్ర అధ్యక్షులు దుంపల రామారావు అన్నారు. శ్రీకాకుళం లో ఎ. ఐ.బి.సి.ఎఫ్ కార్యాలయంలో జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు . అనంతరం ఆయన మాట్లాడుతూ సామాజిక సంఘ సంస్కరణ ఉద్యమంలో పూలే ఒక ముఖ్యమైన వ్యక్తిగా నిలిచారన్నారు. కొనియాడారు. బడుగు , బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన అహర్నిశలుకృషి చేశారన్నారు. బీసీ లకు వెన్నుదన్నుగా నిలిచి వారి ఉన్నతికి కృషి చేసిన మహనీయుడని జ్యోతి రావు పూలే అని అన్నారు. బీసీల గురించే కాకుండా ఎస్సీ , ఎస్టీ ,మైనార్టీల కోసం ఆయన ఎల్లవేళలా పాటుపడ్డారు అని తెలిపారు. కులపరమైన వివక్షను, అన్యాయాలను రూపుమాపడానికి తన జీవితాన్ని ధారపోసిన మహాత్ముడు జ్యోతి రావు పూలే అని పేర్కొన్నారు. భారతదేశం లో బాలికల కోసం మొట్టమొదటి సారిగా జ్యోతిరావు పూలే ఒక పాఠశాల ప్రారంభించారని , అటువంటి మహనీయుడు జీవిత చరిత్రను ప్రతీ ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు టి లోకనాథం ,వి సత్యన్నారాయణ ,పి రామకృష్ణరావు, ఎన్.ఆర్.సి రాజు , హెచ్ రామారావు , బి పాపన్న యాదవ్ , రాంబాబు యాదవ్ ,శివ యాదవ్ , గొర్లె రామారావు , కె వేంకటేశ్వర రావు , ఆదిత్య , డి గోవింద రావు , సనపల రామకృష్ణ , తేజ , రమణ మూర్తి ,బొడ్డేపల్లి నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో ధ్యాన మందిర ప్రారంభోత్సవం

**ఏప్రిల్ 11,(ప్రజ్ఞాజ్యోతి),తిరుపతి జిల్లా ప్రతినిధి :** జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం తిరుపతిలో శుక్రవారం కంచి కామకోటి పీఠాధితులు శంకర విజయేంద్ర సరస్వతి విశ్వవిద్యాలయంలోని నైమిశా గురుకులంలో విశ్వనాథ ధ్యాన మందిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామివారు మాట్లాడుతూ జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం సంస్కృత భాష సంరక్షణకు, సనాతన ధర్మ పరిరక్షణకు ఎంతో కృషి చేస్తోందని అభినందించారు. విశ్వవిద్యాలయంలో అధ్యయనం చేసేటువంటి విద్యార్థులకు వివిధ భారతీయ జ్ఞాన పరంపరలను అందిస్తూ, ప్రకృతితో అధ్యయనం ఏ విధంగా చేయాలి అనే విషయాన్ని తెలియజేస్తూ, శాస్త్ర జ్ఞానంతో పాటు ఆధ్యాత్మిక జ్ఞానాన్ని కూడా బోధిస్తూ ఉత్తమ నాగరికలుగా వారిని తయారు చేస్తున్నందుకు విశ్వవిద్యాలయంలోని వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్సార్ కృష్ణమూర్తినీ అభినంసించారు. అదే విధంగా విశ్వనాథ ధ్యాన మందిరం దగ్గర ఉన్నటువంటి శివలింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆ విశ్వనాథుని యొక్క అనుగ్రహం విశ్వవిద్యాలయంలోని అధ్యాపక-ఉద్యోగ-విద్యార్థులందరిపై ఉండాలని, విశ్వవిద్యాలయం మరింత అభివృద్ధి చెందాలని ఆయన సూచించారు. గురుకుల పద్ధతిలో అధ్యయన-అధ్యాపనం శాస్త్ర పరిరక్షణకు ఎంతో దోహదపడుతుందని సూచించారు. వైవిధ్యమైనటువంటి పాఠ్యాంశాలను కూడా విశ్వవిద్యాలయం ద్వారా విద్యార్థులకు అందించడం ఎంతో శుభ పరిణామమని ఆయన ఆనందాన్ని వ్యక్తం చేశారు. అనంతరం వచ్చినటువంటి అందరికీ శుభాశీస్సులు తెలియజేశారు. అనంతరం విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్సార్ కృష్ణమూర్తి స్వామివారికి నమస్కరించి, వారి ఆశీర్వాదాలు పొందారు. ఆయన మాట్లాడుతూ సంస్కృత భాష



సంరక్షణకు విశ్వవిద్యాలయం తరఫున విశేష కృషి చేస్తూ ముందుకు సాగుతున్నామని అన్నారు. భవిష్యత్తులో కూడా విద్యార్థులు జ్ఞానంతో పాటు ఆధ్యాత్మిక జ్ఞానాన్ని, భారతీయ సనాతన ధర్మాన్ని సంరక్షణచేస్తూ, భారతీయతను పరిఢవిల్లవించేలా కృషి చేస్తామని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో విచ్చేసినటువంటి అందరికీ కూడా హృదయపూర్వక ధన్యవాదములు అలాగే అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం అకాడమిక్ డీన్ ప్రొఫెసర్ రజినీకాంత్ శుక్లా, రిజిస్ట్రార్ .కె.వెంకటనారాయణ రావు, ఫైనాన్స్ ఆఫీసర్ ప్రొఫెసర్ రాధా గోవిందు త్రిపాఠి, పరీక్షా నియంత్రకులు డా.కె. సాంబశివమూర్తి, డీన్ ఆఫ్ స్టూడెంట్స్ వెల్ఫేర్ ప్రొఫెసర్ ఎస్ దక్షిణామూర్తి శర్మ, పరమాచార్య శాస్త్ర పరిరక్షణ కేంద్ర నిర్దేశకులు ప్రొఫెసర్ కె. గణపతి భట్, సాహిత్య సంస్కృతి డీన్ ప్రొఫెసర్ సత్యనారాయణ ఆచార్య, ఐక్యూ.ఎ.సి డైరెక్టర్ ప్రొఫెసర్ సతీష్ కె.ఎస్ విశ్వవిద్యాలయ పి.ఆర్.ఓ ప్రొఫెసర్ వి రమేష్ బాబు, విశ్వవిద్యాలయ ఇంజనీర్ టి.భరణి కుమార్ విశ్వవిద్యాలయంలోని విభిన్న విభాగాల అధ్యాపకులు విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామివారి అనుగ్రహాలను పొందారు.



## సీతారాముల కళ్యాణ మహొత్సవములు

**అన్నవరం ప్రజా జ్యోతి రిపోర్టర్ :** జై సత్యదేవ, శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానము నందు వైధిక కమిటీ వారి సూచనల ప్రకారము ది.05. నుండి 13వ తేదీ వరకు జరుగు శ్రీ సీతారాముల వారి కళ్యాణ మహొత్సవముల సందర్భముగా ది.12 వ తేదీన శనివారం ఉదయం 9.00గం. ల నుండి పంపా సరోవరము నందు చక్ర స్నానం మరియు సాయంత్రం గం.4.00న.లకు శ్రీ సీతారాముల వారి ఆలయం వద్ద దండియాడింపు వైదిక కమిటీ వారు నిర్ణయించిన ప్రకారం కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించబడును. కావున సదరు కార్యక్రమములను మీ ద్వారా భక్తులకు, గ్రామస్తులుకు తెలియ జేయ వలసినదిగా కోరడమైనది



## వక్ఫ్ సవరణ చట్టాన్ని నిరసిస్తూ ముస్లింల శాంతియుత ర్యాలీ

- అంబేద్కర్ సెంటర్లో మానవహారం..
- తహసిల్దార్ సలీమాకు వినతి పత్రం అందజేసిన అంజుమన్ కమిటీ

**బాపట్ల, ఏప్రిల్ 11 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్) :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ చట్టాన్ని తక్షణమే భేషరతుగా రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం బాపట్ల అంజుమన్ ఏ ఇస్లామియా ఆధ్వర్యంలో శాంతియుత ర్యాలీ నిర్వహించారు. బాపట్ల నియోజకవర్గంలోనీ పలు మసీదుల నుంచి వేలాది మంది ముస్లిం సోదరులు ,మతపెద్దలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు ,లౌకికవాదులు పాల్గొన్నారు. స్థానిక పాత బస్టాండ్ వద్ద గల అంజుమన్ ఇస్లామియా మసీదు నుండి బయలుదేరిన ర్యాలీ చీల్ రోడ్డు,పాత బస్టాండు, అంబేద్కర్ సర్కిల్ మీదుగా తహసిల్దార్ కార్యాలయం వరకు వేలాది మందితో భారీ ర్యాలీ జరిగింది. అంతకుముందు అంబేద్కర్ సెంటర్లో ముస్లిం సోదరులు మానవహారం నిర్వహించారు. జుమ్మా నమాజ్ అనంతరం జాతీయ జెండాలు ,ప్లకార్డులు, ఫ్లెక్సీలతో ముస్లిం సోదరులు నల్ల బ్యాడ్జీలు ధరించి తమ నిరసన వ్యక్తం చేశారు.బిజెపి ప్రభుత్వం కుట్రపూర్తిగా ముస్లింల హక్కులను కాలరాసేందుకు అనేక నల్ల చట్టాలు చేస్తుంది అని విమర్శించారు. ముస్లింల జీవన విధానం హరించే వేసే విధంగా ప్రజాస్వామ్యాన్ని కించపరుస్తుంది అని పేర్కొన్నారు. అనంతరం అంజుమన్ కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ రహీం జానీ కార్యదర్శి అబ్దుల్ కరీం కమిటీ సభ్యులు వివిధ రాజకీయ పార్టీల నాయకులు స్థానిక తహసిల్దార్ షేక్ సలీమాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంజుమన్ కమిటీ అధ్యక్షులు అబ్దుల్ రహీం జానీ మాట్లాడుతూ వక్ఫ్ అంటే ముస్లింల సోదరులు తమకు ఉన్న సంపదలో అల్లా పేరిట దానం చేసే ఆస్తి అన్నారు .స్వాతంత్రం ముందు నుండి ముస్లిం సోదరులకు వక్ఫ్ ఆస్తులు ఉన్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం దురాగతాలపై సమిష్టిగా పోరాడి వాటిని తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు సిపిఎం జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ గంగయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ చట్టానికి తమ పార్టీ పూర్తిగా వ్యతిరేకిస్తుందన్నారు. బి.ఎస్.పి నియోజకవర్గ ఇన్చార్జి రాజారావు, వైసీపీ బాపట్ల జిల్లా దివ్యాంగుల అధ్యక్షులు చల్లా రామయ్య, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ మజుందార్ తో పాటు ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి దిలీప్ వేలాదిమందిముస్లిం మత పెద్దలు ముస్లింలు పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహావిష్కరణలో అందరూ పాల్గొనాలి

### ఆచంట సర్పంచ్ కోట సరోజినీ వెంకటేశ్వరరావు

**ఆచంట ఏప్రియల్ 11 ప్రజాజ్యోతి న్యూస్ :** ఈ నెల 13వ తారీఖున సాయంత్రం నాలుగు గంటలకు నూతనంగా ఏర్పాటు చేసిన ప్రపంచ మేధావి, భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ నూతన విగ్రహ ఆవిష్కరణకు ఆచంట నియోజకవర్గం లోని మాల సహోదరులందరూ తప్పనిసరిగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసి మాలల జేఏసీ ఐక్యతను చాటి చెప్పాలని విగ్రహ దాత, ఆచంట మండలం మాల సంఘాల జేఏసీ చైర్మన్, కోట వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు, పశ్చిమగోదావరి జిల్లా, ఆచంట మండలం, ఆచంట గ్రామంలో సర్పంచ్ కోట సరోజిని వెంకటేశ్వరరావు ఆర్థిక సహాయంతో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రపంచ మేధావి, భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న, భారతదేశ ప్రజలందరికీ సమన్యాయం చేసిన ఆధునిక దేవుడు, మహిళా సంక్షేమ రథసారథి, బీసీ సామాజిక వర్గాల ఉద్ధారకుడు డాక్టర్ బాబాసాహెబ్ విగ్రహ ఆవిష్కరణను భారీగా ఎత్తున ఆచంట నియోజకవర్గంలోని మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో చేయబోతున్నారు. ఈ సందర్భంగా విగ్రహ దాత ఆచంట మండలం మాల సంఘాల జేఏసీ చైర్మన్ కోట వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, కట్టుబాట్ల చీకటి గుహలో మగ్గిన మగువకు తెగువనిచ్చిన మహా మేధావి అంబేద్కర్, బిక్కుబిక్కుమంటూ వెలుగుతున్న బతుకు దీపాలకు ఒక సూర్యగ్రహం అంబేద్కర్ అని చచ్చుబడిపోయిన దేహాలకు సరికొత్త జీవన ఔషధం అంబేద్కర్, అలాంటి మహానుభావుడు విగ్రహం ఏర్పాటు చేసే అవకాశం తనకు కలిగినందుకు ఎంతో సంతోషంగా ఉందని ఈ విగ్రహ ఆవిష్కరణకు ఆచంట నియోజకవర్గం ఎమ్మెల్యే, శాసనసభ హక్కుల చైర్మన్, పితాని సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని, శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేను రాజు



చేతుల మీదగా అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించబోతున్నారని, అలాగే ఆచంట నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే, మాజీ గృహ నిర్మాణ శాఖ మంత్రి, చెరుకువాడ శ్రీరంగనాథరాజు విశిష్ట అతిథిగా విచ్చేస్తున్నారని, ప్రత్యేక ఆహ్వానితులుగా నర్సాపురం ఆర్డీవో దాసిరాజు, రాజమండ్రి భావన హాస్పిటల్ ఎండి సరిళ్ల పురుషోత్త హాజరవుతారని, ఈ కార్యక్రమానికి సభ అధ్యక్షులుగా సర్పంచ్ కోట సరోజినీ వెంకటేశ్వరరావు వ్యవహరిస్తారని తెలియజేశారు, అంతేకాకుండా మాల సామాజిక వర్గానికి ఎటువంటి అన్యాయం జరగకుండా, మాల సామాజిక వర్గం కోసం రాష్ట్రవ్యాప్తంగా నిరంతరం అలుపెరగని పోరాటం చేస్తూ, మాల సామాజిక వర్గం అభివృద్ధి కోసం శ్రమిస్తున్నటువంటి మాల జాతి ముద్దుబిడ్డలు, నేటి మాల సామాజిక వర్గం పోరాట యోధులు అయినటువంటి మాల సంఘాల జేఏసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు చీకటిమిల్లి మంగరాజు, మాల సంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ గుమ్మాపు సూర్య వరప్రసాద్, మాల సంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ నల్లి రాజేష్, మాల సంఘాల జేఏసీ నాయకులు న్యాయవాది బండి సుందర రామమూర్తి, ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ జిల్లా మెంబర్ జిల్లెల్ల సత్య సుధామ, మాల సంఘాల జేఏసీ నాయకులు ఉన్నమట్ల మునిబాబు, మాల సంఘాల జేఏసీ నాయకులు యాదల రవిచంద్ర, గౌరవ అతిథులుగా హాజరవుతున్నారని తెలియజేశారు. ఆచంట నియోజకవర్గం మాల సంఘాల జేఏసీ నాయకులు బీర మధు, మట్టా రాము, పీతల అంబేద్కర్, ఈది ప్రవీణ్, తాడిపర్తి ప్రసన్న కుమార్, పోతుమూడి రామచంద్రారావు, బుడిత భీమారావు, జెట్రీ శ్రీను, పులిదిండి వెంకటేశ్వరరావు వంటి వారు ప్రత్యేక అతిథులుగా హాజరవుతారని, అలాగే ఆచంట నియోజకవర్గంలో అంబేద్కర్ మహానుభావుడు రాసిన రాజ్యాంగం వల్ల ప్రజాప్రతినిధులుగా వెలుగుతున్న మాల సామాజిక వర్గానికి చెందిన ప్రజాప్రతినిధులు నేలపూడి బేబీ సర్పంచ్ వల్లూరు, పెనుగొండ గ్రామపంచాయతీ సర్పంచ్ నక్క సోని శ్యామల వేదవ్యాస శాస్త్రి, సర్పంచ్ తాడిపర్తి ప్రసన్నకుమారి, సర్పంచ్ చెట్టి బత్తుల సువర్ణ రాజు, చింతపల్లి గనిరాజు (చంటి ), మర్రి రాజేశ్వరి, బుర్ర రవికుమార్, కాకర రాజేశ్వరరావు, మట్ట కుమారి, గొట్టుముక్కల సోనియా రమేష్, వడ్లపాటి రాజేంద్రప్రసాద్, బీర జాన్ కుమారి, ఎంపీపీ ఎస్ మంగళి సాగర్, వైస్ ఎంపీపీ పాలపర్తి సుబ్రమణ్యం, వైస్ ఎంపీపీ ఈది అనిత, ఎంపిటిసి తప్పెట్ల విజయ్ కుమారి, ఎంపీటీసీ ఉల్లం జ్యోతి, ఎంపీటీసీ యల్లమెల్లి బేబీ, ఎంపీటీసీ చిన్నం ఏడుకొండలు, ఎంపిటిసి రొక్కల నాగమణి, ఎంపీటీసీ గెడ్డం ఈశ్వరుడు, ఎంపీటీసీ మాండ్రు శాంతకుమారి, ఎంపీటీసీ అంబటి సుధాకర్, ఎంపీటీసీ విప్పర్తి శారదా చిట్టిబాబు,వంటి వారు సర్పంచులు గౌరవ ఆహ్వానితులుగా, ఎంపీటీసీలు ఆత్మీయ ఆహ్వానితులుగా హాజరవుతారని అన్నారు. కాబట్టి ఆచంట నియోజకవర్గంలోని మాల సహోదరులు అందరు గమనించి,బడుగు బలహీన వర్గాల కోసం నిరంతరం కష్టపడి, తన కుటుంబాన్ని కూడా పక్కనపెట్టి, పీడిత బాధిత సమాజం కోసం, తన జాతి బిడ్డల ఎదుగుదల కోసం అలుపెరగని పోరాటం చేసిన బాబాసాహెబ్ అంబేద్కర్ లాంటి మహానుభావుడు విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో అందరూ తప్పకుండా పాల్గొని జాతి ఎదుగుదలకు కృషి చేయాలని అన్నారు.



## మే నెల 5న రాచపల్లిలో గంగాలమ్మ తల్లి గాబు సంబరం

**కాకినాడ జిల్లా ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్ :** ప్రత్తిపాడు మండలంలోని రాచపల్లి గ్రామంలో నంది సెంటర్ దగ్గర ఉన్న వమ్మి వారి గంగాలమ్మ తల్లి ఆలయం వద్ద శుక్రవారం ముందుగా పసుపు దంచి అనంతరం పసుపు రాట వేసి చేసాలు కట్టినారు. అలాగే మే నెల 5న గంగాలమ్మ తల్లి గాబు సంబరం మరియు భారీ ఎత్తున అన్నసంతర్పణ నిర్వహిస్తున్నట్లు వమ్మి వారి కుటుంబ సభ్యులు తెలియజేశారు.

## వ్యర్థ పదార్థాలతో సంపద సృష్టికి సన్నాహాలు



**బాపట్ల ఏప్రిల్ 11 ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ :** జిల్లా కేంద్రమైన బాపట్ల మున్సిపాలిటీ పరిధిలో అపార్ట్మెంట్స్ హొటల్స్ వివాహాది శుభకార్యముల, కూరగాయల మార్కెట్ లా ద్వారా సేకరించిన తడి చెత్తతో వర్మి కంపోస్ట్ తయారీకి చర్యలు చేపట్టామని మున్సిపల్ కమిషనర్ జి రఘునాథరెడ్డి విలేకరులకు తెలిపారు శుక్రవారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ 100 కిలోలు పైగా వచ్చే తడి చెత్తను లెగసి అంటామని వెల్లడించారు ఈ విధంగా పై ప్రదేశాల్లో వచ్చే తడి చెత్త సేకరించి వర్మి కంపోస్ట్ తయారీ యార్డ్ కు తరలిస్తామన్నారు కావున ప్రజలు వచ్చే తడి చెత్తను జాగ్రత్త చేసి మున్సిపాలిటీ పారిశుద్ధ్య అధికారులకు తెలియజేస్తే సిబ్బంది వచ్చి చెత్తను తరలించే ప్రక్రియ చేపడతామన్నారు అలాకాకుండా రోడ్లపై ఇష్టం వచ్చినట్లు వేస్తే తగు చర్యలు తప్పవని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్లు సిహెచ్ కరుణ శ్రీనివాసరావు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



## ఎంపీ నిధులతో మంజూరైన వంతెనకు స్థాపన

### క్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్యే

**బాపట్ల, ఏప్రిల్ 11 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్) :** బాపట్ల నియోజకవర్గం పిట్టలవానిపాలెం మండలం అలకాపురం గ్రామ పంచాయతీ లోని ఎస్టీ కాలనీ లో తుంగభద్ర కాల్వ మీద పి ఎం జి ఎస్ వై పథకం కింద కేంద్ర ప్రభుత్వం నుండి ఎంపీ తీసుకువచ్చిన నిధులు 9 కోట్ల 13 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించబోయే వంతెన శంకుస్థాపన కార్యక్రమంలో బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ పాల్గొన్నారు. ఆయనతోపాటు కలిసి ముఖ్య అతిథిగా బాపట్ల పార్లమెంట్ సభ్యులు మరియు లోక్ సభ ప్యానల్ స్పీకర్ తెన్నేటి కృష్ణప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చీరాల గోవర్ధన రెడ్డి, అధికారులు, పెద్ద ఎత్తున కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తమ సమస్యను విన్నవించిన వెంటనే స్పందించి కేంద్రం నుండి వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన ఎంపీ కృష్ణప్రసాద్ కి గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు.



## మహాత్మ జ్యోతిరావు పూలేకు ఘన నివాళి

**బాపట్ల, ఏప్రిల్ 11 (ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్) :** విద్యతోనే మహిళలు అభివృద్ధి సాధిస్తారని గుర్తించిన గొప్ప మహనీయులు మహాత్మా జ్యోతిరావు పూలే అని బాపట్ల పార్లమెంట్ సభ్యులు, పానెల్ స్పీకర్, హెూం వ్యవహారాల స్టాండింగ్ కమిటీ సభ్యులు తెన్నేటి కృష్ణ ప్రసాద్ తెలిపారు. మహాత్మా జ్యోతిరావు పూలే 199వ జయంతి కార్యక్రమం శుక్రవారం స్థానిక బాపట్లలోని జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద జరిగింది. మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి పార్లమెంట్ సభ్యులు కృష్ణ ప్రసాద్, జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి, బాపట్ల శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ, జిల్లా అధికారులు పలువురు పుష్పమాలలతో ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బాపట్ల అర్బన్ డెవలప్మెంట్ ఆథారిటి చైర్మన్ శలగాల రాజశేఖర్ బాబు, జిల్లా రెవిన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్, బీసీ సంక్షేమ శాఖ అధికారిని శివలీల, ఆర్డీవో పి గ్లోరియా, ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారని రాజా దెబోరా, బీసీ, ఎస్సీ సంఘాల నాయకులు మోహన్ గౌడ్, చారువాక పాల్గొన్నారు.



## మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి

**ప్రత్తిపాడు ప్రజా జ్యోతి రిపోర్టర్. వీరబాబు :** ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ప్రత్తిపాడు నియోజకవర్గ వైయస్సార్ సిపి నాయకులు ముదునూరి మురళీకృష్ణం రాజు ఈ కార్యక్రమంలో కోలా తాతబాబు ,బొల్లు నాగేశ్వరరావు ,దొరబాబు ,పోకనాటి వెంకటేశ్వరరావు ,యాళ్ల ఏసు దొడ్డిపట్ల కృష్ణ కోలా సూరిబాబు ,తూపాటి బాబ్జి ,వెంకటేష్ బత్తిన సామ్యూల్ అప్పారావు ,శ్రీను కన్నా ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు

# అంగరంగ వైభవంగా శ్రీ సీతారాముల కళ్యాణం

- వేలాదిగా హాజరైన భక్తులు
- భక్తులందరికి తిరుమల శ్రీవారి లడ్డు ప్రసాదం, ముత్యంతో కూడిన తలంబ్రాల పంపిణీ



**(ప్రజాజ్యోతి),తిరుపతి జిల్లా ప్రతినిధి :** ఒంటిమిట్ట శ్రీ కోదండరాముడి బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం సాయంత్రం శ్రీ సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. వేలాదిగా హాజరైన భక్తులు స్వామివారి కల్యాణోత్సవాన్ని తన్మయత్వంతో తిలకించారు. రాములవారి కల్యాణానికి సంబంధించి సీతమ్మ వారి కోరికను శాస్త్రరీత్యా తెలిపే కాంతకోరిక కార్యక్రమాన్ని 6 గంటలకు వేదిక మీద అర్చకులు నిర్వహించారు. సాయంత్రం 6.30 గంటలకు ఎదుర్కోలు ఉత్సవం నిర్వహించారు. రాత్రి 7 గంటలకు శ్రీ సీతారాముల కల్యాణం ప్రారంభమైంది. ముందుగా భగవత్ విజ్ఞాపనం, సభ అనుజ్ఞ, లోకకల్యాణం కోసం సంకల్పం చేయించారు. కల్యాణంలోని పదార్థాలన్నీ భగవంతుని మయం చేసేందుకు పుణ్యాహవచనం నిర్వహించారు. ఆ తరువాత రక్షాబంధనం, యజ్ఞోపవీతధారణ, వరప్రేశనం(కన్యావరణం), మధుపర్కార్చనం చేశారు. మహాసంకల్పం అనంతరం కన్యాదానం చేసి సీతారామచంద్రుల ప్రవరలను చదివారు. రాములవారి వంశస్వరూపాన్ని స్తుతించారు. అగ్నిప్రతిష్టాపన తరువాత సీతారాముల తల మీద జీలకర్ర, బెల్లం ఉంచి శాస్త్రోక్తంగా కల్యాణ వేడుక నిర్వహించారు. తరువాత మంగళాష్టకం, చూర్ణిక పఠించి, మాంగళ్యసూత్ర పూజ, మంగళసూత్రధారణ, అక్షతారోపణం చేపట్టారు. స్వామి నివేదన, వేదస్వస్తి, మహదాశీర్వచనంతో కల్యాణఘట్టం పూర్తయింది. స్వామివారి కల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం శ్రీ సీతారాముల ఉత్సవమూర్తుల శోభాయాత్ర ఆలయం నుండి కల్యాణవేదిక వరకు వైభవంగా జరిగింది. మంగళవాయిద్యాలు, భజనలు, కోలాటాల నడుమ శోభాయాత్ర వేడుకగా సాగింది. శ్రీవేంకటేశ్వర భక్తి ఛానల్‌లో శ్రీ సీతారాముల కల్యాణాన్ని ప్రత్యక్ష ప్రసారం చేశారు. కల్యాణవేదిక ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గ్యాలరీల్లో కూర్చుని శ్రీ సీతారాముల కల్యాణాన్ని తిలకించేందుకు విచ్చేసిన భక్తులందరికి శ్రీవారి సేవకులు తిరుమల శ్రీవారి లడ్డు ప్రసాదం, ముత్యంతో కూడిన తలంబ్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దంపతులు,టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో జే. శ్యామల రావు, అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, జేఈవో వీరబ్రహ్మం, వై ఎస్ ఆర్ జిల్లా కలెక్టర్ శ్రీధర్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.







# శ్రీ సీతా రామ కళ్యాణం దర్శించడం మన అదృష్టం


- ఒంటిమిట్టను దేవాలయ పర్యాటక హబ్‌గా అభివృద్ధి చేస్తాం
- కొండలపై ఆయుర్వేద మొక్కల పెంపకం
- ఒంటిమిట్టలో త్వరలో అన్నప్రసాదం ప్రారంభం
- శ్రీరాముడు పవిత్ర కుటుంబ సంబంధాలకు ఆదర్శం
- రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు



**ఏప్రిల్ 11,(ప్రజాజ్యోతి),తిరుపతి జిల్లా ప్రతినిధి :** శ్రీరామ రాజ్యాన్ని మళ్ళీ స్థాపించాలనే తపన తనదని, ప్రజలందరూ శ్రీరాముడు చూపించిన నీతి, ధర్మ మార్గాన్ని అనుసరించి జీవించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు. కడప జిల్లాలోని ఒంటిమిట్టలో శుక్రవారం సాయంత్రం జరిగిన శ్రీ సీతా రామ కళ్యాణ మహోత్సవం ముగిసిన తర్వాత సిఎం మాట్లాడారు. కళ్యాణ వేదిక వద్ద జరిగిన ఈ సీతారాముల కళ్యాణాన్ని తిలకించేందుకు భారీగా తరలివచ్చిన భక్తులను ఉద్దేశించి ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ఈ దివ్య కళ్యాణాన్ని వీక్షించడం ప్రతి ఒక్కరికీ అదృష్టంగా పేర్కొన్నారు. శ్రీరాముడు ఒక వాగ్దానాన్ని ఎలా నిలబెట్టుకోవాలో, తండ్రి ఆజ్ఞను ఎలా విధిగా పాటించాలో, కుటుంబ బంధాలను ఎలా పరిపూర్ణంగా పోషించాలో తెలియజేశారని సీఎం అన్నారు. “తిరుమలలో గోవింద నామం ప్రతిధ్వనిస్తున్న విధంగా, ఒంటిమిట్టలో ‘జై శ్రీరామ్’ నినాదమే మిన్నగా వినిపించాలి. రాష్ట్ర విభజన తర్వాత ఒంటిమిట్టను ప్రధాన పుణ్యక్షేత్రంగా అభివృద్ధి చేయడానికి ఈ ఆలయాన్ని దశాబ్ద కాలం క్రితమే టిటిడికి ఇవ్వడమైనదన్నారు. “ఈ సంతోషకరమైన సందర్భంగా, తిరుమల మాదిరిగా ఒంటిమిట్టలో కూడా అన్నప్రసాదం ప్రారంభించాలన్న నిశ్చయాన్ని టిటిడి ఛైర్మన్ బీఆర్ నాయుడు తీసుకోవాలని కోరారు. ఒంటిమిట్టను పుణ్యభూమిగా మార్చేందుకు ఇక్కడి కొండలపై ఆయుర్వేద మొక్కలను నాటనున్నట్టు తెలిపారు. అదేవిధంగా ఒంటిమిట్టను దేవాలయ పర్యాటక హబ్‌గా అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెంది 2047 నాటికి ప్రపంచంలో నంబర్ వన్ దేశంగా మారుతుంది అని సీఎం చెప్పారు. తర్వాత టిటిడి ఛైర్మన్ బీఆర్ నాయుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఒంటిమిట్టలో అన్నప్రసాదం త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జి మంత్రి సవితా, దేవాదాయ ధర్మాదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, టిటిడి ఛైర్మన్ బీఆర్ నాయుడు, టీటీడీ ఈవో జే.శ్యామల రావు, జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి, అదనపు ఈవో శ్రీ సిహెచ్ వెంకయ్య చౌదరి, జేఈవో వి వీరబ్రహ్మం, టిటిడి బోర్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


# ప్రతి ఇంటి నుంచి పారిశ్రామికవేత్తలు..

- బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్..
- సాకారమవుతున్న సీఎం కలలు..
- పూలేకు ఘన నివాళి



**బాపట్ల, ఏప్రిల్ 11( ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ) :** ప్రతి ఇంటి నుండి పారిశ్రామికవేత్తలు రావాలనే సీఎం కలలు సాకారం అవుతున్నాయని బాపట్ల పార్లమెంట్ సభ్యులు, పానెల్ స్పీకర్, హెూం వ్యవహారాల స్టాండింగ్ కమిటీ సభ్యులు తెన్నేటి కృష్ణ ప్రసాద్ చెప్పారు. బీసీ సంక్షేమ శాఖ, కార్పొరేషన్ ల ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కాపు కళ్యాణ మండపంలో మహాత్మా జ్యోతిరావు పూలే 199వ జయంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు పలువురు పుష్ప మాలలతో ఘనంగా నివాళులు అర్పించారు. తొలుత పార్లమెంట్ సభ్యులు, జిల్లా కలెక్టర్, శాసనసభ్యులు, బుడా చైర్మన్ లు జ్యోతి వెలిగించి వేడుకలను ప్రారంభించారు. వేడుకలలో భాగంగా 10.25 కోట్లు విలువ చేసే 412 యూనిట్లను ప్రజా ప్రతినిధులు, అధికారుల చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు.డబుల్ ఇంజిన్ సర్కార్ రాష్ట్రంలో పాలన సాగిస్తుందని బాపట్ల పార్లమెంట్ సభ్యులు అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, కల్పించే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివక్షత, అంటరానితనంపై ఎన్నో పోరాటాలు చేశారన్నారు. ప్రజల సంక్షేమం కోసం చేపట్టిన ఉద్యమాలతో ప్రజలే పూణే రాజు పాలనలో జ్యోతిరావు పూలేకి మహాత్మా అనే గొప్ప బిరుదుతో సత్కరించారన్నారు. సమాజ హితం కోరుతూ పనిచేశారన్నారు. స్వర్ణాంధ్రప్రదేశ్ దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు ముందుకు వేస్తుందన్నారు. దీంతో కేంద్రం నుంచి ఏపీకి పుష్కలంగా నిధులు వస్తున్నాయన్నారు. విజయవాడ నుంచి గూడూరు వరకు రెండు వేల కోట్లతో నాలుగో వరుస రైల్వే లైన్ మంజూరు అయ్యిందన్నారు. రేపల్లె-తెనాలి మధ్య రెండవ రైల్వే లైన్ మంజూరు అయ్యిందన్నారు. గుంటూరు నుంచి నిజాంపట్నం వరకు 1200 కోట్లతో గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే మంజూరు అయ్యిందన్నారు. పర్యాటక రంగం అభివృద్ధికి 97.52 కోట్లు నిధులు వచ్చాయన్నారు. 29 కోట్లతో బ్రిడ్జిలు నిర్మిస్తున్నట్లు చెప్పారు. అభివృద్ధి కార్యక్రమాలతో ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. పేదరికాన్ని నిర్మూలించడమే లక్ష్యంగా ప్రభుత్వాలు పనిచేస్తున్నాయన్నారు. పేదరిక నిర్మూలనపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. బంగారు కుటుంబాలు, మార్గదర్శిలను అనుసంధానించే కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. దేశంలో సాంఘిక సంస్కరణలు తెచ్చిన మహాత్మా జ్యోతిరావు పూలే గొప్ప సంఘ సంస్కర్త అని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. సమాజం అభ్యున్నతికి పాటుపడిన గొప్ప నాయకులు పూలే చరిత్రలో నిలిచిపోయారని అన్నారు. 150 ఏళ్ల క్రితమే రాజరికం, బ్రిటిష్ పరిపాలనలో పోరాటాలు చేసిన గొప్ప యోధుడు అన్నారు. మహిళలకు విద్య అందించాలని, ప్రతి ఒక్కరికి సమాన విద్య అందించాలనే దృక్పథంతో జ్యోతిరావు పూలే చేపట్టిన ఉద్యమం దేశ చరిత్రలో నిలిచిపోయిందన్నారు. అణగారిన వర్గాల సంక్షేమం కొరకు ఆయన చేసిన కృషి, త్యాగాలను మరువలేమన్నారు. ఆయన స్ఫూర్తితో నిరుపేదలకు స్వయం ఉపాధి కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తుందన్నారు. జిల్లాకు 35 కోట్లు రాగా, 1366 మంది అర్హులైన అభ్యర్థులను గుర్తించామన్నారు. జాతీయ పండుగలో 412 మంది లబ్ధిదారులకు 10.25 కోట్ల విలువచేసే యూనిట్లు అందిస్తున్నామన్నారు. బీసీల అభ్యున్నతి కోసం జ్యోతిరావు పూలే చేసిన కృషి వెలకట్టలేనిదని శాసనమండలి సభ్యురాలు పోతుల సునీత చెప్పారు. కులవివక్షత, అంటరానితనం నిర్మూలనపై ఆయన చేపట్టిన పోరాటాలు వర్ణించలేనివన్నారు. విద్యతోనే మహిళల అభివృద్ధి సాధ్యమని గుర్తించి మొదట తన భార్యకి విద్యాభ్యాసం చేసిన గొప్ప మేధావి అని వివరించారు. మహిళలు ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాలలో అభివృద్ధి సాధించినప్పుడే నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్లు అవుతుందన్నారు. బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు, మహిళలకు 33 కేతం రిజర్వేషన్లను అమలు చేయాలన్నారు.ఖ బీసీల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని బాపట్ల శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ తెలిపారు. బీసీల ఐక్యతే ప్రభుత్వ ధ్యేయమన్నారు. భరతమాత ముద్దుబిడ్డలుగా డాక్టర్ బాబు జగజ్జీవన్ రామ్, మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ లు నిలిచారన్నారు. ప్రజల గుండెల్లోనూ , దేశ చరిత్రలోనూ వారు చిరస్థాయిగా చెరగని ముద్రలు వేసుకున్నారన్నారు. వారి జయంతి కార్యక్రమాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం అభినందనీయం అన్నారు. వారి స్ఫూర్తితో సమాజానికి మనము ఏమి చేయాలనే అంశాలపై ప్రతి ఒక్కరు మననం చేసుకోవాలన్నారు. ప్రజల సంక్షేమం, నిరుపేదల ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం మంచి పాలన సాగిస్తుందన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి కేంద్రంలో బిజెపి పాలన సాగిస్తుండగా, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్, జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారిని శివలీల, మాజీ శాసనసభ్యులు చీరాల గోవర్ధన్ రెడ్డి, బిసి నాయకులు శంకరరావు, జయప్రకాష్ నారాయణ, వీరరాఘవయ్య, జి శ్రీనివాసరావు, కె వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# గుడ్లు ఉడకబెట్టిన నీళ్లు పారబోస్తున్నారా?



గుడ్లు కుక్కర్‌లో అయితే రాళ్లలా అవుతాయి కనుక.. విడిగానే ఉడకబెడతాం. తర్వాత ఆ నీళ్లను పారబోస్తాం కదా! కానీ అలా వృథా చేయొద్దంటున్నారు పరిశోధకులు. ఎందుకంటే..

- జిడ్డు పేరుకున్న వంటింటి గట్టు, గోడలను ఈ నీటితో శుభ్రం చేస్తే మకిలి త్వరగా వదులుతుంది.
- గుడ్డుపెంకులో క్యాల్షియం, పొటాషియం, మెగ్నీషియం, ఐరన్ విస్తారంగా ఉంటాయి. అందువల్ల గుడ్లు ఉడికించిన నీళ్లు చల్లారాక.. మట్టిలో పోస్తే నేల సారవంతమవుతుంది.
- ఈ నీళ్లతో మొక్కలు బలంగా పెరుగుతాయి.
- ఈ నీటిని తలకు పట్టించి అరగంట తర్వాత తలస్నానం చేస్తే కుదుళ్లు బలపడతాయి. జుట్టు రాలదు.
- గుడ్డుతో పాటు డొల్ల కూడా మేలుచేస్తుందని తెలిశాక ఇక పడేయలేం కదా!

# అల్సర్లను తగ్గించే కొబ్బరిపాలు



దేవుడికి టెంకాయ కొట్టినప్పుడల్లా కొబ్బరి ఇష్టంగా తింటాం. ఇంకా ఎక్కువుంటే పచ్చడి చేస్తాం. కొబ్బరి రుచే కాదు పోషకాహారం కూడా. ముఖ్యంగా కొబ్బరిపాలు మరీ శ్రేష్ఠం. అందులో ఏమేం సుగుణాలున్నాయంటే..

- కొబ్బరిపాలు తాగటం వల్ల శరీరానికి ఐరన్, మెగ్నీషియం, పొటాషియం, కాపర్, మాంగనీస్, సెలీనియం, ఫోలేట్, సి-విటమిన్ అందుతాయి.
- ఇందులో ఫ్యాటీ యాసిడ్స్ చర్మాన్ని సురక్షితంగా ఉంచుతాయి. అంటే ముడతలు పడదు, పొడిబారదు, కాంతిహీనమవదు. దురద, మంట, దద్దులు, సొరియాసిస్ వంటి సమస్యల నుంచి ఉపశమనం కలుగుతుంది.
- కొలెస్ట్రాల్ స్థాయి అదుపులో ఉంటుంది. గుండెజబ్బులు వచ్చే అవకాశం తగ్గుతుంది. కానీ ఎక్కువ మోతాదులో మాత్రం తీసుకోకూడదు.
- పొట్ట, నడుం దగ్గర పేరుకున్న కొవ్వు కరుగుతుంది. ఊబకాయం రాదు.
- ఇన్ఫెక్షన్లు కలిగించే వైరస్‌లను హరిస్తాయి. నొప్పి, వాపు వంటివి తగ్గుతాయి. కడుపులో అల్సర్లు చాలా వరకూ తగ్గినట్టుగా సర్వేలు తెలియజేస్తున్నాయి.
- కురులు చిట్లటం, రాలటం లేకుండా దృఢంగా ఉంటాయి. చుండ్రు నుంచి బయటపడొచ్చు. తలకు కొబ్బరిపాలు రాస్తుంటే కురులు ఒత్తుగా పెరుగుతాయి.
- మామూలు పాలతో కంటే.. ఈ పాలతో చేసే కాఫీ, టీలు ప్రత్యేకంగా ఉంటాయి, ఆరోగ్యదాయకం కూడా. కూరలు, ఓట్‌మీల్, ప్రొటీన్‌షేక్, స్మూథీస్‌లో కొబ్బరిపాలు కలపొచ్చు. ఈ పాలతో సలాడ్స్‌కు అదనపు రుచి వస్తుంది.
- సాధారణ పాల కంటే ఈ పాలు ఎక్కువ పోషకాలను అందిస్తాయి.
- ఈ పాల కోసం కొబ్బరిని తురిమి వడకట్టాలి.



# ఇక బాదంపాలు ఇంట్లోనే!

మనలో బాదంపాలను ఇష్టపడని వాళ్లు సామాన్యంగా ఉండరు. అయితే బాదంమిల్క్ బయట తాగుతాం లేదా పౌడర్ కొనుక్కుంటాం. నిజానికి ఆ పొడి ఇంట్లోనే తయారు చేసుకోవచ్చు. అందుకోసం బాదంపప్పులు, మిల్క్ పౌడర్ అర కప్పు చొప్పున, జీడి పప్పులు 2 చెంచాలు, డ్రైఫ్రూట్స్ పలుకులు ఒకటిన్నర చెంచా, పంచదార పొడి పావు కప్పు, యాలకులు రెండు, కుంకుమపువ్వు పావు చెంచా, పసుపు చిటికెడు తీసుకోవాలి. ఎలా చేయాలంటే.. బాదం, జీడిపప్పులను సన్న సెగ మీద దోరగా వేయించాలి. అవి చల్లారాక.. యాలకులు, కుంకుమపువ్వు జతచేసి గ్రైండ్ చేయాలి. ఈ పొడిని ఒక పాత్రలోకి తీసి.. మిల్క్ పౌడర్, పంచదార పొడి, పసుపు, డ్రైఫ్రూట్స్ పలుకులు జోడించి కలపాలి. ఈ మిశ్రమాన్ని తడి లేని, గాలి చొరబడని సీసాలో భద్రం చేసుకోవాలి. తాగాలనుకున్నప్పుడు వేడి పాలల్లో ఈ పౌడర్ కలిపి తాగేయొచ్చు. ఇది రుచీ ఆరోగ్యం కూడా.



# మిర్చి కూడా మంచే చేస్తుంది!

కూర, చారుల్లో ఒకటి రెండు మిర్చి వేస్తే చక్కటి రుచీ, పరిమళం. వీటితో రోటి పచ్చడి చేస్తే అదిరిపోతుంది. ఇక మిర్చిబజ్జీ గురించి చెప్పాల్సిందే లేదు. రుచి సంగతి అలా ఉంచితే మిర్చి ఎలా మేలు చేస్తుందో చూద్దాం..

- పచ్చిమిర్చిలో సి-విటమిన్ విస్తారంగా ఉంటుంది. అది రోగనిరోధక శక్తిని పెంచి, అనారోగ్యాన్ని తరిమేస్తుంది.
- మనసును హాయిగా ఉంచుతాయి.
- ఆ రుచి, పరిమళం నోటికి హితవుగా ఉంటాయి.
- జీర్ణప్రక్రియ బాగుంటుంది.
- చర్మానికి కాంతినిస్తాయి.
- ఇందులో ఉండే ఎ-విటమిన్ కంటిచూపును మెరుగుపరుస్తుంది.
- ఇవి రక్తపోటును, కొలెస్ట్రాల్ స్థాయిని అదుపులో ఉంచుతాయి. రక్తం గడ్డ కట్టకుండా అరికడతాయి. ఒక్క మాటలో చెప్పాలంటే గుండెజబ్బులకు చెక్‌పెట్టినట్టవుతుంది.
- వీటిలో ఉండే క్యాప్సాయిసిన్ నొప్పుల నుంచి ఉపశమనం కలిగిస్తుంది.
- బరువు తగ్గేలా తోడ్పడతాయి.
- ఊపిరితిత్తులను ఆరోగ్యంగా ఉంచుతాయి.
- ఇవి మేలు చేసే మాట ఎంత నిజమో కీడు కలిగించే మాటా అంతే నిజం. మితిమీరి తింటే.. అల్సర్, కడుపుబ్బరం లాంటి సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది కనుక తగినంతే తింటూ ఆరోగ్యంగా, ఆనందంగా ఉందాం.



# నిద్రలేమికి చెక్ పెట్టాలంటే..

పిల్లలకు పాలు చాలా అవసరం. ఆ పాలల్లో నానబెట్టిన ఖర్జూరాలు వేసి ఇస్తే.. ఇంకా మంచిదని అధ్యయనాలు తెలియజేస్తున్నాయి. దాని వల్ల ఎన్ని ప్రయోజనాలున్నాయో చూడండి..

- ఖర్జూరాలు వేసిన పాలు మరింత రుచిగా ఉంటాయి కనుక పిల్లలు పేచీ పెట్టకుండా తాగుతారు.
- ఈ పాలతో శరీరానికి క్యాల్షియం, సెలేనియం, మెగ్నీషియం, భాస్వరం, ఫ్లోరిన్, జింక్, పొటాషియం, కాపర్, సల్ఫర్, ఐరన్, ఎ,బి,సి,ఇ,కె-విటమిన్లు, ప్రొటీన్లు అందుతాయి. శక్తి కలిగి నీరసం నిస్సత్తువ మాయమవుతాయి. జీర్ణప్రక్రియ బాగుంటుంది.
- చర్మం ముడతలు పడదు, ముఖానికి కాంతి వస్తుంది.
- పాలూ, ఖర్జూరాల కలయికతో నిద్రలేమి సమస్య దూరమవుతుంది.
- ఊబకాయం రాదు.
- ఎముకలు, కండరాలు దృఢంగా ఉంటాయి.
- ది రోజులు ఈ పాలు తాగితే రక్తంలో హిమోగ్లోబిన్ స్థాయి పెరుగుతుంది.
- స్వీట్లు ఎక్కువ తినాలనే కోరికను సంతృప్తి పరుస్తుంది.
- రోగనిరోధక శక్తి పెరుగుతుంది.
- మెదడు పనితీరు మెరుగుపడుతుంది.
- ఫిట్‌నెస్‌ను కాపాడుకోవాలి
- అనుకునేవారికి ఇది మంచి ఎంపిక. వర్కవుట్స్ చేసేముందు ఈ పాలు తాగితే అలసట కలగదు.

# అభివృద్ధి.. వారసత్వం లక్ష్యంగా పయనం

- 2036 ఒలింపిక్స్ కోసం భారత్ ప్రయత్నం
- విపక్షాలది కుటుంబ రాజకీయం
- వారికి అభివృద్ధి కన్నా స్వప్రయోజనాలే ముఖ్యం
- వారణాసిలో పలు అభివృద్ధి పనులకు మోడీ శ్రీకారం
- ఇటీవలి అత్యాచార ఘటనపై అధికారులతో ఆరా



**వారణాసి, ఏప్రిల్ 11 :** భారత్ అభివృద్ధి, వారసత్వం అనే రెండింటితో ముందుకువెళ్తోందని ప్రధాని మోడీ అన్నారు. 2036లో నిర్వహించనున్న ఒలింపిక్స్‌కు భారత్ ఆతిథ్యం ఇవ్వాలని అనుకుంటుందని.. అందుకు అనుమతి తీసుకోవడానికి అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. తన సొంత నియోజకవర్గమైన కాశీ ఎప్పటికీ తనదేనని.. తాను కాశీకి చెందినవాడినని మోదీ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన తన సొంత నియోజకవర్గం వారణాసిలో పర్యటించారు. ఈ సందర్భంగా పలు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అలాగే ప్రధాని నరేంద్ర మోదీ మరోమారు ప్రతిపక్షాలపై విరుచుకుపడ్డారు. ప్రతిపక్ష పార్టీలు అధికార కాంక్షతో కుటుంబ ప్రయోజనాలపై మాత్రమే దృష్టి సారిస్తున్నాయని విమర్శించారు. కానీ తమ పార్టీ ఎటువంటి పదవీ కాంక్ష లేకుండా సమ్మిళిత అభివృద్ధి ఇతివృత్తంగా ముందుకుసాగుతోందని అన్నారు. ఎన్డీఏ కూటమి నేతలంతా ప్రతి ఒక్క పౌరుడి అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నారని పేర్కొన్నారు. ఫులే దంపతులను ఆదర్శంగా తీసుకొని తాము మహిళల విద్య, అభివృద్ధికి కృషి చేస్తున్నామని అన్నారు. వారణాసిలో రూ.3,880 కోట్ల విలువైన 44 ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసిన ప్రధాని అక్కడి వారినుద్దేశించి ప్రసంగించారు. ప్రతిపక్షాలు 'పరివార్ కా సాథ్ పరివార్ కా వికాస్' అనే విధానాన్ని అనుసరిస్తాయని ప్రధాని పేర్కొన్నారు. కానీ దానికి విరుద్ధంగా తామెప్పుడూ 'సబ్‌కా సాథ్..సబ్‌కా వికాస్' నినాదంతో ముందుకువెళ్తామన్నారు. ప్రస్తుతం ప్రారంభించిన ప్రాజెక్టుల్లో కూడా గ్రామీణాభివృద్ధికి పెద్దపీట వేశామని అన్నారు. వాటిలో 130 తాగునీటి ప్రాజెక్టులు, నాలుగు గ్రామీణ రోడ్లు, 100 కొత్త అంగన్‌వాడీ కేంద్రాలు, 356 గ్రంథాలయాలు, పాలిటెక్నిక్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉన్నాయని ప్రధాని తెలిపారు. గతంలో పూర్వాంచల్‌లో ఆరోగ్య సౌకర్యాలు తక్కువగా ఉండేవని, కానీ నేడు కాశీ పూర్వాంచల్‌కు ఆరోగ్య రాజధానిగా మారుతోందని ప్రధాని అన్నారు. 70 ఏళ్లు దాటిన ముగ్గురు లబ్ధిదారులకు ఆయుష్మాన్ కార్డులను అందజేశారు. ఇదిలావుంటే వారణాసిలో చోటుచేసుకున్న దారుణ సామూహిక అత్యాచార ఘటన దిగ్భ్రాంతికి గురిచేసింది. 6 రోజుల్లో 23 మంది వ్యక్తులు.. 19 ఏళ్ల యువతిపై అత్యాచారానికి పాల్పడిన అమానవీయ ఘటన ఇటీవల వెలుగుచూసిన సంగతి తెలిసిందే. ఇది ప్రధాని మోదీ దృష్టికి చేరడంతో ఆయన ఆరా తీశారు. శుక్రవారం వారణాసి కలెక్టర్, పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. మోదీ వారణాసిలో పర్యటించిన సందర్భంగా ఇటీవల జరిగిన అత్యాచార ఘటన గురించి జిల్లా మేజిస్ట్రేట్, పోలీస్ కమిషనర్, డివిజినల్ కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్య త్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. మార్చి 29వ తేదీన బాధిత యువతి కొంత మంది స్నేహితులతో కలిసి బయటకు వెళ్లిం ది. ఆమె తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు పోలీసు లకు ఫిర్యాదు చేశారు. దాంతో సామూహిక అత్యాచారం గురించి వెలుగులోకి వచ్చింది. పోలీసులకు ఆ యువతి వెల్లడించిన వివరాల ప్రకారం.. కొందరు యువకులు తనను పలు హోటళ్లకు, హుక్కా బార్లకు తిప్పుతూ అత్యాచారానికి పాల్పడ్డారని చెప్పింది. దర్యాప్తు జరిపిన పోలీసులు తొమ్మిది మందిని అరెస్టు చేశారు. కోర్టు వారిని జ్యుడీషియల్ కస్టడీకి పంపింది.

## పదేళ్లలో తెలంగాణను లూటీ చేసిన కేసీఆర్ కుటుంబం

- ఫార్ములా రేస్ కేసులో కెటిఆర్ అరెస్ట్ కాక తప్పదు
- కెసిఆర్ కుటుంబ దోపిడీపై సిబిఐ విచారణ జరపాలి
- పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ డిమాండ్



**హైదరాబాద్, ఏప్రిల్ 11 :** ఫార్ములా ఈ రేసు కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఏదో ఒక రోజు అరెస్ట్ కాక తప్పదని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్ గాంధీ భవన్‌లో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ విలేకర్లతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ దోపిడీని భరించ లేకనే కాంగ్రెస్ పార్టీని తెలంగాణ ప్రజలు గెలిపించారన్నారు. గత పదేండ్లలో జరిగిన భూ దోపిడీపై విచారణ జరపాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తానని ఈ సందర్భంగా పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. కేసీఆర్ కుటుంబంపై సీబీఐతో విచారణ జరపాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. హెచ్‌సీయూ అంశానికి కేటీఆర్ అరెస్ట్‌కు లింక్ పెట్టడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. కేటీఆర్ మాట్లాడే మాటలకు చిన్న పిల్లలు సైతం నవ్వుకుంటున్నారన్నారు. పదేండ్లలో భూ దోపిడి చర్చకు సిద్ధమా?.. దమ్ము ధైర్యముంటే చర్చకు రండంటూ కేటీఆర్‌కు పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఈ సందర్భంగా సవాల్ విసిరారు. కరప్షన్‌కి కేరాఫ్ అడ్రస్ కేసీఆర్ కుటుంబమని ఆయన అభివర్ణించారు. లిక్కర్ స్కాం చేసింది కూడా కేసీఆర్ కుటుంబమేనని ఆయన గుర్తు చేశారు. అడ్డమైన వాళ్లు వచ్చి మాట్లాడుతున్నారని.. ఈ మాటలను నమ్మకండంటూ తెలంగాణ ప్రజలకు పీసీసీ చీఫ్ సూచించారు. కేటీఆర్ ఇంతగా దిగజారుతాడా? అంటూ సందేహం వ్యక్తం చేశారు. చాలా తక్కువ సమయంలో అత్యంత ఎక్కువ ధనం దోపిడి చేసింది కేసీఆర్ కుటుంబమేనని ఈ సందర్భంగా పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ గుర్తు చేశారు. బిల్లీ రావుతో కేటీఆర్ ఒప్పందం చేసుకున్నాడని పేర్కొన్నారు. కేటీఆర్ గుంటూరులో ఏం చదువు నేర్చుకున్నాడో అర్థం కావడం లేదన్నారు. సగం సగం తెలుసుకొని రాజకీయ లబ్ది కోసం కేటీఆర్ మాట్లాడుతారంటూ ఎద్దేవా చేశారు. బీసీ కుల గణన వల్ల బీఆర్ఎస్ పార్టీలో వణుకు పుట్టిందన్నారు. బీఆర్ఎస్ పదేండ్లలో ఎన్నివేల ఎకరాలను కొల్లగొట్టారో తెలియదా? అంటూ ఆ పార్టీ నేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు.రైతులు బాగు పడుతుంటే కేటీఆర్‌కి కడుపు నొప్పి వస్తోందని ఎద్దేవా చేశారు. ఏఐ టెక్నాలజీతో వీడియోలు చేయించి తప్పుడు సంకేతాలు ప్రజల్లోకి పంపారంటూ బీఆర్ఎస్ నేతలపై నిప్పులు చెరిగారు. తెలంగాణకి ఉద్యోగాలు రాకూడదా? అంటూ బీఆర్ఎస్ నేతలు సూటిగా ప్రశ్నించారు.

## 2వేల కోట్ల ఆస్తిపన్ను వసూళ్లు

### జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి

**హైదరాబాద్, ఏప్రిల్ 11 :** గడచిన ఆర్థిక సంవత్సరంలో జిహెచ్ఎంసిలో 2వేలకోట్లు పన్ను వసూళ్లు జరిగాయని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.3వేల కోట్లు లక్ష్యంగా నిర్దేశిరచుకున్నామని కమిషనర్ తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో ప్రజలు చెల్లించే ఆస్తి పన్నులో ప్రతి రూపాయికి న్యాయం చేస్తామని తెలిపారు. అభివృద్ధి పనుల కోసమే ఆ ఆదాయాన్ని ఖర్చు చేస్తామని చెప్పారు. గడిచిన ఆర్థిక సంవత్సరానికి రికార్డు స్థాయిలో గ్రేటర్‌లో రూ.2వేల కోట్లకుపైగా ఆస్తి పన్ను వసూలు కావడం పట్ల హర్షం వ్యక్తం చేసిన కమిషనర్.. ఆస్తి పన్ను విభాగంలోని అధికారులు, సిబ్బందిని సత్కరించారు. బంజారాహిల్స్‌లోని బంజారా భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ రెవెన్యూ, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లను అభినందిస్తూ ప్రశంస పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆస్తి పన్ను చెల్లించిన నగర ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఆస్తి పన్నుకు సంబంధించిన సమస్యలను ఆరు నెలల్లో ఆన్‌లైన్‌లోనే పరిష్కరించాలని నిర్ణయించాం. నగరంలో చేపట్టిన జీఐఎస్ సర్వే ద్వారా 9 లక్షల ఆస్తుల సర్వే పూర్తయింది. దాని వల్ల ఆస్తి పన్ను వసూళ్లు మరింత పెరగొచ్చన్నారు.




## బిఆర్ఎస్ సభకు అనుమతిపై 17లోగా తేల్చండి

### ప్రభుత్వాన్ని ఆదేశించిన హైకోర్టు

**హైదరాబాద్, ఏప్రిల్ 11 :** హనుమకొండలో బీఆర్ఎస్ సిల్వర్ జూబ్లీ సభకు అనుమతులపై విచారణను తెలంగాణ హైకోర్టు వాయిదా వేసింది. హనుమకొండలో సభకు పోలీసులు అనుమతి ఇవ్వడం లేదంటూ బీఆర్ఎస్ హైకోర్టును ఆశ్రయించగా.. శుక్రవారం విచారణ జరిగింది. ఆ సభకు అనుమతిపై పరిశీలిస్తున్నామని కోర్టుకు జీపీ తెలిపారు. వారం రోజుల్లో వరంగల్ సభ అనుమతిపై నిర్ణయం తీసుకుంటామని ప్రభుత్వ న్యాయవాది తెలిపారు. సభ కోసం బీఆర్ఎస్ పెట్టుకున్న పర్మిషన్‌ను అనుమతించకపోవడం, దానిపై ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం వల్లే హైకోర్టులో పిటిషన్ వేసినట్లు బీఆర్ఎస్ తరపు న్యాయవాది వాదనలు వినిపించారు. అయితే 17 లోపు సభ అనుమతిపై నిర్ణయం తీసుకోవాలని ఆదేశిస్తూ.. తదుపరి విచారణను హైకోర్టు ఈనెల 21 కి వాయిదా వేసింది. అలాగే వరంగల్ పోలీసులకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. కాగా.. ఈనెల 27న హనుమకొండలోని ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ సిల్వర్ జూబ్లీ సభ నిర్వహిం చాలని నిర్ణయించారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి పది వరకు సభ నిర్వహిస్తామని గులాబీ పార్టీ పేర్కొంది. అయితే అందుకు పోలీసుల అనుమతి నిరాకరించడంతో బీఆర్ఎస్ హైకోర్టును ఆశ్రయించింది. దీనిపై ఈరోజు విచారణ జరుగగా.. 17లోపు సభ అనుమతిపై నిర్ణయం తీసుకోవాలంటూ విచారణను వాయిదా వేసింది.

## కాంగ్రెస్ ప్రభుత్వంలో భారీ కుంభకోణాలు

- ఆర్థిక నేరానికి తెరలేపిన రేవంత్ ప్రభుత్వం
- 400 ఎకరాలు పక్కాగా అటవీ భూములే
- దానిపై రుణాలు ఎలా తెచ్చరో చెప్పాలి
- దీనిపై సిబిఐ విచారణ జరగాల్సిందే
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్




**హైదరాబాద్, ఏప్రిల్ 11 :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మోసం, విధ్వంసం, దృష్టి మళ్లించడం అనే 3డీ మంత్రంతో పాలన చేస్తున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రేవంత్ ప్రభుత్వం ఆర్థిక నేరానికి తెరలేపిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో భారీ కుంభకోణాలు జరుగు తున్నాయని చెప్పారు. కంచ గచ్చిబౌలిలో జరిగిన పర్యావరణ విధ్వంసాన్ని చూసి దేశం మొత్తం విస్తుపోయిందన్నారు. ఆ 400 ఎకరాలు అటవీ భూమేనని, సుప్రీంకోర్టు తీర్పుల ఆధారంగా ఆ విషయాన్ని చెబుతున్నానని స్పష్టం చేశారు. హెచ్‌సీయూ భూముల వెనుక 10 వేల కోట్ల ఆర్థిక కుంభకోణం ఉందన్నారు. కుంభకోణానికి కర్త, కర్మ, క్రియ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంటూ ఆరోపించారు. మహాత్మా జ్యోతిబా పూలే జయంతి సందర్భంగా తెలంగాణ భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డికి అన్నీ తెలిసే భారీ ఆర్థిక నేరానికి పాల్పడ్డారని మండిపడ్డారు. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంతో దేశం మొత్తం తెలంగాణ వైపు చూస్తోందన్నారు. ఒక బీజేపీ ఎంపీ సహకారంతో ఈ స్కామ్ చేస్తున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంలో ట్రస్ట్ ఎడ్వైజర్స్ ఇన్వెస్ట్మెంట్ అనే కంపెనీ రేవంత్ రెడ్డికి బ్రోకరిజం చేసిందన్నారు. అందుకు గాను .. సదరు కంపెనీకి రూ.170 కోట్లు లంచం ఇచ్చారన్నారు. సుప్రీంకోర్టు తీర్పులు, ఆర్బీఐ గైడ్‌లైన్సులను తుంగలో తొక్కారని చెప్పారు. అటవీ భూమిని రేవంత్ రెడ్డి ప్రభుత్వం తాకట్టు పెట్టిందన్నారు. అటవీ భూమిని తాకట్టు పెట్టడం, అమ్మే అధికారం ప్రభుత్వానికి కూడా లేదన్నారు. వాల్టా, ఫారెస్టు చట్టాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఉల్లంఘించింది. బీజేపీ ఎంపీ సారధ్యంలోనే బ్రోకరేట్ కంపెనీ తీసుకొచ్చారు. ఆ ఎంపీకి రేవంత్ అనుచితి లబ్ధి చేకూరుస్తున్నారు. త్వరలోనే ఆ బీజేపీ ఎంపీ ఎవరో చెబుతానన్నారు. ఈ వ్యవహారంపై కేంద్ర దర్యాప్తు సంస్థలకు లేఖ రాస్తున్నట్లు వెల్లడించారు. కేంద్రం, ఆర్బీఐ, సీబీఐ, సెబీ, ఎస్ఎఫ్ఐవో దర్యాప్తు చేయాలని కోరుతున్నాం. 400 ఎకరాలకు టీ–జీఐఐసీకి యజమాని కాదు. తమది కాని భూమిని టీ–జీఐఐసీ తాకట్టు పెట్టింది. మోసపూరిత భూమిని తాకట్టు పెట్టుకుని బ్యాంకు రుణం ఇచ్చింది. 400 ఎకరాల భూమి విలువ రూ.5,239 కోట్లు– అని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ చెబుతున్నది. అదే భూమి విలువ రూ.30 వేల కోట్లు– అని రెవెన్యూ శాఖ చెప్పింది. లేని భూమి ఉన్నట్లు చూపి లోన్ తీసుకోవాలని చూశారు. భయంకరమైన ఆర్థిక దోపిడీకి రేవంత్ రెడ్డి పాల్పడుతున్నారు. తమది కాని భూమిని టీజీఐఐసీ ఎలా తాకట్టు పెడ్తుందని కెటిఆర్ ప్రశ్నించారు. ప్రధానమంత్రి, కేంద్ర ఆర్థికమంత్రికి తెలియకుండా ఈ వ్యవహారం జరిగిందన్నారు. కేంద్రానికి చిత్తశుద్ధి ఉంటే వెంటేనే సీవీసీ, సీబీఐ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కేంద్రం స్పందించకుంటే కాంగ్రెస్, బీజేపీ మధ్య ఒప్పందం ఉన్నట్లే అంటూ వ్యాఖ్యలు చేశారు. ఆర్బీఐ నిబంధనలు పాటించకుండా.. 10వేల కోట్లు తెచ్చారన్నారు. లిటిగేషన్ భూమికి ఐసీఐసీఐ బ్యాంకు ఎలా లోన్ ఇచ్చిందని ప్రశ్నించారు. ఫీల్డ్ విజిట్ చేయకుండానే బ్రోకర్ ఆధారంగా బ్యాంక్ ప్రభుత్వానికి రుణం ఇచ్చిందని కేటీఆర్ పేర్కొన్నారు.

## తెలంగాణ తెచ్చుకుందే ఉద్యోగాల కోసం

- వరంగల్‌లో మెగా జాబ్ మేళా ప్రారంభించిన మంత్రులు
- త్వరలో అంగన్‌వాడీ ఉద్యోగాల నోటిఫికేషన్
- వెల్లడించిన మంత్రి సీతక్క

**వరంగల్, ఏప్రిల్ 11 :** తెలంగాణ తెచ్చుకుంది ఉద్యోగాల కోసమేనని మంత్రి సీతక్క తెలిపారు. వరంగల్ ఎంకే నాయుడు కన్వెన్షన్‌లో శుక్రవారం మెగా జాబ్‌మేళా నిర్వహించగా, మంత్రులు సీతక్క, కొండా సురేఖ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడారు. మెగా జాబ్‌మేళాకు భారీ స్పందన వచ్చిందని అన్నారు. భారీ సంఖ్యలో నిరుద్యోగులు తరలివచ్చారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత 60వేల ఉద్యోగాలు ఇచ్చిందని గుర్తుచేశారు. త్వరలో అంగన్‌వాడీ ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదల చేస్తామని తెలిపారు. ఇలాంటి జాబ్‌మేళాను నిరుద్యోగులు ఉపయోగించుకోవాలని సూచించారు. అవకాశాలు వస్తే వాటిని వదులుకోవద్దని అన్నారు. తల్లిదండ్రులకు భరోసా కల్పించాలని చెప్పారు. సొంత ఊరు దాటితేనే.. భవిష్యత్తు బంగారం అవుతుందని మంత్రి సీతక్క తెలిపారు. 60 కంపెనీల ద్వారా 11వేల ఉద్యోగాలు కల్పిస్తున్నామని మంత్రి కొండా సురేఖ తెలిపారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఎన్నికల ముందు తాము చెప్పామని.. అందులో భాగంగానే ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరంగల్‌పై ప్రత్యేక దృష్టి సాధించారని చెప్పారు. గత కేసీఆర్ ప్రభుత్వం నిరుద్యోగుల సమస్యలపై పదేళ్లుగా నిర్లక్ష్యంగా వ్యవహరించిందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే 60వేల ఉద్యోగాలు కల్పించామని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఉద్యోగం రావాలంటే కష్టం.. అందుకే ఇలాంటి జాబ్‌మేళాను నిర్వహించామని తెలిపారు. ప్రతిభ ఆధారంగానే ఉద్యోగం దక్కుతుందని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు.

## నేడు నగరంలో హనుమాన్ జయంతి శోభాయాత్ర

- గౌలిగూడ నుంచి తాడ్‌బన్ ఆంజనేయ మందిర్ వరకు ర్యాలీ
- భారీగా పోలీస్ బందోబస్తు.. ట్రాఫిక్ ఆంక్షలు


**హైదరాబాద్, ఏప్రిల్ 11 :** హనుమాన్ జయంతి సందర్భంగా హైదరాబాద్ నగరంలో శనివారం ఘనంగా హనుమాన్ శోభాయాత్ర నిర్వహించనున్నా రు. హనుమత్ జయంతి శనివారం రావడంతో మరితం కోలాహలం నెలకొననుంది. ఈ శోభాయాత్ర గౌలిగూడలోని శ్రీ రామమందిరం వద్ద ఉదయం 11 గంటలకు ప్రారంభమై, నగరంలోని పలు కీలక ప్రాంతాల గుండా తాడ్‌బండ్‌లోని శ్రీ హనుమాన్ మందిరం వద్ద ముగుస్తుంది. శోభాయాత్ర మార్గం పుత్లిబౌలి క్రాస్ రోడ్స్, ఆంధ్రా బ్యాంక్ క్రాస్ రోడ్స్, కోఠి, సుల్తాన్ బజార్ క్రాస్ రోడ్స్, రామ్‌కోఠి క్రాస్ రోడ్స్, కాచిగూడ క్రాస్ రోడ్స్, నారాయణగూడ వైఎంసీఏ, చిక్కడపల్లి క్రాస్ రోడ్స్, ఆర్టీసీ క్రాస్ రోడ్స్, అశోక్ నగర్, గాంధీ నగర్ బ్యాక్ సైడ్ వైశ్రాయ్ హోటల్, ప్రాగా టూల్స్, కవాడిగూడ, సీజీవో టవర్స్, బన్సీలాల్‌పేట రోడ్, బైబిల్ హౌస్, సిటీ లైట్ హోటల్, బాటా షోరూమ్, ఉజ్జయిని మహంకాళి టెంపుల్, ఓల్డ్ రామ్‌గోపాల్‌పేట రోడ్, పారడైజ్ క్రాస్ రోడ్స్, సీటీవో జంక్షన్, లీ రాయల్ ప్యాలెస్, బ్రూక్ బాండ్, ఇంపిరీయల్ గార్డెన్, మస్తాన్ కేఫ్ మీదుగా సాగుతూ తాడ్‌బండ్‌లోని హనుమాన్ టెంపుల్‌కు చేరుకుంటుంది. ఈ శోభాయాత్ర సజావుగా సాగేందుకు పోలీసు శాఖ శనివారం ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ మార్గంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించింది. ఈ రహదారులపై ప్రయాణించే వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని అధికారులు సూచించారు. ముఖ్యంగా లక్డీకాపూల్ నుంచి సికింద్రాబాద్ స్టేషన్, ఉప్పల్ వైపు వెళ్లే వాహనదారులు వీవీ స్టాచ్యూ, సోమాజిగూడ, గ్రీన్ ల్యాండ్స్, బేగంపేట్ ÷–లఫై ఓవర్, ప్రకాశ్ నగర్ ÷–లఫై ఓవర్, పారడైజ్ ÷–లఫై ఓవర్ మీదుగా సికింద్రాబాద్ స్టేషన్‌కు చేరుకోవాలని సలహా ఇచ్చారు. ఈ శోభాయాత్రలో భక్తుల భద్రత , ట్రాఫిక్ నియంత్రణ కోసం పోలీసు శాఖ విస్తృత ఏర్పాట్లు– చేసింది, కాబట్టి నగరవాసులు ఈ ఆంక్షలకు సహకరించి, హనుమాన్ జయంతి వేడుకలు సాంతం సజావుగా జరిగేలా తోడ్పడాలని అధికారులు కోరుతున్నారు.



## భగ్గుమన్న బంగారం ధరలు

### మేలిమి బంగారం రూ.96,450కు చేరిక

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 11 :** బంగారం ధర మళ్లీ భగ్గుమంది. అంతర్జాతీయంగా ఆర్థిక ఉద్రిక్తతలతో పసిడి ధర చుక్కలనంటుతోంది. అమెరికా, చైనాల మధ్య సుంకాల పోరు రోజురోజుకూ తీవ్రమవుతున్న నేపథ్యంలో పసిడికి పెట్టుబడులు మళ్లుతున్నాయి. దీంతో దేశ రాజధాని దిల్లీలో 10 గ్రాముల మేలిమి పసిడి ధర రూ.6250 పెరిగి శుక్రవారం రూ.96,450కు చేరింది. సాయంత్రం 6 గంటల సమయానికి హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో రూ.96,430 స్థాయి వద్ద ట్రేడయ్యింది. అంతర్జాతీయంగా ఔన్సు (31.10 గ్రాము) బంగారం ధర 3,223 డాలర్ల వద్ద కొనసాగుతోంది. ఇంట్రాడేలో 3,237 డాలర్లకు చేరుకుంది. దీన్ని అనుసరించి దేశీయంగా 10 గ్రాముల మేలిమి (24 క్యారెట్లు ) బంగారం ధర రూ.96 వేల మార్కు దాటింది. 99.5 స్వచ్ఛత కలిగిన బంగారం కూడా రూ.96 వేలు పలుకుతోంది. వెండి కిలో రూ.95,500 పలుకుతోంది. వాణిజ్య యుద్ధ భయాలతో ఏప్రిల్ 2న బంగారం ఔన్సు అంతర్జాతీయంగా 3200 డాలర్లను తాకింది. తర్వాత లాభాల స్వీకరణతో కాస్త తగ్గుముఖం పట్టింది. అయితే, ఇతర దేశాలపై విధించిన టారిఫ్‌లను తాత్కాలికంగా నిలుపుదల చేసిన ట్రంప్.. చైనాపై మాత్రం కొనసాగించారు. ఈ పరిణామాలు వాణిజ్య, ఆర్థిక అనిశ్చితులకు కారణమయ్యాయి. దీంతో మాంద్యం భయాలు నెలకొన్నాయి. డాలర్ ఇండెక్స్ నూరు డాలర్లకు దిగువకు చేరడం పసిడికి మరింత డిమాండ్ పెంచింది. సెంట్రల్ బ్యాంకులు కూడా పెద్ద మొత్తంలో బంగారం నిల్వలను పెంచుకుంటుండడంతో పుత్తడి ధరకు రెక్కలు రావడానికి కారణమని విశ్లేషిస్తున్నారు.



## దేవుళ్లను కించపర్చేలా రవి, సుధీర్‌ల స్కిట్

### హిందూ సంఘాల హెచ్చరికలు

**హైదరాబాద్, ఏప్రిల్ 11 :** బుల్లితెర నటులు యాంకర్ రవి, సుడిగాలి సుధీర్ చేసిన స్కిట్ ఇప్పుడు వివాదాస్పదంగా మారింది. ఓ టీవీ షో సందర్భంగా వారు చేసిన స్కిట్‌పై హిందూ సంఘాల ప్రతినిధులు భగ్గుమన్నారు. హిందూ దేవుళ్లను అపహాస్యం చేస్తున్నారంటూ మండిపడుతున్నారు. హిందువుల మనోభావాలను రవి, సుధీర్ దెబ్బ తీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో హిందూ సంఘం నేత కేవశరెడ్డి.. యాంకర్ రవికి ఫోన్ చేసిన మాట్లాడిన ఆడియో ఇప్పుడు వైరల్‌గా మారింది. దేవుడి పేరితో డ్రామాలు చేయడం తగదంటూ రవిని ఆయన హెచ్చరించారు. దేవుళ్లను కించపరుస్తూ స్కిట్‌లు చేయడం ప్రతి ఒక్కరికీ ఫ్యాషన్ అయిపోయిందంటూ మండిపడ్డారు. అయితే హిందూ దేవుళ్లను తామేక్కడా కించపరచలేదని యాంకర్ రవి తెలిపారు. స్కిట్ సమయంలో అక్కడున్న వారంతా చెప్పులు, షూలు తీసి మరీ చిత్రీకరించామని యాంకర్ రవి చెప్పుకొచ్చారు. అయినా కేశవరెడ్డి మాత్రం మరోసారి ఇలాంటి చర్యలకు పాల్పడవద్దంటూ ఘాటుగా హెచ్చరించారు.

## టెట్ షెడ్యూల్ విడుదల

### జూన్ 15 నుంచి 30 వరకు టెట్ పరీక్షలు

**హైదరాబాద్, ఏప్రిల్ 11 :** తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్ష షెడ్యూల్ విడుదలైంది. జూన్ 15 నుంచి 30 వరకు టెట్ పరీక్షలు నిర్వహించనున్నట్లు పాఠశాల విద్యాశాఖ వెల్లడించింది. ఈ పరీక్షకు సంబంధించిన పూర్తి వివరాలు ఏప్రిల్ 15 నుంచి అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపింది. తెలంగాణలో ఏడాదిలో రెండుసార్లు టెట్ పరీక్ష నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విషయాన్ని గతేడాది జులైలో ప్రకటించింది. ఇందులో భాగంగా గతేడాది డిసెంబర్‌లో టెట్ నోటిఫికేషన్ ఇచ్చిన ప్రభుత్వం.. ఈ ఏడాది జనవరిలో పరీక్షలు నిర్వహించింది. జనవరిలో జరిగిన ఉపాధ్యాయ అర్హత పరీక్షకు 2.75లక్షల మంది దరఖాస్తు చేసుకోగా.. దాదాపు 2లక్షల మందికి పైగా హాజరయ్యారు.



## సెంచరీ కొట్టినా.. ధోనీతో మాట్లాడలేకపోయా : ప్రియాంశ్ ఆర్య

ఐపీఎల్‌లో ఆడిన నాలుగో మ్యాచ్‌లోనే సెంచరీ బాదేసీ అందరి దృష్టిని ఆకర్షించాడు యువ బ్యాటర్ ప్రియాంశ్ ఆర్య. ఇటీవల చెన్నైతో జరిగిన మ్యాచ్‌లో ఈ పంజాబ్ ఆటగాడు శతకంతో పరుగుల మోత మోగించిన సంగతి తెలిసిందే. అయితే, ఆ మ్యాచ్ తర్వాత ధోనీ తో మాట్లాడాలని అనుకున్నప్పటికీ.. తనకు ఆ అవకాశం దొరకలేదని చెప్పాడు. అదొక్కటే తనను బాధిస్తోందని అన్నాడు. “ధోనీ లాంటి గొప్ప ఆటగాళ్లపై ఆడే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నా. ఇలాంటి అవకాశం చాలా కొద్ది మందికి మాత్రమే వస్తుంది. వికెట్ల వెనుక ధోనీ సర్ ఉన్నప్పుడు ఒత్తిడి సహజమే. ఇక, అశ్విన్ లాంటి లెజండరీ బౌలర్లను ఎదుర్కొన్నప్పుడు టెన్షన్ ఉంటుంది. అలాంటి పరిస్థితుల్లో సెంచరీ సాధించడం చాలా ఆనందంగా ఉంది. మ్యాచ్ తర్వాత ధోనీ సర్‌ని కలిసి మాట్లాడాలనుకున్నా. కానీ, నేను ఇంటర్వ్యూ ముగించుకునేసరికి ఆయన వెళ్లిపోయారు. ఆయనతో మాట్లాడలేకపోయా” అని ప్రియాంశ్ ఆర్య చెప్పాడు.

## అలా ఎవరూ చెప్పలేదు..

### భవిష్యత్తులో నో ఫ్రాంచైజీ క్రికెట్ : బ్రూక్



ఐపీఎల్ 2025 సీజన్‌కు ముందు నిషేధం ఎదుర్కొన్న తొలి క్రికెటర్ హ్యారీ బ్రూక్. దిల్లీ క్యాపిటల్స్ అతడిని వేలంలో తీసుకుంది. అయితే, అతడు ఈ సీజన్‌కు అందుబాటులో ఉండనని చెప్పడంతో అతడిపై ఐపీఎల్ అడ్వైజరీ కమిటీ రెండేళ్లపాటు నిషేధం విధించింది. ఇటీవలే బ్రూక్ ఇంగ్లాండ్ పరిమిత ఓవర్ల క్రికెట్ జట్టు సారథిగా ఎంపికైన సంగతి తెలిసిందే. తాజాగా ఓ ఇంటర్వ్యూలో తన నిషేధంపై బ్రూక్ స్పందించాడు. “నాకు ఎవరూ చెప్పలేదు. న్యాయంగానే జరిగిందని అనుకుంటున్నా. ఎందుకంటే వారు రూల్స్ అలా పెట్టారు. నేను మాత్రం ఇంగ్లాండ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించేందుకు పూర్తిగా కట్టుబడి ఉన్నా. ఇప్పుడీ నిర్ణయం వల్ల సొమ్మును కోల్పోవాల్సి ఉంటుంది. ఇంగ్లాండ్ తరఫున ఆడేందుకు ఏ రోజైనా సిద్ధంగా ఉంటా. భవిష్యత్తులో నేను ఫ్రాంచైజీ క్రికెట్ ఆడే అవకాశాలు చాలా తక్కువే. జాతీయజట్టుకే మొదటి ప్రాధాన్యం. ఐపీఎల్ నుంచి బయటకు రావాలనుకోవడం నావరకు సరైందే. ఇలాంటి నిర్ణయం తీసుకోవడం తేలికేం కాదు. నా వర్క్‌లోడ్‌ను మేనేజ్ చేసుకోవడానికి ప్రయత్నిస్తా. గత ఏడాదిన్నర నుంచి చాలా క్రికెట్ ఆడా. మున్ముందు కూడా ఎక్కువ మ్యాచ్‌లు ఆడాల్సిఉంది. అందుకే, రాబోయే కాలంలో ఎంతవరకు ఫ్రాంచైజీ క్రికెట్ ఆడతాననేది ఇప్పుడే చెప్పలేను” అని బ్రూక్ వెల్లడించాడు.

**రూ.6.25 కోట్లకు..** గత ఐపీఎల్ మెగా వేలంలో హ్యారీ బ్రూక్‌ను దిల్లీ క్యాపిటల్స్ రూ.6.25 కోట్లకు సొంతం చేసుకుంది. ఐపీఎల్ నిబంధనల ప్రకారం తొలి సీజన్‌లో ఆడకూడదని ఆ ప్లేయర్ నిర్ణయం తీసుకుంటే అతడిపై రెండేళ్లపాటు నిషేధం విధించొచ్చు. దీంతో బ్రూక్‌పై బ్యాన్ పడింది. దిల్లీ మేనేజ్‌మెంట్‌కు బ్రూక్ క్షమాపణలు చెబుతూ అప్పుడే సోషల్ మీడియాలో పోస్టు పెట్టాడు. “ఐపీఎల్ నుంచి వైదొలగాలని కఠినమైన నిర్ణయం తీసుకున్నా. ఈసందర్భంగా దిల్లీ క్యాపిటల్స్ తోపాటు నాకు మద్దతుగా నిలిచిన అభిమానులకూ క్షమాపణలు చెబుతున్నా” అని బ్రూక్ పోస్టు చేశాడు.

# చెన్నై సూపర్ కింగ్స్‌పై కోల్‌కతా అలవోక విజయం



**చెన్నై:** చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ 8 వికెట్ల తేడాతో అలవోకగా విజయం సాధించింది. 104 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన కోల్‌కతా.. 10.1 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. కేకేఆర్ బ్యాటర్లు సునీల్ నరైన్ (44), డికాక్ (23) రాణించారు. చెన్నై బౌలర్లలో అన్షుల్, నూర్ అహ్మద్ చెరో వికెట్ తీశారు. ఈ మ్యాచ్‌లో ఓడిపోవడంతో ఈ సీజన్‌లో చెన్నై జట్టుకు ఇది వరుసగా ఐదో ఓటమి కావడం గమనార్హం. స్వల్ప లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా ఆడుతూ పాడుతూ ఛేదించింది. చెన్నై ఇన్నింగ్స్‌ను కకావికలం చేసిన సునీల్ నరైన్.. బ్యాటింగ్‌లోనూ అదరగొట్టాడు. తొలి ఓవర్ చివరి బంతికి సిక్స్ బాది ఖాతా తెరిచిన అతడు.. ఆతర్వాత సిక్స్‌లు, ఫోర్లతో విరుచుకుపడ్డాడు. మరో ఓపెనర్ డికాక్ (23: 16 బంతుల్లో 3 సిక్స్‌లు) ఉన్నంత సేపు దూకుడుగా ఆడాడు. రెండో ఓవర్ తొలి బంతికి సిక్స్ బాదిన డికాక్.. ఖలీల్ వేసిన మూడో ఓవర్లో మరింత రెచ్చిపోయాడు. రెండు సిక్స్‌లు కొట్టడంతో ఆ ఓవర్లో మొత్తం 15 పరుగులు వచ్చాయి. అయితే ఐదో ఓవర్ తొలిబంతికి అన్షుల్ బౌలింగ్‌లో డికాక్ బౌల్డ్ అయ్యాడు. దీంతో అజింక్యా రహానె (20: 17 బంతుల్లో 1 ఫోర్, ఒక సిక్స్)తో జట్టు కట్టిన నరైన్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. ఖలీల్ వేసిన ఆరో ఓవర్లో రహానె ఒక సిక్స్ బాదగా, నరైన్ ఒక సిక్స్, ఫోర్ బాదడంతో మొత్తం ఈ ఓవర్లో



18 పరుగులు వచ్చాయి. దీంతో పవర్ ప్లే ముగిసే సరికి కోల్‌కతా 71/1 తో నిలిచింది. అశ్విన్ వేసిన ఆ తర్వాతి ఓవర్లో నరైన్ వరుసగా రెండు సిక్స్‌లు బాదాడు. 8వ ఓవర్ తొలి బంతికి నూర్ అహ్మద్ బౌలింగ్‌లో సునీల్ ఔటైనప్పటికీ అప్పటికే కేకేఆర్ విజయం ఖాయమైంది. ఆ తర్వాత వచ్చిన రింకు సింగ్ (15: 12 బంతుల్లో ఒక ఫోర్, ఒక సిక్స్) 11వ ఓవర్ తొలి బంతికి సిక్స్ కొట్టడంతో కోల్‌కతా విజయ తీరాలకు చేరింది. టాస్ ఓడిన చెన్నై సూపర్ కింగ్స్ తొలుత బ్యాటింగ్ చేసింది. సీఎస్కే బ్యాటర్లు పూర్తిగా విఫలమయ్యారు. దీంతో నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 103 పరుగులు మాత్రమే చేశారు. ఈ సీజన్‌లో చెన్నై జట్టుకు తొలిసారి కెప్టెన్‌గా వ్యవహరించిన ధోనీ(1) నిరాశపర్చాడు. శివమ్(31), విజయ్ శంకర్(26) జట్టును ఆదుకున్నారు. మిగతా బ్యాటర్లలో రచిన్ 4, కాన్వే 12, రాహుల్ త్రిపాఠి 16, అశ్విన్ 1, జడేజా 0, దీపక్ హుడా 0, నూర్ అహ్మద్ 1, అన్షుల్ 3 పరుగులు చేశారు. కోల్‌కతా బౌలర్లలో సునీల్ నరైన్ 3, వరుణ్ 2, హర్షిత్ రాణా 2, అలీ 1, వైభవ్ 1 చొప్పున వికెట్లు పడగొట్టారు.

### చెత్త రికార్డులు మూటగట్టుకున్న సీఎస్కే..

చెన్నై సూపర్‌కింగ్స్‌కు ఇది వరుసగా ఐదో ఓటమి. ఈ సీజన్‌లో సొంత మైదానంలో ఆ జట్టు వరుసగా మూడుసార్లు ఓటమిపాలైంది. ఇక ఐపీఎల్ చరిత్రలో చెన్నై వరుసగా ఐదు ఓటములు చవిచూడడం ఇదే తొలిసారి. సీఎస్కే జట్టుకు ఇదే అత్యంత ఘోర ఓటమి. ఎక్కువ బంతులు మిగిలి ఉండగానే ప్రత్యర్థి చేతిలో పరాజయం పాలైంది. కోల్‌కతా జట్టు ఇంకా 59 బంతులు మిగిలిఉండగానే విజయం సాధించింది.




## వాట్సప్ కొత్త ఫీచర్స్

### గ్రూప్‌లో ఆన్‌లైన్.. మెన్షన్ చేస్తేనే నోటిఫికేషన్

ప్రముఖ మెసెంజర్ యాప్ వాట్సప్ కొత్త ఫీచర్లను ప్రకటించింది. ఆండ్రాయిడ్, ఐఓఎస్ యూజర్ల కోసం వీటిని తీసుకొచ్చింది. గ్రూప్‌లో ఆన్‌లైన్ వ్యూ, మెన్షన్ చేస్తేనే నోటిఫికేషన్లు వచ్చే ఏర్పాటు తదితర ఫీచర్లు ఈ జాబితాలో ఉన్నాయి. ఈ మేరకు తాజాగా ఓ బ్లాగ్‌పోస్ట్‌లో ఫీచర్ల వివరాలను వెల్లడించింది. ఇప్పటికే చాలా మందికి ఈ ఫీచర్లు అందుబాటులోకి వచ్చాయి. ఆ వివరాలు ఇవీ..

వాట్సప్ గ్రూప్‌లో ఎంతమంది ఉన్నా అందులో ఎందరు అందుబాటులో ఉన్నారో ఇంతకుముందు తెలిసేది కాదు. ఇకపై గ్రూప్‌లో ‘ఆన్‌లైన్’లో ఎంతమంది ఉన్నారో నంబర్ రూపంలో కనిపిస్తుంది.

ఫ్రెండ్స్ గ్రూప్ నుంచి తరచూ సందేశాలు రాకుండా మ్యూట్ చేసుకునే సదుపాయం ఉంది. అన్ మ్యూట్ చేయకుంటే మెసేజులు వస్తూనే ఉంటాయి. అలా కాకుండా మనల్ని గ్రూప్‌లో ఎవరో మెన్షన్ చేస్తేనో, మనం పెట్టిన మెసేజ్‌కు ఎవరైనా రిప్లయ్ ఇచ్చినప్పుడు మాత్రమే నోటిఫికేషన్ వచ్చే ఏర్పాటు ఉంటే ఎంతో బాగుంటుంది కదూ! ఆ ఫీచర్‌నూ వాట్సప్ జోడించింది. గ్రూప్ సెట్టింగ్స్‌లో నోటిఫికేషన్స్‌కు ఈ ఆప్షన్ ఇచ్చింది.

గ్రూప్‌లో ఎవరైనా శుభవార్త చెప్పారనుకుందాం. ఒకరి తర్వాత ఒకరు అందరూ విషెస్ చెబుతుంటారు. మీరూ శుభాకాంక్షలు చెప్పాలనుకుంటే అప్పటికే వచ్చిన రియాక్షన్స్ మీద క్లిక్ చేస్తే అప్పటికే చెప్పిన వారి ఎమోజీలు కనిపిస్తాయి. అందులో ఒక దాని మీద ట్యాప్ చేస్తే మీ రియాక్షన్ కూడా నమోదవుతుంది.

- ఈవెంట్స్‌లో ‘మేబీ’ అనే కొత్త ఆప్షన్ జోడించారు. అలాగే ఈవెంట్స్ ప్రారంభ సమయం నుంచి ముగింపు సమయాన్ని జోడించే సదుపాయాన్ని కూడా వాట్సప్ తీసుకొచ్చింది.
- ఐఫోన్ యూజర్ల కోసం ప్రత్యేకంగా డాక్యుమెంట్లను స్కాన్ చేసి పంపించే సదుపాయాన్ని తీసుకొచ్చింది. అటాచ్‌మెంట్ విభాగంలో ‘స్కాన్ డాక్యుమెంట్స్’ ద్వారా ఈ సదుపాయాన్ని పొందొచ్చు. ఐఫోన్ యూజర్లు కావాలనుకుంటే వాట్సప్‌ను తమ డిఫాల్ట్ కాలింగ్ యాప్‌గా వినియోగించుకోవచ్చు.
- ఐఫోన్ యూజర్లు వీడియో కాల్‌లో ఉన్నప్పుడు వేలితో జూమ్ కూడా చేసుకోవచ్చు. వీడియో కాల్ క్వాలిటీని సైతం మెరుగుపరిచినట్లు వాట్సప్ పేర్కొంది.
- వాట్సప్ ఛానల్ అడ్మిన్లు ఇకపై 60 సెకన్ల షార్ట్ వీడియోను తమ ఫాలోవర్లతో పంచుకోవచ్చు. రెగ్యులర్ చాట్ తరహాలోనే ఛానల్‌లోనూ వాయిస్ మెసేజ్ తాలుకా టెక్ట్స్ ట్రాన్స్‌స్క్రిప్ట్ అయ్యి కనిపిస్తుంది.

# సూచీలు రయ్ రయ్..



## 22,800 ఎగువకు నిఫ్టీ

**ముంబయి:** ప్రపంచ దేశాలపై విధించిన టారిఫ్‌లకు 90 రోజుల పాటు బ్రేక్ వేస్తున్నట్లు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడంతో మన మార్కెట్లు నేడు దూసుకెళ్లాయి. అమెరికా, చైనా మధ్య ఓ వైపు సుంకాల పోరు కొనసాగుతున్నా.. మన మార్కెట్లు మాత్రం భారీ లాభాల్లో ముగియడం గమనార్హం. అన్ని రంగాల షేర్లలో కొనుగోళ్ల మద్దతుతో ప్రధాన సూచీలు బలంగా పుంజుకొన్నాయి. ఈ క్రమంలో సెన్సెక్స్ 1300 పాయింట్ల మేర లాభపడగా.. నిఫ్టీ మళ్లీ 22,800 స్థాయిని దాటింది. మదుపర్ల సంపదగా భావించే బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ దాదాపు రూ.7.72 లక్షల కోట్లు పెరిగి రూ.401.54 లక్షల కోట్లకు చేరింది. ఆసియా, జపాన్ మార్కెట్లు నష్టాలు చవిచూడగా.. షాంఘై, హాంకాంగ్ మార్కెట్లు లాభాల్లో ముగియడం గమనార్హం. ట్రంప్ విరామ ప్రకటనతో మరుసటి రోజే మన సూచీలు దూసుకెళ్లాల్సి ఉన్నా.. మహావీర్ జయంతి కారణంగా నిన్న మార్కెట్లు పనిచేయలేదు. దీంతో ఈ ఉదయం అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు ఉన్నప్పటికీ సూచీలు లాభాల్లో ప్రారంభం అయ్యాయి. సెన్సెక్స్ ఉదయం 74,835.49 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 73,847.15) దాదాపు వెయ్యి పాయింట్ల లాభంతో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 75,467.33 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 1310.11 పాయింట్ల లాభంతో 75,157.26 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 429.40 పాయింట్ల లాభంతో 22,828.55 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ రూ.86.05గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టీసీఎస్, ఏషియన్ పెయింట్స్ షేర్లు మినహా మిగిలిన అన్ని షేర్లూ లాభాల్లో ముగిశాయి. టాటా స్టీల్, పవర్ గ్రిడ్ కార్పొరేషన్, ఎన్టీపీసీ, కోటక్ మహీంద్రా బ్యాంక్, రిలయన్స్ షేర్లు రాణించాయి. ఫార్మా, మెటల్ స్టాక్స్ ప్రధానంగా రాణించాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 63.65 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం దూసుకెళుతోంది. ఔన్సు 3248 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

### కారణాలు ఇవీ..

- భారత్ సహా 75 దేశాలపై విధించిన టారిఫ్‌లను ట్రంప్ 90 రోజుల పాటు నిలుపుదల చేస్తున్నట్లు ప్రకటించడం మన మార్కెట్లకు ఊరటనిచ్చింది. వాణిజ్య యుద్ధ భయాల నేపథ్యంలో ఈ ప్రకటన మార్కెట్లకు కొత్త ఉత్సాహాన్నిచ్చింది.
- డాలరు విలువ క్షీణించడం కూడా భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న మార్కెట్లకు ప్రయోజనకరమని నిపుణులు చెబుతున్నారు. డాలర్ ఇండెక్స్ తాజాగా 100 దిగువకు చేరింది.
- నిఫ్టీ మెటల్ ఇండెక్స్ (4 శాతం), నిఫ్టీ ఫార్మా ఇండెక్స్ (3 శాతం)తో పాటు నిఫ్టీ ఆటో, హెల్త్‌కేర్, ఫైనాన్షియల్, ఐటీ తదితర రంగాల షేర్లు రాణించడం కూడా మార్కెట్ల దూకుడుకు కారణమయ్యాయి.
- అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధర 63 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. దిగుమతులపై ఆధారపడే మన దేశానికి ఇదో పాజిటివ్ అంశమని అనలిస్టులు చెబుతున్నారు.

## హీరో ప్యాషన్ ప్లస్ 2025 మోడల్ విడుదల.. మార్పులేమిటి?




ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ హీరో మోటోకార్ప్ తన ద్విచక్ర వాహనశ్రేణిని అప్‌డేట్ చేస్తూ వెళ్తోంది. ఏప్రిల్ 1 నుంచి విక్రయించే అన్ని మోడళ్లూ బీఎస్6 ఫేజ్–2 ఓబీడీ–2బీ కఠిన ఉద్గార నిబంధనలు అనుసరించాలన్న కేంద్ర ప్రభుత్వ ఆదేశాలమేరకు.. ఆ ప్రమాణాలతో రూపొందిన మోడళ్లను ఒక్కొక్కటిగా విడుదల చేస్తోంది. 2025 స్ప్లెండర్ ప్లస్ శ్రేణి బైక్‌లను లాంచ్ చేసిన ఆ కంపెనీ.. తాజాగా 2025 మోడల్ ప్యాషన్ ప్లస్‌ను విడుదల చేసింది. దీని ధరను రూ.81,651 (ఎక్స్‌షోరూమ్)గా నిర్ణయించింది. కొత్త ప్యాషన్ ప్లస్‌లో 97.2 సీసీ సింగిల్ సిలిండర్ ఎయిర్‌కూల్డ్ ఇంజిన్ ఇచ్చారు. ఇది 8 హెచ్‌పీ పవర్‌ను, 8.05 ఎన్ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. 4 స్పీడ్ గేర్‌బాక్స్ వెల్ మల్టీ ప్లేట్ క్లచ్‌తో వస్తోంది. స్ప్లెండర్, హెచ్ఎఫ్ డీలక్స్ మోడళ్లలోనూ ఇదే ఇంజిన్‌ను అమర్చారు. బ్లాక్ నెక్సస్ బ్లూ, బ్లాక్ హెవీ గ్రే రంగుల్లో లభిస్తుంది. ఫీచర్ల విషయానికొస్తే.. డిజిటల్, అనలాగ్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్‌తో వస్తోంది. ఐడల్ స్టాప్– స్టార్ట్ సిస్టమ్ ఉంది. సైడ్ స్టాండ్ ఇండికేటర్, మొబైల్ ఛార్జింగ్ పోర్ట్ వంటి ఆప్షన్లతో వస్తోంది. ముందువైపు టెలిస్కోపిక్ ఫ్రంట్ సస్పెన్షన్, వెనకవైపు ట్విన్ ట్యూబ్ షాక్ అబ్జార్బర్స్ ఇచ్చారు. ముందూ, వెనక డ్రమ్ బ్రేకులు, 18 అంగుళాల అల్లాయ్ వీల్స్‌తో వస్తోంది. గతేడాది మోడల్‌తో పోలిస్తే ఆధునికీకరించిన మోడల్ ధర దాదాపు రూ.1750 మేర అధికం.

## గూగుల్‌లో మళ్లీ లేఆఫ్‌లు..

### ఆండ్రాయిడ్, పిక్సెల్‌లో వందల ఉద్యోగాల కోత

టెక్ దిగ్గజం గూగుల్ మరోమారు లేఆఫ్‌ల ప్రక్రియ చేపట్టింది. తమ ప్లాట్‌ఫామ్, డివైజ్ యూనిట్లలో పనిచేసే వందల మంది ఉద్యోగులను తొలగించింది. ఆండ్రాయిడ్ సాఫ్ట్‌వేర్, పిక్సెల్ ఫోన్లు, క్రోమ్ బ్రౌజర్లలో పనిచేసే ఉద్యోగులపై ఈ వేటు పడినట్లు తెలుస్తోంది. ఈమేరకు కంపెనీకి చెందిన విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ ‘ది ఇన్ఫర్మేషన్’ అనే మీడియా సంస్థ కథనం వెల్లడించింది. అయితే కచ్చితంగా ఎంతమందిని తొలగించారన్న విషయంపై మాత్రం స్పష్టత లేదు. కాగా.. కంపెనీ పునర్వ్యవస్థీకరణ ప్రక్రియలో భాగంగా గత రెండేళ్లలో గూగుల్ అనేక మందిని విధుల నుంచి తప్పించింది. గతేడాది డిసెంబరులో మేనేజర్, డైరెక్టర్లు, వైస్ ప్రెసిడెంట్ హోదాల్లో పనిచేస్తున్న వారిలో 10 శాతం మందికి లేఆఫ్‌లు ప్రకటించింది. ఇక, ఈ ఏడాది ఫిబ్రవరిలో హెచ్ఆర్ విభాగం, క్లౌడ్ ఆర్గనైజేషన్‌లో కొంతమందిని తొలగించింది. ఖర్చు తగ్గింపులో భాగంగా కంపెనీ ఈ నిర్ణయం తీసుకుంది. గూగుల్‌లో 20 శాతం మంది మరింత సమర్థంగా పనిచేయాలని గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ 2022లో వెల్లడించారు. ఆ మరుసటి ఏడాదే 12 వేల మంది ఉద్యోగులను గూగుల్ తొలగించింది. ఓపెన్ఏఐ వంటి సంస్థలు సెర్చింజిన్‌ను తీసుకొస్తుండడంతో గూగుల్‌కు గట్టిపోటీ తప్పదని విశ్లేషకులు భావిస్తున్న వేళ ఈ తొలగింపులు చేపట్టడం గమనార్హం. ఇక, అమెరికాలో విదేశీ నిపుణులపై ట్రంప్ కఠిన నిబంధనలు అమలు చేస్తున్న సమయంలో ఈ లేఆఫ్ వార్తలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అటు మరో టెక్ సంస్థ మైక్రోసాఫ్ట్ కూడా మే నెలలో మరోసారి ఉద్యోగాల కోతలు చేపట్టనున్నట్లు కథనాలు వస్తున్నాయి.




# విశ్వంభర రామరామ పాట ప్రోమో విడుదల

చిరంజీవి హీరోగా వశిష్ఠ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం'విశ్వంభర.' యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమాపై అభిమానుల్లో అంచనాలు తారస్థాయికి చేరుకున్నాయి. ఈ చిత్రం నుంచి తొలి గీతం 'రామ రామ'ను ఈ శనివారం విడుదల చేయనున్నట్లు చిత్రబృందం అధికారికంగా పోస్టర్ రిలీజ్ చేసింది. పోస్టర్‌లో చిరంజీవి చుట్టూ పిల్లలు హనుమంతుడి వేషధారణలో ఉన్నారు. అలాగే బ్యాక్‌డ్రాప్‌లో రాముడి విగ్రహం ఉంది. 'రామ రామ' పాటను రామజోగయ్య శాస్త్రి రాయగా, ఎం.ఎం.కీరవాణి స్వరపరిచారు. కాగా, ఈ చిత్రంలో త్రిష కృష్ణన్, ఆశికా రంగనాథ్ హీరోయిన్లు. కునాల్ కపూర్ కీలక పాత్రలో నటిస్తున్నారు.

# కేన్స్‌కు జాన్వీ చిత్రం..

## భారతీయ సినిమా ప్రపంచాన్ని ఆకర్షిస్తోందంటూ పోస్ట్

నీరజ్ ఘైవాన్ దర్శకత్వంలో వచ్చిన రెండో చిత్రం 'హోమ్ బౌండ్'. ఈ సినిమాలో ఇషాన్ ఖట్టర్, జాన్వీకపూర్ కీలక పాత్రల్లో నటించారు. ఇప్పుడీ సినిమా ఈ ఏడాది కేన్స్‌లో ప్రదర్శితం కానుంది. ఈ విషయంపై ఆనందం వ్యక్తంచేస్తూ జాన్వీకపూర్ పోస్ట్ పెట్టారు. "భారతీయ సినిమా ప్రపంచాన్ని ఆకర్షించే క్షణాలివి. 78వ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో 'హోమ్ బౌండ్' సందడి చేయనుంది. ఇది మా టీమ్‌కు దక్కిన గౌరవంగా భావిస్తున్నా. మా హృదయాలు ఆనందంతో నిండిపోయాయి. దీన్ని మీ అందరి ముందుకు తీసుకురావడం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాం" అని ఇన్‌స్టాలో పోస్ట్ పెట్టారు. ఇక ఈ ఏడాది కేన్స్‌కు ఎంపికైన ఏకైక భారతీయ చిత్రం ఇదే కావడం విశేషం. దీనిపై నిర్మాత కరణ్ జోహార్ కూడా స్పందించారు. 'భారతీయ సినిమా శక్తికి 'హోమ్ బౌండ్' నిదర్శనం. మన కథల గొప్పతనం ప్రపంచానికి తెలుస్తోంది. ఈ విజయం మనం చిత్ర పరిశ్రమది. రానున్న చిత్రాలకు ఇది ఆశాకిరణం' అని ఇన్‌స్టాలో పోస్ట్ పెట్టారు. హైదరాబాద్‌కు చెందిన నీరజ్ దర్శకత్వంలో వచ్చిన తొలి చిత్రం కూడా కేన్స్‌లో ప్రదర్శించారు. 2015లో ఇండస్ట్రీకి వచ్చిన ఆయన 'మసాన్' చిత్రం తెరకెక్కించారు. రిచా చద్దా, విక్కీ కౌశల్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమా 2015లో కేన్స్‌లో ప్రదర్శించారు. ఇప్పుడు రెండో సినిమా కూడా ఈ ఫిల్మ్ ఫెస్టివల్‌కు ఎంపిక కావడంతో ఆయన్ని అందరూ అభినందిస్తున్నారు. 78వ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ ఈ ఏడాది మే 13 నుంచి 24 వరకు ఫ్రాన్స్ వేదికగా జరగనుంది. ఈ చిత్రోత్సవాలకు సంబంధించిన వివరాలను నిర్వాహకులు గురువారం వెల్లడించారు.



# మే 9న హరిహరవీరమల్లు విడుదల

## ర్యూమర్స్‌కు చెక్ పెట్టిన మూవీ మేకర్స్



పవర్ స్టార్ పవన్ కల్యాణ్ హీరోగా పాన్ ఇండియా రేంజ్‌లో తెరకెక్కుతోన్న సినిమా 'హరిహర వీరమల్లు'. క్రిష్, జ్యోతికృష్ణ దర్శకత్వంలో రూపొందుతోంది. తొలిభాగం 'హరిహర వీరమల్లు పార్ట్ 1: స్వార్డ్ వర్సెస్ స్పిరిట్' పేరుతో రిలీజ్ కానుంది. మెగా సూర్య ప్రొడక్షన్స్ పతాకంపై ఎ.దయాకర్‌రావు నిర్మిస్తున్న ఈ చిత్రం మే 9న విడుదల అవుతున్నట్లు– ఇప్పటికే మేకర్స్ ప్రకటించారు. అయితే హరిహర వీరమల్లు విడుదల ఆలస్యం కానున్నట్లు– కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఈ రూమర్స్‌పై మేకర్స్ క్లారిటీ ఇచ్చారు. మే 9న హరిహర వీరమల్లు సినిమాను విడుదల చేయనున్నట్లు– మేకర్స్ సోషల్ మీడియాలో తెలిపారు. 'రీ రికార్డింగ్, డబ్బింగ్, వీఎఫ్ఎక్స్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మెరుపు వేగంతో పనులు దూసుకుపోతున్నాయి. ఈ వేసవికి అద్భుతమైన సినిమాను ప్రేక్షకులకు అందిస్తాము. మే 9న హరిహర వీరమల్లు బిగ్ స్క్రీన్‌లలో విడుదల అవుతుంది. మునుపెన్నడూ చూడని సినిమాటిక్ అనుభూతికి ప్రేక్షకులు సిద్ధంగా ఉండండి' అని మేకర్స్ ట్వీట్ చేశారు. పవన్‌కు సంబంధించిన ఓ కొత్త పోస్టర్‌ను సైతం రిలీజ్ చేశారు. ఈ పోస్టుతో నెట్టింట రూమర్స్‌కు ఫుల్‌స్టాప్ పెట్టారు. హరిహర వీరమల్లు సినిమా రెండు భాగాలుగా రానుంది. తొలిభాగం 'హరిహర వీరమల్లు పార్ట్ 1: స్వార్డ్ వర్సెస్ స్పిరిట్' పేరుతో విడుదల కానుంది. ఈ చిత్రానికి ఎంఎం కీరవాణి మ్యూజిక్ అందిస్తున్నారు. ఇందులో పవన్ కళ్యాణ్ సరసన నిధి అగర్వాల్ నటించారు. అనుపమ్ ఖేర్, బాబీ దేవోల్, నోరా ఫతేహి, విక్రమ్ జీత్, జిషుసేన్ గుప్త తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. పవన్ ప్రస్తుతం రాజకీయాల్లో బిజీగా ఉండడంతో ఈ సినిమా షూటింగ్ లేట్ అయింది. ముందుగా మార్చి 28న విడుదల చేయాలని భావించినా.. మే 9కు వాయిదా వేశారు.

# నెగెటివ్ ప్రచారాలపై మండిపడ్డ త్రిష

సోషల్‌మీడియా వేదికగా నెగెటివిటీని వ్యాప్తి చేసే వారిపై నటి త్రిష అసహనం వ్యక్తంచేశారు. వారిది విషపూరితమైన స్వభావం అని పేర్కొన్నారు. ఇతరులపై బురద జల్లడమే వారి పనన్నారు. విషపూరితమైన వ్యక్తులు.. అసలు మీరెలా జీవిస్తున్నారు? మీకు ప్రశాంతంగా నిద్ర ఎలా పడుతుంది? ఖాళీగా కూర్చొని ఇతరులను ఉద్దేశించి సోషల్‌మీడియాలో పిచ్చిపిచ్చి పోస్టులు పెట్టడమేనా మీ పని, మిమ్మల్ని చూస్తుంటే నిజంగా భయమేస్తుంది. అని త్రిష ఇన్‌స్టా వేదికగా పోస్ట్ పెట్టారు. త్రిష ఈవిధమైన పోస్టులు పెట్టడం ఇదేమీ తొలిసారి కాదు. తప్పుడు కథనాలు వ్యాప్తి చేసే వారిపై గతంలోనూ ఆమె మండిపడ్డారు. వారి ప్రవర్తన ఏమీ బాగోలేదన్నారు. అలాంటి వారి మాటలు పట్టించుకోనని చెప్పారు. ఉన్నట్టుండి త్రిష ఈవిధంగా పోస్టు పెట్టడానికి కారణం లేకపోలేదు. ఆమె నటించిన తాజా చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ' గురువారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఇందులో ఆమె రోల్‌ను కొంతమంది మెచ్చుకుంటున్నారు. ఆమె అందంగా కనిపించారని అంటున్నారు. మరికొంతమంది మాత్రం ఆమె యాక్టింగ్ ఏమీ బాలేదంటున్నారు. తమిళం తెలిసినప్పటికీ సినిమాలోని తన పాత్రకు వేరే వారితో డబ్బింగ్ చెప్పించడం ఏమిటని ఆమెను ప్రశ్నిస్తున్నారు. ఈమేరకు ఆమె గురించి నెగెటివ్ పోస్టులు పెడుతున్నారు.






# మాస్ జాతరతో వస్తోన్న రవితేజ

వరుసగా చిత్రలు ఫెయిల్ అవుతున్నా...గ్యాప్ లేకుండా సినిమాలు చేస్తూ తన ఎనర్జీని ప్రూవ్ చేస్తూ మాస్ మహారాజా రవితేజ దూసుకెళ్తున్నారు. –టైగర్ నాగేశ్వరరావు, ఈగెల్ సినిమాల తర్వాత మిస్టర్ బచ్చన్ సినిమా ద్వారా ప్రేక్షకులను పలకరించిన రవితేజకు ఆశించిన ఫలితం మాత్రం రాలేదు. దీంతో ఎలాగైనా హిట్ కొట్టాలనే పట్టుదలతో మరో మాస్ మూవీతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. ఇందులో భాగంగానే భాను బోగవరపు దర్శకత్వంలో రూపొం దుతున్న 'మాస్ జాతర' అనే పవర్‌ఫుల్ టైటిల్ పెట్టారు. రవితేజ కెరీర్‌లో ఇది 75వ సినిమా కావడంతో ఫ్యాన్స్‌లో ఈ సినిమాపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి.సూర్యదేవర నాగవంశీతో పాటు సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో రవితేజ సరసన శ్రీలీల హీరోయి–న్‌గా మరోమారు జోడి కట్టింది.




Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com